

# గిల్గామేష్ చరిత్ర

(ప్రపంచపు
తొలి ఇతిహాసం)




**Dr. Lanka Siva Rama Prasad**

**డాక్టర్ లంకా శివరామప్రసాద్**

# గిల్గామేష్ చరిత్ర

(ప్రపంచపు తొలి ఇతిహాసం)



డాక్టర్ లంకా శివరామప్రసాద్

**Dr. Lanka Siva Rama Prasad**

# గిల్గామేష్ చరిత్ర
## (ప్రపంచపు తొలి ఇతిహాసం)

by

**Dr. Lanka Siva Rama Prasad**

July 2019

All rights reserved

Copyright @ 2019
**Dr. Lanka Siva Rama Prasad**

For Copies:
**Dr. Lanka Siva Rama Prasad**
**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002,
Telangana, INDIA
Mobile : 8897849442, 6305677926
Email: lankasrprasad@gmail.com
**www.anuvaadham.com**

Price : ₹ **200** **$ 4**

Cover Design & Post Script :
**Prakash Pula**

Printed at :
**Vasavi Printers**
J.P.N. Road, Warangal. Ph : 0870-2426364

***This book is presented to...***

# ప్రస్తావన

భూమి–స్వర్గలోకాల రాణిగా తొలి ప్రేమదేవతగా ప్రఖ్యాతి పొందిన ఇనాన్నా (Ishtar, Astarte, Aphrodite, Venus) చరిత్రను అనువాదం చేస్తున్నప్పుడే ఆమెకు సాయం చేసిన మహావీరుడు గిల్గామేష్ కావ్యాన్ని తెలుగులోకి తీసుకురావాలని సంకల్పించాను.

తెలుగు జానపద కథల్లోని సాహసవీరుడిలా కానవచ్చే గిల్గామేష్ కావ్యంలో అంతర్లీనంగా ఉన్న కథాంశం– శాశ్వత జీవనానికై అన్వేషణ. మృత్యువును జయించాలన్న ఆకాంక్ష.

రెండు వంతులు దేవుడు ఒకవంతు మనిషి అయిన గిల్గామేష్‌లో దేవతలకుండే సహజ గుణాలు, శక్తులు, మానవుడికుండే బలహీనతలు, మృత్యువు కలిసి ఉండడంతో తానూ అమరుడిని కావాలని అతడు చేసే దీర్ఘ ప్రయాణం, మనిషికి మృత్యువు తప్పదన్న గ్రహింపుతో ముగుస్తుంది. పాత్రల వర్ణన అద్భుతంగా, భయంకరంగా అనిపించినా, వాటి ప్రవర్తన సాధారణ మనుషుల్లాగే ఉండడంతో కథ కొంత సాదాసీదాగా నడుస్తుంది. చాలా విషయాలు మనం మన ఊహలతో వాస్తవాతీతంగా నిర్మించుకోడానికి కథ అనువుగా వుంటుంది.

ప్రపంచ చరిత్రలో తొలి కావ్యాలైన గిల్గామేష్, ఇనాన్నాల చరిత్రలను అనువాదం చేసి తెలుగు సాహితీలోకానికి సృజనలోకం అందిస్తున్నది. ఎప్పటిలానే సహృదయంతో ఆదరిస్తారని విశ్వసిస్తూ...

**– డాక్టర్ లంకా శివరామప్రసాద్**

# 1. ఎవరీ గిల్గామేష్?

దేవతలతడిని పరిపూర్ణమైన దేహసౌష్ఠవంతో నిర్మించినారు. 'షామాష్' సూర్యుడతడికొసగినాడు అద్భుత సౌందర్యాన్ని. తుఫాను వర్షాల దేవుడు 'అదాద్' ఇచ్చినాడు ఎంతకూ తరగని ధైర్యాన్ని;

రెండు వంతుల దేవుడు ఒక వంతు మనిషి గిల్గామేష్ 'ఉరుక్' నగరాన్ని దుర్భేధ్యమైన కోటగోడలు, బురుజులతో నిర్మించినాడు. అంతరిక్షపు దేవుడైన 'అను' (Anu), ప్రేమదేవత 'ఇస్తార్'కు 'ఇవన్నా'లో దేవాలయాన్ని కట్టినవాడతడు. బయటి కోట రాగి రంగులో, లోపలి కోట లోహపు రంగులో మెరుస్తూ ప్రాచీన ద్వారాలు అత్యంత పటిష్ఠంగా ఉండేట్లు నిర్మించినాడు. అతడికి సాటి రాగల మానవుడు లేడు. ప్రపంచ దేశాల రహస్యాలు తెలిసినవాడు, ప్రళయకాలపు వరద గాథను శిలలపై చెక్కించినవాడు, మృత్యు రహస్యపు అన్వేషణలో దీర్ఘయాత్ర చేసినవాడతడు.

నమ్మశక్యం కావడం లేదా? ఇటురా! ఈ ఉరుక్ నగరపు కోటగోడను ఎక్కి నడువు కాసేపు. బలిష్ఠమైన పునాదులు, అగడ్తలు, బురుజుల నిర్మాణశైలిని పరికించు. సప్తర్షులు పునాది వేసిన కోట ఇది.

అంతటి మహా నిర్మాణాన్ని గావించిన వీరుడు, అరివీర భయంకరుడు, అపరిమిత శక్తిశాలి, ఉరుక్ నగర పాలకుడు– గిల్గామేష్.

# 2. దేవుళ్లు - దేవతలు; ఊళ్లు-పట్టణాలు

**అదాద్ (Adad) :** తుఫాను, వర్షాలు, వాతావరణపు అధిదేవత

**అనున్నాకి (Anunnaki) :** పాతాళలోక దేవుడు; యముడు

**అన్‌షాన్ (Anshan) :** పర్షియాలో నైరుతీ ప్రాంతం; 'విల్లు' తయారీకి ప్రసిద్ధి.

**అన్‌టమ్ (Antum) :** 'అను' దేవుడి భార్య.

**అను (Anu) :** దేవతల తండ్రి; అంతరిక్షపు అధిపతి

**అప్సు (Apsu) :** అగాధం; భూమి కింద ఉండే ప్రాచీన జలాలు

**అరురు (Aruru) :** సృష్టికర్త-దేవత- 'ఎంకిడు'ను మట్టినుంచి తయారుచేసినది.

**అయా (Aya) :** సంధ్య; సూర్యుడి వధువు

**బెలిత్-షెరి (Belit-Sheri) :** చిత్రగుప్తురాలు (పాతాళలోకపు వ్రాయసగత్తె)

**స్వర్గ వృషభం (Bull of Heaven) :** కరువుకు చిహ్నం

**దిల్‌మన్ (Dilmun) :** సుమేరియన్ స్వర్గం

**దుముజి (Dumuzi) :** తమ్ముజ్, సంతానోత్పత్తి, మొక్కలదేవుడు

**ఇయా (Ea) :** మంచినీళ్లకు, విజ్ఞానానికి దేవుడు (ఎరిడు దేశం)

**ఇయన్నా (Eanna) :** అను, ఇస్తార్‌ల గుడులున్న ప్రాంతం (ఇవన్నా)

**ఇగాల్మా (Egalmah) :** గిల్గామేష్ తల్లి; నిన్‌సున్ రాజప్రాసాదం

**ఎందుకుగ్గా (Endukugga) :** పాతాళలోకపు దేవత- ఎన్‌లిల్ తండ్రి

**ఎంకిడు (Enkidu) :** మట్టిమనిషి, గిల్గామేష్ సహచరుడు

**ఎన్‌లిల్ (Enlil) :** భూమి, వాయువుల అధిదేవుడు. అన్-కి ల కుమారుడు

**ఎన్నుగి (Ennugi) :** కాలువల అధిదేవుడు

**ఎనుమా ఎలిష్ (Enuma Elish) :** మార్దుక్ చరిత్ర తెలిపే ఇతిహాసం

**ఎరెష్కిగల్ (Ereshkigal) :** పాతాళలోకపు రాణి

**ఎతనా (Etana) :** ప్రళయకాలపు వరద తర్వాత 'కిష్'ను పాలించిన రాజు

**గిల్గామేష్ (Gilgamesh) :** నిన్‌సున్-కుల్లబ్ ల కుమారుడు

**హనిష్ (Hanish) :** తుఫానులను తెచ్చేవాడు

**హుంబాబా (Humbaba, Huwawa) :** దేవదారు అడవి రక్షకుడు

**ఇగిగి (Igigi) :** దేవతల కూటమి

**ఇరకాల్లా (Irakalla) :** ఎరెష్కిగల్ మరోపేరు

**ఇస్తార్ (Ishtar) :** ఇనాన్నా, ప్రేమదేవత, స్వర్గలోకపు రాణి, యుద్ధదేవత

**ఇషుల్లానా (Ishullana) :** తోటమాలి, ఇస్తార్ ప్రేమను తిరస్కరించగా కప్పగా శపించబడినవాడు.

**కి (Ki) :** భూమి

**కుల్లాబ్ (Kullab) :** ఉరుక్‌లో ఓ ప్రాంతం

**లుగుల్ బందా (Lugulbanda) :** గిల్గామేష్ రక్షకుడు, రాజు, దేవుడు

**మగన్ (Magan) :** పశ్చిమభూమి. పాతాళలోకం

**మగిలమ్ (Magilum) :** మృతులు ప్రయాణించే పడవ

**మమ్మేతమ్ (Mammetum) :** విధి దేవత

**మగ తేలు (Man-Scorpion) :** వృశ్చికదేవుడు, నరవృశ్చికుడు

**మాషు (Mashu) :** కవలలు, రెండు శిఖరాల పడమటి కొండ

**నమ్‌తార్ (Namtar) :** ఎరెష్కిగల్ దూత

**నెదు (Nedu) :** పాతాళలోకపు ద్వారపాలకుడు (Neti-నేతి)

**నెర్గల్ (Nergal) :** ప్లేగు దేవత, ఎరెష్కిగల్ భర్త

**నిందుకుగ్గా (Nindukugga) :** ఎందుకుగ్గా భార్య; పాతాళలోకపు నివాసులు

**నిన్‌గాల్ (Ningal) :** చంద్రుడి భార్య; సూర్యుడి తల్లి

**నిన్‌గిర్సు (Ningirsu) :** సాగునీటికి, ప్రత్యుత్పత్తి దేవుడు

**నిన్‌గిజ్జిద (Ningizzida) :** జీవవృక్షపు దేవుడు

**నిన్‌హుర్‌సాగ్ (Ninhursag) :** ప్రకృతిమాత; భూమి.

**నిన్‌కి (Ninki) :** ఎన్‌లిల్ తల్లి

**నిన్‌లిల్ (Ninlil) :** 'స్వర్గం, భూమి, వాయుదేవత; ఎన్‌లిల్ భార్య

**నిన్‌సున్ (Ninsun) :** గిల్గామేష్ తల్లి

**నినుర్తా (Ninurta) :** యుద్ధదేవుడు, దక్షిణగాలి

**నిసాబా (Nisaba) :** ధాన్యదేవత

**నిసిర్ (Nisir) :** ముక్తి పర్వతం (అరారత్ పర్వతం)

**పుజుర్-అముర్రి (Puzur Amurri) :** కర్ణధారి-ఉత్నాపిష్టమ్ పడవ సరంగు

**సాముకాన్ (Samuqan) :** పశుపతి

**సప్తర్షులు (Seven Sages) :** సప్త నగరాలకు నాగరికత తెచ్చినవాళ్లు

**షామాష్ (Shamash) :** సూర్యుడు; చంద్రుడి కొడుకు; ఇస్తార్ భర్త

**షామ్‌హత్ (Shamhat) :** వేశ్యాయువతి

**షల్లాత్ (Shullat) :** దివ్యుల వార్తాహరుడు

**షల్పే (Shulpae) :** విందుల దేవుడు

**షుర్రుపాక్ (Shurrupak) :** ప్రాచీన నగరం

**సిదూరి (Siduri) :** మధువుకు దేవత, యువతి

**సిలిలి (Silili) :** దివ్య అశ్వమాత

**సిన్ (Sin) :** చంద్రుడు; సూర్యుడికి, ఇస్తార్‌కు తండ్రి; ఎన్‌లిల్-నిన్‌లిల్‌ల కుమారుడు

**దముజి (Damuzi) :** Tammuz - ఇస్తార్ భర్త; పచ్చదనపు దేవుడు

**ఉబారా తుతు (Ubara-Tutu) :** ఉత్నాపిష్టిమ్ తండ్రి

**ఊర్షనాబి (Ursha nabi) :** ఉత్నాపిష్టిమ్ పడవను మృత్యుజలాలపై నడిపేవాడు

**ఉరుక్ (Uruk) :** ఎరిక్, వార్కా - అతిప్రాచీన నగరం

**ఉత్నాపిష్టిమ్ (Utnapishtim) :** జీవితాన్ని చూసినవాడు. జలప్రళయంలో బదికినవాడు, భాగవత పురాణంలో సత్యవ్రతుడు; బైబిల్‌లో నోవా

# 3. గిల్గామేష్ - ఎంకిడు

నిన్‌సున్ దేవత, కుల్లబ్ పూజారి కుమారుడు, లుగుల్ బందా అంశతో జన్మించినవాడు, రెండు వంతులు దైవాంశ, ఒక వంతు మానవాంశ కలిగిన మహావీరుడు, ప్రపంచమంతా తిరిగి యుద్ధాలలో తనకెవరూ సాటిలేరనిపించు కున్న యోధుడు గిల్గామేష్ 'ఉరుక్' నగరానికి రాజు. రాజుగా సమర్థుడే కాని ప్రజలు ఈ విధంగా ఆవేదన చెందినారు– "గిల్గామేష్ మహావీరుడే గాని నిరంకుశుడు. కామేచ్ఛ తీవ్రమై పగలు రాత్రి లేకుండా, ఆడ మగా తేడా తెలీకుండా శృంగారకేళిలో మునిగి తేలుతున్నాడు. ఏ కొడుకూ తన తండ్రి వద్ద లేడు. చిన్నా పెద్దా, వావివరుసా లేదు. రాజు అంటే గొర్రెలకాపరిలా తన ప్రజలను రక్షించాలి. కాని ఇతడి కామాగ్నిని దాటి ఏ కన్యా తన ప్రేమికుడిని చేరుకోలేదు. ఏ యోధుడి కుమార్తె, ఏ ఉన్నతవ్యక్తి భార్య కూడా ఇతడి కామానికి బలికాకుండా లేదు. ఇతడిని ఎదిరించి నిలబడే శక్తి ఎవరికీ లేదు. కాని, అతడు మా నగరానికి రాజు, మా గొర్రెలకాపరి, తెలివిగలవాడు, మొండివాడు"–

వాళ్ల దుఃఖాన్ని ఆలకించినారు నగర దేవతలు. వాళ్లు ఉరుక్ దేవుడికి, అంతరిక్షానికి దివ్యలోకానికి అధిపతి అయిన 'అను' దేవేంద్రుడికి మొరపెట్టు కున్నారు– "ఏ దేవత చేసిందో ఇతగాడిని, అడివిగిత్త, ఎవరు తట్టుకోగలరు ఇతడికి ఎదురు నిలిచి? ఏ కొడుకూ తన తండ్రి వద్ద లేడు. చిన్నాపెద్దా, వావి వరుసా లేదు. రాజు అంటే గొర్రెల కాపరిలా తన ప్రజలను రక్షించాలి. కాని, ఇతడి కామాగ్నిని దాటి ఏ కన్యా తన ప్రేమికుడిని చేరుకోలేదు. ఏ యోధుడి కుమార్తె, ఏ ఉన్నతవ్యక్తి భార్య కూడా ఇతడి కామానికి బలికాకుండా లేదు"–

'అను' దేవేంద్రుడు చూసాడు మనుషుల్ని తయారుచేసే 'అరురు' దేవత వేపు– "నీవు సృష్టించినవాడే కదా గిల్గామేషు. ఇప్పుడు అతడికి అన్నివిధాల సమానుడైన వ్యక్తిని తయారుచేయి. అతడి మరో రూపులా, ప్రతిబింబంలా ఉండాలి సుమా. తుఫాను గుండెకు ఎదురు తుఫానుగుండెనే నిలబెట్టాలి. వాళ్లిద్దరూ సమాన స్కంధులై పోట్లాడుకుంటుంటే ఉరుక్ నగరం ప్రశాంతంగా ఉండగలదు"–

'అరురు' దేవత చేయిజాపి అంతరిక్షపు ధూళిని, మట్టిని, కాసిని నీళ్లతో తడిపి బొమ్మను చేసి, ప్రాణం పోసి ఎడారి ప్రాంతంలో పడవేసింది. అలా జన్మించాడు 'ఎంకిడు'. యుద్ధదేవుడు 'నినుర్తా' అంశ అతడిలో ఉన్నది. గరుకు శరీరం, పొడుగాటి శిరోజాలు స్త్రీలకున్నట్లు; మొక్కజొన్న దేవత 'నిసాబా' కేశాల్లా గాలికి ఊగుతూ; పశుపతి 'శాముకాన్' కున్నట్లు శరీరమంతా అట్టకట్టిన రోమాలు; అతడికి మనుషుల గురించి తెలీదు. దున్నిన పొలాల గురించీ తెలీదు.

కొండల్లో, లోయల్లో పెరిగే పచ్చగడ్డిని తింటూ, లేళ్లలో ఒకడిగా, ఒక జంతువులా పెరిగినాడు ఎంకిడు. అలా ఓ రోజున అతగాడు ఓ వేటగాడి కంటిలో పడినాడు. వేటగాడు భయంతో కొయ్యబారిపోయినాడు. అతడు మనిషా, మృగమా? నీళ్లు కూడా జంతువు తాగినట్లు తాగుతున్నాడే పడుకుని? ఒళ్లంతా రోమాలు, జంతువులా అరుపులు. మూడురోజులు అతడిని గమనించాడు వేటగాడు. తను జంతువులకై పన్నిన ఉచ్చులన్నీ ధ్వంసమై కనిపించాయి. కోపం వచ్చింది కాని ఏమి చేయగలడు. ఆ అడవిమనిషి మదపుటేనుగులా, చిరుతపులిలా, ఎలుగుబంటిలా కనిపించాడు వేటగాడికి. ఆ అడవిమనిషి చూపు తనపై పడకుండా జాగ్రత్తపడి 'బతుకుజీవుడా' అని ఇంటికిపోయినాడు.

వేటగాడు తన తండ్రితో ఇలా అన్నాడు– "తండ్రీ! అడవిలో నేను చూసాను ఈ కళ్లతో ఓ అడవిమనిషిని. నాగరికతతో ఏ సంపర్కమూ లేకుండా జంతువుల మధ్య బతుకుతున్నవాడిని. మహాబలశాలి, దేవలోకం నుంచి దిగివచ్చిన వాడిలా ఉన్నాడు. కొండల్లో తిరుగుతూ ఆకలేస్తే ఏపుగా పెరిగిన గడ్డిని తిని, జంతువులు తాగినట్లే పడుకుని నీళ్లు తాగుతున్నాడు. వాడిని సమీపించేందుకు ధైర్యం చాల్లేదు. నేను జంతువుల కోసం పెట్టిన ఉచ్చులన్నింటినీ ధ్వంసం చేస్తున్నాడు. ఖాళీ చేతుల్తో నేను తిరిగి రావాల్సివచ్చింది. ఏమి చెయ్యాలో పాలుపోవడం లేదు. ఇలా అయితే మనకు రోజులు గడిచేదెలా?"–

తండ్రి అన్నాడు– "కుమారుడా, ఉరుక్ నగరపు రాజు గిల్గామేష్. సాహస పరాక్రమాలలో సాటిలేనివాడు. దివినుంచి దిగివచ్చిన నక్షత్రమతడు. వెళ్లు, ఉరుక్ నగరానికి వెళ్లి గిల్గామేష్ ప్రభువును కలువు. అతడి వీరత్వాన్ని

కీర్తించు. అప్పుడు చెప్పు ఈ అడవిమనిషి గురించి. అతడిని పట్టుకురావాలంటే మామూలుగా కుదరదని, ఎందుకంటే అతడు అనాగరికుడని తెలియజెప్పు. అతడితో పోరాటం గిల్గామేష్‌కు వన్నె తెస్తుందని మనవిచేయి. అడవి మనిషి వలపన్ని తేవడానికి ఓ అందాలభరిణె, వంపుసొంపుల వయ్యారి, మగవాళ్లను తన చూపుల్తో బంధించి వశం చేసుకోగలిగిన విద్య తెలిసిన నెరజాణ ఓ వేశ్యను నీతో పంపించమని అడుగు. ఆమెను తీసుకుని అడవిలోని నీటిమడుగు వద్దకు తీసుకుని వెళ్లు. అతడు రాగానే ఈమె నగ్నంగా నిలబడి అతడిని ఆకర్షింప జేయమను. ఒక్కసారి ఆమె కౌగిలిలోకి జేరినాడా, అతడిలోని అమాయకత్వం మాయమవుతుంది. జంతువులతడిని తిరస్కరిస్తాయి. తప్పనిసరిగా అతడు మీవెంట రాక తప్పదు"–

తండ్రి మాటలను శ్రద్ధగా విన్నాడు వేటగాడు. ఉరుక్ వెళ్లి గిల్గామేష్‌తో మొరపెట్టుకున్నాడు– "ప్రభూ, నేను కాకులు దూరని కారడవి, చీమలు దూరని చిట్టడవిలో చూసాను ఓ వింతైన అడవి మనిషిని. నీటిమడుగు వద్ద అతడు అచ్చుగుద్దినట్లు మీలానే ఉన్నాడు. మహాబలశాలి. దివి నుంచి దిగివచ్చిన వాడిలా. నాకు అంతులేని భయం వేసింది అతడిని సమీపించాలంటేనే! అతగాడు బండరాళ్లతో నా వలల్ని, ఉచ్చుల్ని ధ్వంసం చేసినాడు. ఏ జంతువూ, పక్షీ నాకు దొరకడం లేదు. తమరే నాకు రక్ష!"

గిల్గామేష్ అన్నాడు– "వేటగాడా, భయం లేదు. అటువంటి వాడిని బంధించడానికి కావాలి ఆటగత్తె. తీసుకువెళ్లు సౌందర్యరాశి, కాముకుల్ని కనుసైగతో పడగొట్టగల వేశ్యాయువతిని. నీటిమడుగు దగ్గర నిలబడమను నగ్నంగా. ఒక్కసారి ఆమెను చూసాడా ఆ అడవిమనిషి, తమకంతో పోయి ఆమెను కౌగిలించుకుంటాడు. ఆ తరువాత అడవి జంతువులతడిని తిరస్కరిస్తాయి"–

వేటగాడు తనతోపాటు వేశ్యాయువతిని వెంటబెట్టుకుని మూడురోజులు ప్రయాణం చేసి చేరుకున్నాడు అడవిలోని నీటిమడుగు వద్దకు. రెండురోజులు అడవిమనిషి జాడ కానరాలేదు. మూడవ రోజు జంతువులు, వాటిమధ్య 'ఎంకిడు'.

వచ్చి నీళ్లు తాగుతున్నారు ఆనందంగా, ఆ యువతి చూసింది అడవిమనిషిని కొండల దగ్గర్నుంచి రావడం.

వేటగాడు అన్నాడు– "అదుగో అతగాడు. ఓ యువతీ! నీవు నీ దుస్తులను విప్పి నగ్నంగా నిలబడు. పూర్ణకుంభాల్లాంటి నీ వక్షోజాలను ప్రదర్శించు. సిగ్గు పడకు. భయం లేదు. అతడిని ఆకర్షించి నీ కౌగిలిలో బందీని చేయి. అతడికి నేర్పు కామకళను, ఇతర విషయాలను. ఒక్కసారి నీ కౌగిలిలో తనను తాను పోగొట్టుకున్నాక అతడిని అడవి జంతువులు తిరస్కరిస్తాయి.

అతడు చెప్పినట్లే ఆ వేశ్య ప్రవర్తించింది. ఆమెను చూడగానే, ఆ అద్భుత నగ్నసౌందర్యాన్ని చూడగానే ఆ అడవిమనిషిలో ఏదో మార్పు. తట్టుకోలేని తమకంతో అతడు పరుగు పరుగున ఆమెను కౌగిలించుకున్నాడు. ఆరు పగళ్లు ఏడు రాత్రులు ఆమె అతడు కామకేళీ విలాసాలలో మునిగి తేలినారు. 'ఎంకిడు' అడవిమనిషికి ఈ కొత్త అనుభవం కొత్త లోకాల్లోకి తీసుకుపోయింది. సంతృప్తి చెందిన అతడు కొండల్లోకి తిరిగి వెళ్లిపోబోయినాడు. జింకలు అతడిని తిరస్కరించాయి. అతడిని భయ భయంగా చూసి పారిపోయినాయి. అడవి జంతువులు మునుపటిలా దగ్గరకు రావడం లేదు. 'ఎంకిడు' వాటితోపాటు పోవాలని తపించినా ఏదో కనబడని బంధం, గట్టి దారంలా అతడిని ఆమెవేపు లాగుతున్నది. పరిగెత్తి పారిపోబోతే కాళ్లు సహకరించనన్నవి. అతడి వేగం తగ్గిపోయింది. నీరసం ఆవహించింది. కాని, ఏదో కొత్తజ్ఞానం.... తాను ఓ మనిషినన్న ఆలోచన. వెనక్కి వచ్చి ఆ వేశ్య పాదాల దగ్గర చతికిలపడినాడు. ఆమె చెప్పిన మాటలు శ్రద్ధగా ఆలకించినాడు– "బాగా తెలివైనవాడివి నీవు. ఎంకిడూ, నీవిప్పుడు దేవుళ్లకు సమానమైన వాడివి. ఇంకా ఎందుకు అడవి జంతువులతో తిరుగుతావు? నాతో రా! నిన్ను ఉరుక్ నగరానికి తీసుకువెళ్తాను. అక్కడ ఇస్తార్, అను దేవుళ్ల గుడి ఉన్నది. దేవతల దయ, ప్రేమతో నిండి ఉన్న దేవాలయమది. అక్కడ నీకు సమ ఉజ్జీ అయిన గిల్గామేష్ ప్రభువున్నాడు. అతడు వీరాధివీరుడు, ప్రజలకు రాజు"–

'ఎంకిడు' ఆనందపడినాడు. తనకో సహచరుడు, తనలాంటి వాడుంటే అంతకన్నా అదృష్టమేమున్నది! –"పద యువతీ! వెళదాం, ఉరుక్ నగరానికి;

అను–ఇస్తార్‌ల దేవాలయమున్న ప్రదేశానికి. గిల్గామేష్ ఉన్న చోటుకు. అతడిని నేను సవాలు చేస్తాను. నేను గిరిపుత్రుడిని, అడవి బిడ్డను. నేను అందరికన్నా సాహసిని, బలంగల వాడిని”

ఆమె అన్నది– “వెళదాం పద! అతడిని చూడనీయి నీ ముఖాన్ని, వర్ఛస్సును. నాకు తెలుసు గిల్గామేష్ ఉండేచోటు. అతడున్నచోటు సుగంధ పుష్పఫలభరితమై ఉంటుంది. ఓ ఎంకిడూ! అక్కడ ఉండేవాళ్లు సౌందర్యంలో, వస్త్రధారణలో సాటిలేనివారు. అక్కడి యువతీ యువకులకు ప్రతిరోజూ పండుగ దినమే. యవ్వనపు పరిమళాలక్కడ రసికుల మనసులను రంజింపజేస్తాయి. అక్కడ నేను నీకు గిల్గామేష్‌ను పరిచయం చేస్తాను. అనేక రకాల ఉద్వేగాలు మానసిక ధోరణులు, అనుభూతుల కలయిక అతగాడు. నిరుపమాన దేహ దారుఢ్యం, శరీర సౌష్ఠవంతో అతడు శౌర్యసాహసాలలో అందరినీ మించినవాడు. నీకన్నా బలవంతుడు. నీ పొగడ్తలు తగ్గించుకో. సూర్యుడు, అను, ఎన్‌లిల్, ఇయా దేవతల ఆశీస్సులు పుష్కలంగా లభించిన వాడతడు. నేను చెబుతున్నాను నీవు ఈ అడవిని వదిలి ఉరుక్‌ను చేరుకోవడానికి ముందే అతడు తెలుసు కుంటాడు కలల ద్వారా నీ రాకను”

గిల్గామేష్ తన తల్లి ‘నిన్‌సున్’ వద్దకు వెళ్లి అన్నాడు– “అమ్మా! రాత్రి నాకో కల వచ్చింది. అందమైన యువతీయువకుల మధ్య ఆనందంగా నేను కాలం గడుపుతూ తారలు మెరుస్తున్న ఆకాశం కింద నడుస్తూన్నపుడు చూసాను ఓ ఉల్క నేలకు రాలడం, దానిని లేపడానికి ప్రయత్నించాను దాని దగ్గరకు వెళ్లి, కాని సాధ్యం కాలేదు. ఉరుక్ ప్రజలందరూ వచ్చి దానిని ఆశ్చర్యంగా చూసినారు తోపులాడుకుంటూ. కొందరు దాని పాదాలను ముద్దాడినారు. అది ఓ స్త్రీ ఆకర్షణలా నాకనిపించింది. దానిని మోసుకు తీసుకువెళ్లేందుకు ప్రజలు నాకు సాయం చేసినారు. నుదుటికి పట్టిన చెమట తుడుచుకుని దానిని పైకి లేవనెత్తి నీవద్దకు తీసుకువచ్చాను. నీవన్నావు అది నా సోదరుడని!”

జ్ఞాని, దేవత అయిన నిన్‌సున్ విన్నది తన కుమారుడి మాటలను– “ఉల్కలా నేలపైకి దూసుకువచ్చిన ఈ పదార్థం ఓ నక్షత్రం. నీవు లేవనెత్త

ప్రయత్నించినపుడు ఎంతో బరువుగా ఉండి కదల్లేదు. కష్టపడి నా దగ్గరకు మోసుకుని వచ్చినావు. నా పాదాల దగ్గర ఉంచినావు. నేను నీకోసం తయారు చేసాను అంకుశం, ముళ్లకర్రను. అది నిన్ను ఓ స్త్రీలా ఆకర్షిస్తున్నది. నీకు స్నేహితుడిగా మెలిగి నీకు సాయం చేస్తుంది. ఇది అడవి జంతువు కాదు అడవి మనిషి. అడవి జంతువులకెల్లా బలిష్ఠమైనవాడు. కొండలు పచ్చిక మైదానాలలో పెరిగినవాడతడు. అతడిని చూసి నీవు సంతోషపడతావు. స్త్రీని ప్రేమించినట్లు నీవతడిని ప్రేమిస్తావు. నిన్ను ఎల్లవేళలా కనిపెట్టుకుని ఉంటాడతడు. ఇది నీకలకు అర్థం"–

గిల్గామేష్ అన్నాడు– "అమ్మా! నాకు ఇంకో కల వచ్చింది. దుర్భేధ్యమైన కోటగోడలతో ఓ గొడ్డలి. దాని ఆకారం వింతగా ఉండగా చూసేందుకు ప్రజలు గుమికూడారక్కడ. నేను కూడా చూసి సంతోషపడినాను. దానిని తీసుకుని నా నడుముకు తగిలించుకున్నపుడు అది నాకిష్టమైన స్త్రీ కౌగిలిలా అనిపించింది.

నిన్‌సున్ అన్నది– "నీకిష్టమైన స్త్రీ కౌగిలింతలా అనిపించిన ఆ గొడ్డలి నేను నీకిస్తున్న సహచరుడు. స్వర్గం నుంచి దిగివచ్చిన వాడిలా కనిపిస్తాడతడు. అవసరమైనపుడు ప్రాణత్యాగానికైనా వెనుదీయని మిత్రుడతడు"–

గిల్గామేష్ ఆనందంగా అన్నాడు– "అతడిని నేను ఆహ్వానిస్తాను. 'ఎన్‌లిల్' పంపిన ఆ వీరుడిని, సలహాదారుడిగా మిత్రుడిగా స్వీకరిస్తాను" – గిల్గామేష్ అలా కలగన్న సంగతిని వేశ్యాయువతి చెప్పింది 'ఎంకిడు'కి. ఆమె అన్నది– "నీవు దేవుడిలా ఉన్నావు నా కళ్లకు. ఎందుకింకా ఆ అడవి జంతువులతో కొండల్లో, గుట్టల్లో తిరుగుతావు? లే, గొర్రెల కాపరులు నిదురించే నేలమీద నుంచి".

ఆమె తన దుస్తులను సగం చించి అతడికి కట్టబెట్టింది. ఒక చిన్న పిల్లవాడిని నడిపించినట్లు ఆమె అతడిని గొర్రెలమందలో నుంచి గొర్రెల కాపరి ఇంట్లోకి తీసుకువెళ్లినది. అతడిని చూసి గొర్రెలకాపరులు ఆశ్చర్యానందాలతో చుట్టూ మూగినారు. రొట్టె, భక్ష్యాలు, ద్రాక్ష సారాయి ఇచ్చినారు. అడవి జంతువుల పాలు తాగి, గడ్డి ఆకులు తిని బతికిన అతనికి వీటిని ఎలా తినాలో పాలుపోలేదు.

ఆ యువతి అన్నది– "ఎంకిడూ, తిను. రొట్టె ప్రాణానికి ఆధారం. ద్రాక్ష సారాయి ఆతిథ్యానికి సంకేతం. ఇక్కడి ఆచారాల్ని పాటించు". అతడు వాటిని రుచిచూసి ఇష్టపడినాడు. అతడి ముఖం ఆనందంతో విప్పారింది. వాళ్లిచ్చిన నూనెలను శిరోజాలకు, శరీరానికి రుద్దుకున్నాడు. మగవాళ్ల దుస్తులను తొడుక్కున్నాక అతడు నూతన వరుడిలా కనిపించినాడు. రాత్రిళ్లు గొర్రెలకు కాపలా ఉండి అటుగా వచ్చిన తోడేళ్లను సింహాలను బంధించి, గొర్రెలకాపరులకు సంతోషాన్ని కలిగించినాడు.

అలా సంతోషంగా కాలం గడుపుతున్నపుడు, అతడికి అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి కనిపించినాడు. యువతిని పిలిచి అతడెవరో ఏమిటో కనుక్కోమన్నాడు ఎంకిడు. ఆ బాటసారి అన్నాడు– "గిల్గామేష్ ఆ వివాహగృహంలోకి వెళ్లి బంధించినాడు యువతీ యువకుల్ని. ప్రేమరాణితో వివాహానికి ఉత్సవాలు చేస్తున్నాడు. ఉరుక్‌కు ప్రభువుగా తాను అనుభవించినాకే ఏ కన్య అయినా తన భర్త వద్దకు వెళ్లవచ్చు. అలా 'తొలిరాత్రి హక్కు' పేరుతో ప్రజలను భయభ్రాంతుల్ని చేస్తున్నాడు. నగరం వణికిపోతున్నది". ఎంకిడుకి ఆగ్రహం పెల్లుబికింది– "నేను వెళ్లి సవాలు చేస్తాను ఆ గిల్గామేష్‌ను! నేను అరుస్తాను, కేకలు పెడతాను! ఉరుక్ వీధులలో! పాత ఆచారాల్ని, పద్ధతుల్ని మార్చడానికి వచ్చాను, నేను అందరికన్నా బలవంతుడిని".

తాను ముందు నడుస్తూ, యువతి వెనుక రాగా ఎంకిడు ఉరుక్ నగర ప్రధాన సంత వీధికి వచ్చినాడు. అతడిని చూడడానికి ప్రజలు ఎగబడినారు. "ఇతడున్నాడు అచ్చుగుద్దినట్లు గిల్గామేష్‌లా; కొంచెం పొట్టి; లేదులేదు కొంచెం పొడుగు; ఇతడేనట అడవి జంతువుల పాలు తాగి పెరిగింది. మహా బలశాలిలా కనిపిస్తున్నాడు. గిల్గామేష్‌కు సరియైన ఉజ్జీ. చూడాలి ఎవరు నెగ్గుతారో" ఇలా ప్రజలు వ్యాఖ్యానించుకుంటున్నారు.

వివాహ గృహంలో శోభనానికి నవవధువు సిద్ధంగా ఉండింది. 'గిల్గామేష్' వీధిలోకి రాగానే ఎదురుగా 'ఎంకిడు'. రాజును శోభనపు గదిలోకి పోకుండా అడ్డుకున్నాడు. ఇద్దరి మధ్యా పోరు భీకరంగా సాగింది. తలుపులు

పగిలాయి, వాకిళ్లు విరిగాయి. గోడలు వణికాయి. ఒక్క బలమైన పట్టుతో ఒడుపుగా గిల్గామేష్ పడవేసాడు నేలపైకి ఎంకిడుని. ఎంకిడు తన ఓటమిని అంగీకరించినాడు. “ఓ గిల్గామేష్! నీ అంతటి బలశాలి ప్రపంచంలోనే లేదు. నీ కన్నతల్లి ‘నిన్‌సున్’ ధన్యురాలు. నీవు మనుష్యులలో అత్యంత బలవంతుడివి. అందుకే ఎన్‌లిల్ నీకు రాజ్యాధికారాన్నిచ్చినాడు. నీకు నా అభినందనలు”–

గిల్గామేష్ అతడిని సాదరంగా ఆహ్వానించి, కౌగిలించుకున్నాడు. తన కల సాకారమై తనకు ఓ మంచి సహచరుడు లభ్యమైనందుకు ఆనందించినాడు. ఇద్దరి మధ్య స్నేహం దినదిన ప్రవర్ధమానమయ్యింది.

# 4. అడవుల్లోకి ప్రయాణం

దేవతలకు తండ్రి, పర్వతాల అధిదేవత ఎన్‌లిల్ నిర్దేశించినాడు గిల్గామేష్ గమ్యాన్ని స్వప్నంలో. ఎంకిడు ఆ స్వప్నాన్ని ఇలా విశ్లేషించినాడు– "దేవేంద్రుడు నీకు రాజ్యాన్నిచ్చినాడు కాని అమరత్వాన్నివ్వలేదు. అలా అని నీవు దుఃఖించవద్దు. నీ హృదయం కలత చెందరాదు. నీకు శక్తి సామర్థ్యాలనిచ్చినాడు బంధించేందుకు, వదిలిపెట్టేందుకు; మనుషులకు చీకటి వెలుగుల నివ్వడానికి. నీకిచ్చినాడు జనులపై అధికారం, యుద్ధాలలో విజయం; ఎటువంటి దాడినైనా ఎదుర్కొనే వీరత్వం. అయితే, నీవాశక్తిని దుర్వినియోగం చేయరాదు. నీ పరివారాన్ని సరిగా చూసుకో, షమాష్ సూర్యుడి కనుసన్నలలో న్యాయభీతితో మెలుగు"–

ఆ తరువాత గిల్గామేష్ గమనించాడు 'ఎంకిడు' కళ్లలో నీళ్లు నిండడాన్ని, అతడు విషాదంగా ఉండడానిని. "ఎందుకు మిత్రమా, ఇలా విచారంగా నిట్టూరుస్తున్నావు?" అని అడిగాడు.

ఎంకిడు సమాధానమిచ్చాడు– "నేను బలహీనపడిపోతున్నాను. నా చేతుల్లో శక్తి తగ్గుతున్నది. దుఃఖపు జాడలు నా గొంతులో చిక్కుకున్నవి. సోమరి తనం నన్ను అణచివేస్తున్నది"–

గిల్గామేష్ ఆలోచించాడు– "నిజమే! నా గమ్యమేమిటి, నేనేం చేస్తున్నాను? నా పేరు చిరస్థాయిగా నిలిచే పని ఏదీ ఇప్పటివరకు చేయలేదు. ఏ ఇటుకలపైన, శిలలపైన నా పేరు చెక్కబడలేదు. నేను వెళ్తాను దేవదారు వృక్షాలున్న చోటుకు. గొప్పగొప్ప వాళ్ల పేర్లు చెక్కబడిన చోటున నాపేరూ ఉండేట్లు నా శక్తి సామర్థ్యాలను ప్రదర్శిస్తాను. ఇంకా ఏ మానవుడి పేరూ లిఖించబడని చోట నా పేరు నిలిచేట్లు చేస్తాను. దేవతలకు ఓ అద్భుతమైన ఆలయాన్ని నిర్మిస్తాను. అడవిలో దాగున్న చెడు రాక్షసిని సంహరిస్తాను. ఆ రాక్షసుడు హుంబాబా. పర్వతాకారుడు–భయంకరుడు. పదవెళ్దాం ఎంకిడూ!" అన్నాడు.

ఎంకిడు భారంగా నిట్టూర్చి అన్నాడు– "నేను అడవిజంతువులతో కలిసి అరణ్యమంతా తిరిగాను. దాని పొడుగు ఎటు చూసినా పదివేల లీగులుంటుంది.

ఎన్‌లిల్ ఆ అరణ్యానికి సంరక్షకుడిగా 'హుంబాబా'ను నియమించినాడు. అతడి వద్ద ఏడింతలు భీభత్సాన్ని సృష్టించే దుష్టశక్తులున్నాయి. శరీరాలకు హాని కలిగించే రాక్షసుడతడు. అతడి అరుపు తుఫాను గర్జన. అతడి ఊపిరి అగ్నిజ్వాల. అతడి దవడలు మృత్యు ఫలకాలు. అతడి నోరు మృత్యు గహ్వారం. అతడు ఎంత జాగ్రత్తగా అడవిని సంరక్షిస్తాడంటే అరవై లీగుల దూరంలో అడవిబర్రె లేదా ఆవు 'అంబా' అని అరిస్తే వినిపిస్తుందతడికి. అటువంటి అడవిలోకి ఏ మానవ మాత్రుడు వెళ్లగలడు? శోధించేందుకు వెళ్లినా తిరిగి రాగలడా? అటువేపు వెళ్తేనే నీరసం ఆవహిస్తుంది. హుంబాబాతో యుద్ధం సమానస్కంధులతో యుద్ధం కాదు. అతడు గొప్ప యోధుడు. కోట ద్వారాలను ఛిన్నాభిన్నం చేసే గొర్రెపొటేలు తల ఉన్న పెద్ద కొయ్యదుంగ లాంటివాడు. ఆ అడవి సంరక్షకుడు క్షణమైనా కన్ను మూయడు"–

గిల్గామేష్ బదులిచ్చాడు– "స్వర్గానికి పాకగలిగిన మనిషెవ్వడు? అమరులు షామాష్‌లాంటి దేవతలు మాత్రమే వాళ్లు శాశ్వత జీవనులు. మనలాంటి మనుషులు మన రోజులు లెక్కబెట్టుకోవాల్సిందే. ఈ ఉద్యోగాలన్నీ వాయు వీచికలు. ఎందుకు నీవప్పుడే భయపడిపోతున్నావు? నీ ప్రభువునైన అతడితో పోరాటానికి నేను ముందు వెళ్తాను. నీవు నన్ను అనుసరించు. యుద్ధంలో నేను ఓడిపోయినా కీర్తి మిగుల్తుంది. 'భయంకరుడైన 'హుంబాబా'తో యుద్ధం చేసి నేలకొరిగినాడు గిల్గామేష్' అని తరతరాలుగా జనం చెప్పుకుంటారు. పిల్లలకు నా కథ చెబ్తారు పెద్దలు"–

ఎంకిడు అన్నాడు– "ప్రభూ! నీవు అడవిలోకి వెళ్లేముందు షామాష్ దేవుణ్ణి ప్రార్థించు. ఈ నేల, అడవి అతడిది. ఇక్కడి ప్రతి దేవదారు వృక్షము అతడికి సంబంధించినదే!"

గిల్గామేష్ తీసుకున్నాడు తన చేతుల్లోకి ఎక్కడా మచ్చలేని తెల్ల గొర్రెపిల్ల నొకదానిని, గోధుమరంగున్న ఇంకో పిల్లను. వాటిని సూర్యుడి ముందుంచినాడు. వెండి రాజదండాన్ని చేతబట్టి ప్రకాశిస్తున్న సూర్యుడిని ప్రార్థించినాడు– "ఓ షామాష్ దేవా! నేను వెళ్తున్నాను అరణ్యంలోకి! నీదైన ప్రదేశంలోకి. చేతులు జోడించి మొక్కుతున్నాను. అంతా సవ్యంగా జరిగి మరల నేను ఉరుక్ నగరానికి

క్షేమంగా వచ్చేలా ఆశీర్వదించు. ఓ దైవమా! నన్ను అనుగ్రహించు. శుభ శకునాలను పంపుము తండ్రీ!"

షామాష్ సూర్యుడు నలుదిక్కులా ప్రకాశిస్తూ అన్నాడు– "గిల్గామేష్! నీవు సాహసికుడవు. అయినా ఆ జీవప్రదేశం నీకెందుకు?"

గిల్గామేష్ బదులిచ్చినాడు– "ఓ షామాష్! నా మాటలను ఆలకించు! ఇక్కడ నగర ప్రజల హృదయాలు బాధలతో బరువెక్కి, నిరాశతో నిండి ఉన్నవి. నేను కోటగోడల పైనుంచి చూసాను నదిలో తేలుతున్న శవాలను. అటువంటి స్థితి మాకు కూడ రావచ్చు. నాకు అవగతమే ఎంత ఎత్తుకు ఎదిగినా మనిషి స్వర్గాన్ని అందుకోలేడని. ఎంత గొప్పవాళ్లైనా అది ఈ నేలకే పరిమితమనీనూ. అందుచేత నేను ఆ జీవప్రపంచాన్ని చూడదలుచుకున్నాను. అంతేకాక ఇప్పటి వరకు నాపేరు ఏ ఇటుకలపై గాని, శిలలపైన గాని చెక్కబడలేదు. నేను వెళ్లదలుచు కున్నాను దేవదారు చెట్ల అరణ్యంలోకి. అక్కడ నా పేరును గతకాలపు గొప్పవాళ్ల పేర్ల పక్కన చేర్చుడానికి ప్రయత్నిస్తాను. ఎక్కడైతే ఏ మానవుడి పేరూ లిఖింప బడలేదో అక్కడ ఒక అద్భుత దేవాలయాన్ని నిర్మిస్తాను. ఎంత దూరమైనా, ఎంత కష్టమైనా సరే 'హుంబాబా' ఉన్న దేశానికి వెళ్తాను. ఇది నీ నిర్ణయం కాదా, లేకుంటే ఈ ఆలోచన నాలో మొలకెత్తేదా? నీ అనుగ్రహం లేకుండా నేనెలా సాధించగలను విజయాన్ని? అక్కడే ఏ గౌరవమూ లేకుండా మరణిస్తే సరే, కాని విజయుడనై తిరిగి వస్తే, నీకు ఓ షామాష్ సూర్యుడా, నీకు అనేక కానుకలను సమర్పిస్తాను. నీ గౌరవార్థం వేడుకలను జరుపుతాను" అన్నాడు గిల్గామేష్ కన్నీళ్లు కారుతుండగా.

షామాష్ అంగీకరించాడు కన్నీళ్లతో పునీతమైన గిల్గామేష్ విన్నపాన్ని. అతడిపై దయావర్షాన్ని కురిపించాడు. గిల్గామేష్‌కు తోడుగా స్నేహితులను ఒకే తల్లిబిడ్డలను పర్వతాల గుహలలో నిలిపినాడు. గాలులకు ఆజ్ఞలనిచ్చినాడు– ఉత్తరపుగాలి, సుడిగాలి, తుఫానుగాలి, మంచుగాలి, ఈదురుగాలి, వడగాలులకు; అవి పొడపాముల్లా, డ్రాగన్లలా, అగ్నిజ్వాలల్లా, సర్ప విషవాయువుల్లా గుండెను ఆపేవి, వరదలా, మెరుపులా, అత్యంత తీవ్రమైనవి. వాటిని కొండలలో ఉంచినాడు.

గిల్గామేష్ ఆయుధాలు తయారుచేసే కొలిమి వద్దకు వెళ్లినాడు. కవచాలను, ఆయుధాల తయారీకి ఆజ్ఞలు జారీ చేసినాడు. వాళ్లు అడవికి వెళ్లి విల్లో, బాక్స్‌వుడ్ చెట్లను నరికి తెచ్చినారు. నూట ఎనభై పౌండ్ల బరువున్న గొడ్డళ్లను, నూట ఇరవై పౌండ్లున్న ఖడ్గాలను పోతపోసినారు. మహాశక్తివంతమైన పరశువు, అంషన్ విల్లును గిల్గామేష్‌కు ఇచ్చినారు. గిల్గామేష్, ఎంకిడు ఆరువందల పౌండ్ల బరువున్న ఆయుధాలతో సాహసయాత్రకు బయల్దేరినారు.

ఆ మహావీరుల్ని చూడడానికి అనేకమంది వీధుల్లో, సంత కూడలిలో గుమికూడినారు. గిల్గామేష్ వాళ్లతో అన్నాడు– "నేను, గిల్గామేష్‌ను! ఎవరి గురించయితే భయభ్రాంతకరమైన, ఆశ్చర్యకరమైన విషయాలు ప్రపంచమంతా మాట్లాడుకుంటున్నారో ఆ మహారాక్షసుడిని చూడడానికి వెళ్తున్నాను నేను. అతడిని దేవదారు అరణ్యంలో ఓడించి ఉరుక్ నగర పుత్రుల వీరత్వాన్ని ప్రపంచానికి చాటిచెబుతాను. దానికై ఎన్ని కష్టాలైనా సహిస్తాను. కొండల్ని దాటి, అడవుల్ని నరికి చరిత్రలో నా పేరును చిరస్థాయిగా ఉండేట్లు లిఖింపజేస్తాను"–

ఉరుక్ నగరపు సలహాదారులిట్లా అన్నారు– "గిల్గామేష్! నీవు వయసులో చిన్నవాడివి. నీ ధైర్యసాహసాలు నిన్ను చాలాదూరం తీసుకువెళ్తాయి. నీకు తెలియదు నీవెంత సాహసకార్యాన్ని తలపెడ్తున్నావో. మేము విన్నాము 'హుంబాబా' సాధారణుడైన మర్త్యుడు కాదని. అతడి ఆయుధాలు ప్రత్యేకమైనవి. వాటికెదురు ఎవరూ నిలబడలేరు. ఆ అరణ్యం పదివేల లీగులు పొడుగుంటుంది ఏ దిక్కుకైనా! ఎవరు సాహసించగలరు ఆ అరణ్యాన్ని శోధించడానికి? 'హుంబాబా' గర్జిస్తాడట ప్రళయకాలపు తుఫాను గర్జనలా. అతడి ఊపిరి అగ్నిజ్వాల, అతడి దవడలు మృత్యు ఫలకాలు. ఎందుకీ పని తలపెట్టినావు గిల్గామేష్? అతడితో యుద్ధం సామాన్యమైనది కాదు. హుంబాబా కోటగోడ తలుపులు బద్దలుగొట్టే యుద్ధపు ఆయుధం నీదగ్గరున్నదా?"–

వాళ్ల మాటలు విని గిల్గామేష్ తన స్నేహితుడు ఎంకిడు వేపు చూసి చిరునవ్వు నవ్వినాడు– "ఎలా వీరికి సమాధానం చెప్పను, ఏమని చెప్పను? హుంబాబా అంటే నాకు భయమని చెప్పాలా, ఆ భయంతో ఇంట్లో కూర్చుని విశ్రాంతి తీసుకుంటానని చెప్పాలా? మిత్రమా మనం ఇప్పుడు ఎగాల్మా

(Egalmah) రాజ ప్రసాదానికి వెళ్లి నిన్‌సున్ (Ninsun) రాణి ముందు నిలబడదాం”

అలా వాళ్లిరువురూ నిన్‌సున్ రాణి వద్దకు వెళ్లి మాట్లాడినారు– “నిన్‌సున్ రాణీ, అమ్మా! మా మొరాలకించు! నేను చాలా దూరం పోవాలి. ‘హుంబాబా’ దేశానికి. అది తెలియని దారి. అక్కడ యుద్ధం చేయాలి ప్రత్యర్థితో. ఆ ప్రత్యర్థి శక్తిసామర్థ్యా లెవరికీ సరిగా తెలియవు. నేను ఆ దేవదారు అరణ్యానికి వెళ్లి, దుష్ట సంహారం చేసి తిరిగి వచ్చేవరకూ నా తరఫున సూర్యభగవానుడు ‘షామాష్’కు ప్రార్థనలు చేయి!”–

నిన్‌సున్ తన గదిలోకి వెళ్లింది. భగవానుని దర్శించేందుకు ఉచితమైన దుస్తులను, నగలను, కిరీటాన్ని ధరించి, అత్యంత మనోహరమైన అంగీ అంచులు నేలపై పొరాడుతుండగా ఆమె సూర్యదేవుని సన్నిధికి వెళ్లింది. తన భవనపు పైకప్పుపైన నిలబడి ముకుళిత హస్తాలతో షామాష్‌ను ప్రార్థించింది; అగరు వత్తులను వెలిగించింది. సాంబ్రాణి ధూమాన్ని వెదజల్లింది. ఆ సుగంధ పరిమళాలు నింగికెగుస్తుండగా ఆమె మొక్కినది “ఓ షామాష్! నీవెందుకు విశ్రాంతి లేని హృదయాన్ని గిల్గామేష్‌కు ఇచ్చినావు? ఎందు కిచ్చినావు అతడికీ కోరికను? అతడా అణగని కోరికతో సుదూర ప్రయాణానికి, హుంబాబా దేశానికి, తెలియని దారిలో, వింత యుద్ధం చేయడానికి, శక్తి సామర్థ్యాలెవరికీ సరిగా తెలియని ప్రత్యర్థితో పోరాటానికి, ఆ దేవదారు అరణ్యానికి వెళ్లి దుష్టసంహారం చేసి వస్తానంటున్నాడు. ఓ షామాష్! అతడిని అనాథగా వదిలివేయకు. నీ వధువు సంధ్యాదేవి– ఆయా (Aya) నీకు ప్రతిరోజూ గుర్తు చేయనీ, పగలు గడచి చీకటి పడగానే, చీకటిరాత్రుళ్లలో నా కుమారుడికే అపాయం రాకుండా కాపాడుము, దేవా!”

గిల్గామేష్ మాతృమూర్తి, నిన్‌సున్ ఈ విధంగా అన్నది ‘ఎంకిడు’తో– “ఎంకిడు కుమారా! నీవు మహా శక్తిమంతుడవు. నా స్వంత కొడుకువు కాకున్నా నా పెంపుడు కుమారుడిలా నిన్ను నేను చూసుకున్నాను. దేవాలయం వద్ద దొరికిన అనాథ శిశువును చేరదీసి బహుప్రేమతో పెంచుకున్నట్లు నిన్ను ప్రేమగా ఆదరించాను. నా యావత్ దాసదాసీ బంధుజనం ముందు నిన్ను నా రెండో

కుమారుడిగా ప్రకటిస్తున్నాను. నా కుమారుడిని సురక్షితంగా తీసుకువచ్చే బాధ్యత నీది” అని పలికి ‘రక్షరేకు’ను అర్చించి తెచ్చి అతడి మెడలో వేసింది హారంలా, ప్రతిజ్ఞకు గుర్తుగా!

అప్పుడు వాళ్లు ఆయుధాలున్న చోటుకు వెళ్లినారు. మహాఖడ్గాలు, స్వర్ణ చురకత్తులు, విల్లు, బాణాలు, గండ్రగొడ్డళ్లున్నాయక్కడ. గిల్గామేష్ గొడ్డలిని చేతబట్టినాడు. అమ్ములపొదిని భుజానికి తగిలించుకున్నాడు. అంశన్ విల్లును, మహాఖడ్గాన్ని తీసుకుని ప్రయాణానికి సిద్ధమైనాడు. ప్రజలు, సభాసదులు వచ్చి జేజేలు పలుకుతూ అతడిని ఆశీర్వదించినారు– “నీ బలాన్ని అతిగా అంచనా వేయకు. నీకు రక్షణగా ఉన్న వ్యక్తి మొదటి దెబ్బను కాచుకుని నిన్ను కాపాడతాడు. అతడు అడవి గురించి తెలిసినవాడు. అతడు నీకు మార్గదర్శకుడు కాగా నీవు అరణ్యంలో ‘హుంబాబా’ను ఎదుర్కో! ఎంకిడు చూసినాడు అరణ్య సంరక్షకుడిని, అంతేకాక యుద్ధాలలో ఆరితేరినవాడు కూడా. అతడు తనను నిన్ను రక్షించుకో గలిగినవాడు. ఓ ఎంకిడూ! మేము మా ప్రభువును నీ చేతుల్లో ఉంచుతున్నాము. షామాష్ మీ మనోవాంఛితాన్ని నెరవేర్చును గాక! మీ పెదాలు పలికిన మాటలను అతడు నిజం చేయును గాక. మార్గంలోని అడ్డంకులను తొలగించి మీకు దారిని సుగమం చేయునుగాక! పర్వతాలను క్షేమంగా దాటేప్పుడు, చీకటి రాత్రిళ్లు మీకు క్షేమకరం కాగా, ‘లుగుల్‌బందా’ రక్షక దేవుడు మీ వెన్నంటి ఉండి మీకు విజయాన్ని చేకూర్చును గాక! మీ యుద్ధంలో మీ ప్రతిద్వంది ఓ చిన్నపిల్లాడిలా తోచునుగాక. యుద్ధానికి వెళ్లేముందు నదిలో కాళ్లు కడుక్కుని శుచులై ఉండండి. సాయం సమయాన ఏటి వద్ద చెలమలు తవ్వి మంచినీటిని భద్రపరచుకోండి. చన్నీళ్లను షామాష్‌కు అర్పణ చేసి, లుగుల్‌బందాకు ప్రార్థనలు చేయగలరు”

ఎంకిడు అన్నాడు– “పదండి ముందుకు. భయం లేదు. నన్ను అనుసరించు. నిన్ను నేను హుంబాబా స్థావరానికి తీసుకువెళ్తాను. అతడి పద్ధతులు నాకు తెలుసు. సభాసదులారా! కృతజ్ఞతలు. మాకు సెలవిప్పించండి”.

సభాసదులన్నారు– “విజయోస్తు వీరకుమారులారా! మీ రక్షక దేవతలు మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడి మీకు విజయాన్ని సిద్ధింపజేసి, ఆనక సురక్షితంగా మరల మిమ్మల్ని ‘ఉరుక్’ నగరానికి తెచ్చెదరు గాక!”

నగర ప్రజలకు వీడ్కోలు చెప్పి మిత్రులిద్దరూ ఇరవై లీగుల దూరం నడిచి ఆహారం తీసుకున్నారు. మరో ముప్పై లీగులు నడిచేసరికి చీకటి పడింది. రోజుకు యాభై లీగుల దూరం చొప్పున మూడురోజుల్లో వాళ్లు నలభై అయిదు రోజుల ప్రయాణాన్ని పూర్తిచేసినారు. ఏడు పర్వతాల్ని దాటి అరణ్యపు ద్వారాన్ని చేరుకున్నారు.

ఎంకిడు అన్నాడు– "ఇప్పుడు అరణ్యంలోకి పోవద్దు. ద్వారం తలుపు తెరిచేసరికే నా చేతుల సత్తువ సన్నగిల్లింది".

గిల్గామేష్ అన్నాడు– "పిరికివాడిలా మాట్లాడకు. ఇంత దూరం వచ్చి వెనక్కి పోతామా! నా పక్కనే ఉండగా మృత్యువు నిన్నేమీ చేయలేదు. ఏ భయమూ సందేహమూ లేకుండా మనం అరణ్యం మధ్యలోకి వెళదాం. రాబోయే యుద్ధాన్ని తలచుకో! వీరావేశంతో విజృంభిస్తావు. చావు భయాన్ని వదలి కార్యశూరుడివికా. మూర్ఖత్వం లేనివాడు విజయాన్ని సాధిస్తాడు. మనం ఒకరినొకరు రక్షించు కుంటూ, మంచైనా చెడైనా కలిసి బతుకుదాం లేదా కలిసి మరణిద్దాం! అలా అయినా మన పేరు ప్రఖ్యాతులు శాశ్వతమవుతాయి"–

ఇద్దరూ అలా అడవిలోకి వెళ్లి ఆకుపచ్చని పర్వతాలను చేరుకున్నారు. అక్కడ అడవుల్ని చూసి నోటమాట రాక నిశ్చేష్టులై నిలబడిపోయినారు. ఆ దేవదారు వృక్షాలు ఎంతో ఎత్తుగా దృఢంగా నిలబడి ఉన్నాయి. వాటి మధ్య వారికి కనబడింది హుంబాబా నడిచే త్రోవ. ఆ దారినే నడుస్తూ వాళ్లు చేరుకున్నారు దేవదారు వృక్షాల పర్వతాన్ని, దేవతల సంచార స్థానాన్ని, ఇస్తార్ దేవత సింహాసనాన్ని;

పర్వతాన్ని ఢీకొడ్తున్నట్లున్న దేవదారు వృక్షాలు, చక్కని నీడను రక్షణ నిస్తుండగా కొండలు లోయలు బ్రష్‌వుడ్ చెట్లతో ఆకుపచ్చగా ఉన్నాయి. అక్కడ గిల్గామేష్ తవ్వినాడు ఓ మంచినీటి బావిని సూర్యాస్తమయం కాకముందే. కొండ ఎక్కి చక్కటి ఆహారాన్ని కొండదేవతకు, భూదేవతకు అర్పించి ఇలా ప్రార్థించినాడు– "ఓ పర్వతరాజా! దేవతల నివాస స్థలమా! నాకు మంచి స్వప్నాన్ని ఇమ్ము!"

ఆ తరువాత స్నేహితులిద్దరూ నిద్రకుపక్రమించినారు. నిద్రలో గిల్గామేష్ కలగన్నాడు– అర్థరాత్రి మెలకువ వచ్చింది. గిల్గామేష్ ఎంకిడును నిద్రలేపి తనకు వచ్చిన కల గురించి చెప్పినాడు– "మిత్రమా! నీవు కాదుకదా నన్ను నిద్రలేపింది! నేనొక మంచి కలను కలగన్నాను. లే! చూడు, ఆ పర్వత శిఖరాన్ని. దేవతలు నాకొసగిన నిద్ర చెదిరింది. కాని ఎటువంటి కల అది! భయం, గందరగోళం కలబోసిన కల! ఈ కీకారణ్యంలో నేనొక అడవిగిత్తతో పోట్లాడినాను. అది పెద్దగా అరుస్తూ, కాలిని నేలపై దువ్వుతూ, దుమ్మును లేపుతూ బుసలు కొట్టింది, దాని తాకిడికి ఆకాశాన చీకట్లు కమ్మి, నా చెయ్యి పట్టు తప్పింది. నేను నాలుక కొరుక్కున్నాను. మోకాళ్లపై నేలమీద పడిపోయాను. ఎవరో నామీద నీళ్లు చిలకరించినారు"–

ఎంకిడు అన్నాడు– "ప్రియతమా! నీవు చూసినది అడవిగిత్త కాదు. అతడి రూపం మార్మిక రక్షకుడైన షామాష్ సూర్యుడు కావచ్చు. మనకు కీడు మూడినప్పుడు అతడు మనకు సాయమందిస్తాడు. నీపై నీళ్లు చిలకరించినవాడు నీ రక్షకదేవుడు 'లుగుల్‌బందా'. అతడిని గుర్తుపెట్టుకో, అందరం కలిసి మనం ఓ గొప్ప కార్యం, శాశ్వతంగా నిలిచేది చేస్తున్నాము"–

గిల్గామేష్ అన్నాడు– "నాకు మరల కలవచ్చింది. మనం ఓ పర్వతపు అంచువద్ద నిలబడి ఉన్నపుడు, దాని ముందు మనం చిన్ని ఈగల్లా కానవచ్చాం. అకస్మాత్తుగా పర్వతం పడిపోయింది. నా కాళ్లకింద నేల కదిలి నాకు దెబ్బ తగిలింది. అప్పుడు వచ్చింది మానవమాత్రుడు భరించలేని ప్రజ్వలమైన వెలుగు. దాని అందాన్ని ప్రపంచంలోని ఏ సౌందర్యంతోనూ పోల్చలేము. అతడు నన్ను ఆ కూలిన పర్వతం కింద నుంచి లాగి రక్షించాడు. తాగడానికి కాసిని నీటినిచ్చి నా హృదయానికి శాంతి కలిగించినాడు. నన్ను మరల నేలపై నిలదొక్కుకునేలా చేసినాడు".

మైదానాల బిడ్డడు ఎంకిడు అన్నాడు– "మనం ఈ పర్వతాన్ని దిగి ఈ విషయాలను చర్చించుకుందాం. నీ స్వప్నం చాలా గొప్పది. ఆ పర్వతం హుంబాబా. మనం అతడిని ఎదుర్కొని గెలుస్తాం. పర్వతం మైదానం మీదపడినట్లు అతడూ నేలకూలుతాడు".

ఆ మరుసటిరోజు వాళ్లు ఇరవై లీగుల దూరం నడిచారు. కాస్త విశ్రాంతి తీసుకుని మరో ముప్పై లీగుల దూరం నడిచి రాత్రి కాగానే ఆగినారు. సూర్యాస్తమయానికి ముందే ఓ మంచినీటి బావిని తవ్వి పసందైన ఆహారాన్ని నేలపై పడవేసి పర్వతానికి అర్పణ చేసినారు. గిల్గామేష్ పర్వతానికి నమస్కరించి అన్నాడు– "ఓ పర్వతరాజా! దేవతల నివాస స్థలమా! ఈసారి 'ఎంకిడు'కి మంచి స్వప్నాన్నిమ్ము"– ఎంకిడు నిద్రలో కలగన్నాడు. ఆ కలలో అతడు తుఫాను వానకు వణికిన పర్వతంలా వణికినాడు.

గిల్గామేష్ మాత్రం తన చుబుకాన్ని మోకాళ్లపై ఉంచుకుని స్థిరంగా నిద్రపోయినాడు. అర్ధరాత్రి మెలకువ రాగానే ఎంకిడును లేపి అన్నాడు– "నీవు నన్ను పిలిచావా? నిద్ర నుండి లేపినావా? నన్ను తాకినావా? మరెందుకు నేను భయంతో కంపిస్తున్నాను? ఎవరైనా దేవుడు ఇటుగా వెళ్లినాడా? ఎందుకు నా చేతులు కాళ్లు భయంతో తిమ్మిరెక్కినాయి? మిత్రమా! నాకు వచ్చిన ఈ మూడో స్వప్నం ఎంతో భయపెట్టేటట్లు ఉన్నది. ఆకాశం ఉరిమింది, నేల మరల మరల ప్రతిధ్వనించి ఉరిమింది. పట్టపగలు కటిక చీకట్లు కమ్ముకున్నవి. మెరుపులు మెరిసి, అగ్నిమంటలు, ఉరుములు, మబ్బులు కిందకు దిగి, మృత్యువును కురిసాయి. తరువాత వెలుగు తగ్గింది. అగ్ని చల్లారింది. ఎక్కడ చూసినా బూడిద కుప్పలే. పద! మనం ఈ కొండ దిగి వీటిని సవివరంగా చర్చించుకుందాం! ఏం చేయాలో నిర్ణయించుకుందాం!"

కొండ దిగి రాగానే గిల్గామేష్ గొడ్డలి చేతబట్టి ఓ దేవదారు మహావృక్షాన్ని నరికి నేలకూల్చినాడు. ఆ శబ్దం విని సుదూరంగా ఉన్న హుంబాబా ఆగ్రహంతో మండిపడినాడు. "ఎవరు నా అరణ్యంలో అడుగు పెట్టి, నాకిష్టమైన దేవదారు వృక్షాన్ని నేలకూల్చినది?" అని ఎలుగెత్తి అరచినాడు.

ప్రకాశిస్తున్న షామాష్ సూర్యుడు మిత్రులిద్దరిని ఉత్సాహపరచినాడు. "భయపడకండి! మీ పని కొనసాగించండి!"

అయితే, ఎందుకనో ఎడతెగని నీరసం ఆవహించింది గిల్గామేష్‌ను. ఆపుకోలేని నిద్ర అకస్మాత్తుగా కమ్మి నేలపైబడి నిద్రపోయాడు, మాట పలుకు లేకుండా స్వప్నావస్థలో ఉన్నట్లు. ఎంకిడు తట్టిలేపడానికి ప్రయత్నించినా లేవలేదు.

పలకరించినా సమాధానం లేదు. "ఓ గిల్గామేష్, కుల్లాబ్ మైదానపు ప్రభువా! చీకటి పడుతున్నది, నీడ వ్యాపిస్తున్నది, మసక చీకటి రానేవస్తున్నది. షామాష్ అస్తమించినాడు. తన ప్రకాశించే శిరస్సును తన తల్లి నిన్‌గల్ ఒడిలో ఉంచినాడు. ఓ గిల్గామేష్! ఎంతకాలం నీవిలా నిద్రపోతావు? నిన్ను కన్నతల్లి నగరకూడలిలో దుఃఖసముద్రంలో మునిగేలా చేయకు" అని దుఃఖించినాడు.

ఆ మాటలు గిల్గామేష్‌ను కదిలించాయి. అతడు తన చేతిని ఛాతీఫలకం -వీరుల స్వరం- పై ఉంచినాడు. అది ముప్పై షెకెల్ బరువున్నది. దానిని తగిలించుకుని ఆగ్రహంతో బుసలుకొట్టే ఆంబోతులా, పళ్లు బిగించి, నేలను గట్టిగా నొక్కుతూ లేచినాడు- "నాకు జన్మనిచ్చిన నిన్‌సున్ మీద ఆన! నా తండ్రి దివ్యుడు లుగుల్‌బందా మీద ఒట్టు! నేను ఒక అద్భుతంగా పుట్టి పెరిగాను నా తల్లి ఒడిలో. అమ్మా నిన్‌సున్, తండ్రీ లుగుల్‌బందా, నా ప్రతిద్వంద్వి మానవుడైనా, దేవుడైనా అతడితో పోరాడి, సజీవుల లోకానికి నాయకుడినైన నేను, ఈ లోకాన్ని జయించిగాని మన పట్టణంలోకి అడుగు పెట్టబోను"-

ఎంకిడు, అతడి అత్యంత ప్రియమైన సహచరుడు ఇలా అన్నాడు- "ఓ ప్రభూ! నీవీ రాక్షసుడిని చూడలేదు కనుక భయం లేకుండా ఉన్నావు. నేనతడిని చూసానింతకుముందు. అందుకే నాకు భయం. అతడి దంతాలు డ్రాగన్ కోరలు, సింహపు ముఖం, వరదలా దూసుకువస్తాడు, చూపులతోనే అడవిలోని చెట్లను, మడుగులోని రెల్లు, వెదుర్లను నేలకూలుస్తాడు. నీకిష్టమైతే వెళ్లు అడవిలోకి, నేను పట్టణానికి వెళ్తాను వెనుదిరిగి. నీ విజయగాధలను వివరిస్తాను నీ తల్లికి. ఆమె సంతోషంతో ఉప్పొంగేలా! ఆ తరువాత నీ మరణాన్ని వివరిస్తాను ఆమె దుఃఖంతో సొమ్మసిల్లేలా!"

గిల్గామేష్ అన్నాడు- "దహనం, త్యాగం ఇవేమీ ఇప్పుడు నా చెంతకు రావు. మృతుల నావ ఇక్కడికేమీ రాదు. మూడు మూరల వస్త్రం శవాలపై కప్పేదీ అవసరం పడదు. నా ప్రజలు నిరాశ్రయులు, దుఃఖపీడితులూ కారు, చితి వెలిగించబడదు, నా ఇల్లు కాలి బూడిద కాదు. ఈరోజు నీవు నీ శక్తికొద్దీ నాకు సాయపడు. మనిద్దరి శక్తులు కలిస్తే ఎవరూ మనల్నేమీ చేయలేరు. అన్ని సజీవ దేహధారులూ పడమటి పడవ నెక్కవలసినదే, అది మునిగినపుడు,

‘మాగిలమ్’ పడవ మునిగినపుడు అందరూ నిష్క్రమించవలసినదే. కాని, మనం ముందుకే వెళ్దాం. ఆ రాక్షసుడిపై ఓ కన్నేసి ఉంచుదాం. నీ హృదయంలోకి భయం ప్రవేశిస్తే దానిని తొలగించు. నీకు భీభత్స దృశ్యం కానవస్తే దానిని తొలగించు. గొడ్డలి చేతబట్టు, దాడికి దిగు. యుద్ధాన్ని మధ్యలో ఆపినవాడికి మనశ్శాంతి ఉండదు”–

హుంబాబా రానేవచ్చాడు తన బలిష్ఠమైన దేవదారు గృహం నుంచి, ఎంకిడు అరిచాడు– “ఓ గిల్గామేష్! ఉరుక్‌లో నీవు పలికిన ప్రగల్భాలు గుర్తు తెచ్చుకో! ముందుకు నడువు! దాడికి దిగు! ఉరుక్ వీరపుత్రుడా! భయపడకు!”

గిల్గామేష్ ఇనుమడించిన ఉత్సాహంతో అన్నాడు– “పద పద త్వరగా! అడవి కాపలాదారుడు మనల్ని తప్పించుకుపోలేడు. ఎటుపోతాడో చూద్దాం మనల్ని దాటి! అతడి ఏడుమాయల్లో ఒకటి ప్రదర్శించాడు. ఇంకా ఆరు మాయలున్నాయి. ఈలోగానే అతడిని బంధిద్దాం!” బసలుకొట్టే పోట్లగిత్తలా గిల్గామేష్ భీకరంగా చూస్తున్నాడు.

అడవి సంరక్షకుడు హుంబాబా భీకరంగా గర్జించినాడు. అతడు తన బలిష్ఠమైన దేవదారు గృహం నుంచి వెలుపలకు వచ్చినాడు. తలపంకించి తన దృష్టిని గిల్గామేష్‌పై ఉంచినాడు. మృత్యు నేత్రాన్ని గిల్గామేష్‌పై నిలిపినాడు.

గిల్గామేష్ ప్రార్థించినాడు షామాష్‌ను కళ్లవెంబడి అశ్రుధారలు ప్రవహిస్తుండగా– “ఓ ప్రకాశవంతమైన షామాష్! నేను అనుసరించాను నీవు చూపిన బాటను. ఇక్కడకు చేరుకున్నాను. తప్పించుకునే తరుణోపాయాన్ని చూపి సాయపడుము తండ్రీ!”

షామాష్ అతడి ప్రార్థనలు విన్నాడు. మహా వాయుదేవతను, ఉత్తరగాలిని, వడగాలిని, సుడిగాలిని, తుఫాను గాలిని, మంచుగాలిని, పెనుగాలిని, ఎడారిమండే గాలిని పిలిచి ఉత్తర్వులిచ్చినాడు. అవి డ్రాగన్లలా దూసుకువచ్చాయి. జ్వలిస్తున్న అగ్నుల్లా, గుండెను గడ్డకట్టించే సర్పాల్లా, పెను వరదల్లా, భయపెట్టే మెరుపు తీగెల్లా అవి రివ్వునవచ్చాయి. ఎనిమిది గాలులు విరుచుకుపడినాయి హుంబాబాపై. అతడి మృత్యునేత్రాన్ని ఢీకొన్నాయి. అతడిని ప్రచండ వేగంతో అడ్డుకున్నాయి. ముందుకూ రాలేక, వెనక్కీ పోలేకపోయినాడా రాక్షసుడు.

గిల్గామేష్ అరచినాడు ఉగ్రంగా– “నా తల్లి నిన్‌సున్‌పై ఆన! నా తండ్రి దివ్యుడైన లుగుల్‌బందా, నాదేశం సజీవుల దేశం; ఇక్కడ నేను కనుగొన్నాను నీ స్థావరాన్ని; నా బలహీనమైన చేతుల్తో, నాకున్న ఈ చిన్ని ఆయుధాలతో నీతో పోరాడతాను. నీ ఇంటిలోకి ప్రవేశిస్తాను. హుంబాబా, కాచుకో!”

మొదటి దేవదారు వృక్షాన్ని నరకగానే హుంబాబా మండిపడినాడు. కాని వాళ్లు అతడిని లెక్కచేయకుండా ముందుకు నడిచారు. ఏడు దేవదారు వృక్షాలు నరికి, శాఖలు తొలగించి, పర్వత పాదాలవద్ద పడవేసినారు. ఏడు వృక్షాలు నరికినాక వాళ్లకు కనిపించింది హుంబాబా స్థావరం. తన తొడలను చరుస్తూ, తృణీకారంగా చూస్తూ అడవిగిత్తలా మహోగ్రంగా హుంబాబా కనిపించాడు కాని ఎనిమిది గాలులు అతడిని కదలనివ్వడంలేదు. మోచేతులు కట్టేసినట్లు, కళ్లవెంబడి నీళ్లు కారుతుండగా పాలిపోయిన వదనంతో హుంబాబా అన్నాడు–

“గిల్గామేష్, నన్ను మాట్లాడనీ! నాకు తల్లిలేదు. తండ్రీ లేడు. పర్వతం నన్ను కనిపెంచినది. ఎన్‌లిల్ నన్ను అడవికి సంరక్షకుడిగా నియమించినాడు. గిల్గామేష్, నన్ను ఈ గాలుల బంధనాల నుంచి విడిపించి స్వేచ్ఛగా పోనీ! నేను నీ సేవకుడిగా ఉంటాను. నీవు నా యజమానివి. నేను పెంచిన ఈ చెట్లను నరికి నీవు రాజభవనం నిర్మించుకునేందుకు బహుమతిగా ఇస్తాను” అని పలికి హుంబాబా, గిల్గామేష్ చేతుల్ని ఆదరంగా పట్టుకుని తన ఇంటిలోకి తీసుకు వెళ్లినాడు.

గిల్గామేష్ హృదయం కరుణతో కరిగింది. అతడు దివ్యలోకం, మానవ లోకం, మృతులలోకం సాక్షిగా పలికినాడు– “ఓ ఎంకిడు, వలలో చిక్కిన పక్షిని స్వేచ్ఛగా వదిలేదా? చేతుల్లో చిక్కిన శత్రువును అతడి తల్లి చేతుల్లోకి పంపేదా?”

ఎంకిడు సమాధానమిచ్చినాడు– “సరైన నిర్ణయం తీసుకోలేకపోతే ఎంత బలమైన వీరుడైనా పతనం చెందుతాడు. ‘నమ్‌తార్’ దుర్విధికి మనుషులలోని తేడాలు తెలియదు, మింగేస్తుంది అందరినీ ఒకేవిధంగా. వలలో చిక్కిన పక్షి గూటికి స్వేచ్ఛగా చేరినా, చేతజిక్కిన శత్రువు అతడి తల్లి చేతుల్లోకి పోయినా

నీవు నా స్నేహితుడివి నీ పట్టణాన్ని, నీకు జన్మనిచ్చిన తల్లిని చేరలేవు. నీ శత్రువు నీ నగరానికి వెళ్లేదారిని మూసివేస్తాడు, నీకు దారి తెన్నూ తెలియకుండా చేస్తాడు!"

హుంబాబా అరచాడు– "ఎంకిడూ! నీవు దుష్టమాటలు చెబుతున్నావు. నీవొక అనాథవు, నీ రొట్టెకు ఇతరులపై ఆధారపడేవాడివి. అసూయతో, మాత్సర్యంతో నాకు వ్యతిరేకంగా సలహాలనిస్తున్నావు"–

ఎంకిడు అన్నాడు– "గిల్గామేష్! ఇతడి మాటలు వినకు! హుంబాబా చావవలసిందే! ముందు హుంబాబాను తరువాత అతడి అనుచరులెవరైనా ఉంటే వాళ్లను చంపు. శత్రుశేషం నిశ్శేషం కావలసిందే!"

గిల్గామేష్ అన్నాడు– "ఇప్పుడు మనం ఇతడిని ముట్టుకుంటే వెలుగు వేడికాంతి తగ్గిపోతాయి. కీర్తిప్రఖ్యాతులు నశిస్తాయి. ప్రభ తగ్గి మనకు చెడ్డపేరు వస్తుంది"–

ఎంకిడు అన్నాడు– "అదేం కాదు మిత్రమా! మొదట పిట్టను వలవేసి పట్టినావు. ఇంకెక్కడికిపోతాయి పిల్లపిట్టలు. పని అయినాక మనం వెదకవచ్చు కీర్తిప్రతిష్ఠలనే పక్షికూనలను గడ్డిలో పారిపోతున్నపుడు. గెలిచినవాడి కథే కథ కదా?"

గిల్గామేష్ తన మిత్రుడి మాటలను విన్నాడు. గొడ్డలి చేతిలోకి తీసుకున్నాడు. కత్తిని పటకా నుంచి లాగినాడు. హుంబాబా మెడపై మొదటి వేటు వేసినాడు. ఎంకిడు రెండో దెబ్బ తీసినాడు. మూడవదెబ్బకు నేలకూలినాడు హుంబాబా. అంతా గందరగోళం. అరణ్య సంరక్షకుడు మరణించగానే రెండు లీగుల దూరం దేవదారు వృక్షాలు గజగజ వణికాయి. ఎవరి గర్జనలకు హెర్మాన్, లెబనాన్ దేశాలు ఉలికిపడేవో ఆ గర్జనలు, కొండలు ఇప్పుడు అనాథలైనవి. వాళ్లు ఏడు దేవదారు వృక్షాల్ని నరికినారు. హుంబాబా గొప్పదనమంతా మాయమయ్యింది.

మిత్రులిద్దరూ అడవిని కలయదిరిగినారు. ఎనిమిది టాలెంట్ల కత్తిని చేబూని భయం లేకుండా సంచరించినారు. వారికి కనిపించాయి 'అనున్నాకి'

పవిత్ర ప్రదేశాలు. గిల్గామేష్ వృక్షాల్ని పడగొట్టగా, ఎంకిదు కొమ్మల్ని, శాఖల్ని నరికి దుంగలుగా చేస్తున్నాడు. వాళ్లు 'హుంబాబా'ను దేవతలముందు, ఎన్‌లిల్ ముందుంచినారు. నేలను ముద్దాడి, శవంపై కప్పే వస్త్రాన్ని పరచినారు. దానిపై హుంబాబా శిరస్సునుంచినారు. ఈ శిరస్సును చూడగానే ఎన్‌లిల్ దేవుడు ఆగ్రహంతో ఊగిపోయినాడు– "ఎందుకు చేసారీ పని? ఇకముందు అగ్ని మీ ముఖాలను దహించునుగాక! మీరు తినే రొట్టెను అది తింటుంది. మీరు తాగే నీళ్లను అది తాగుతుంది". ఎన్‌లిల్ ఈ ప్రకాశాన్ని, హుంబాబాకున్న ఏడు మాయల్ని తనలోకి తీసుకున్నాడు. మొదటి మాయను నదికి, రెండోదానిని సింహాలకు, మూడోది పవిత్ర శిలకు, మిగిలినవాటిని నరకలోకపు రాణి కుమార్తెకు ఇచ్చినాడు. అయినా గిల్గామేష్‌కు మిగిలాయి కీర్తిప్రతిష్ఠలు.

"ఓ గిల్గామేష్! భయంకరమైన జ్వాలను ఆక్రమించినవాడా! అడవి గిత్తలా పర్వతాలను అధిగమించినవాడా! సముద్రాలను దాటేవాడా! నీకు కీర్తి ప్రతిష్ఠలు లభించును గాక! ఎంకి దేవుడి దయ నీకు సంప్రాప్తమై, నీ సాహస కృత్యాలు నీకు మరింత ఖ్యాతినిచ్చునుగాక!"

# 5. ఇస్తార్-గిల్గామేష్-ఎంకిడు మరణం

తలంటుస్నానం చేసి గిల్గామేష్ తన ఆయుధాలను కూడా శుభ్రం చేసినాడు. భుజాలపై పడిన శిరోజాలను ఎగదోసి, మాసిన బట్టలను పారవేసి కొత్త దుస్తులను తొడుక్కున్నాడు. తన రాజోచితమైన ఉడుపులను ధరించి తలపై కిరీటాన్ని పెట్టుకోగానే దేదీప్యమానంగా వెలిగే ఇస్తార్ దేవత కనులు పైకెత్తి అతడి అందాన్ని చూసింది. ఇలా పలికిందామె–

"ఇటురా, గిల్గామేష్, వచ్చి నా వరుడివికా! నీ దేహపు విత్తనాలను నాటు నాలో. నన్ను నీ వధువుగా స్వీకరించి నా భర్తవుకా. నీకోసం నేను వైడూర్యపు రధాన్ని, బంగరు చక్రాలతో, రాగి కొమ్ములతో తయారుచేస్తాను. మహా శక్తివంతమైన వీరులు నీ రధానికి కంచరగాడిదలై లాగుతారు. నీవు నా ఇంటిలో ప్రవేశించినపుడు దేవదారు పరిమళాలతో నా గుమ్మం, సింహాసనం నిన్ను ఆహ్వానిస్తాయి, నీ పాదాలను చుంబిస్తాయి. రాజులు, పాలకులు, యువరాజులు నీకు శిరసువంచి పాదాభివందనం చేస్తారు. పర్వతాల నుంచి, మైదానాల నుంచి వచ్చి కానుకలు కప్పం చెల్లిస్తారు. నీ గొర్రెలు కవలలను కంటాయి, నీ మేకలు త్రిగుణీకృతం చెందుతాయి. నీ గాడిదలు కంచరగాడిదలను మించిపోతాయి, నీ రధానికి పూన్చే అశ్వాలు తమ వేగంతో నలుదిక్కులా ప్రసిద్ధి నొందుతాయి"–

గిల్గామేష్ సమాధానమిచ్చినాడు– "నేను నిన్ను వివాహమాడితే ఎటువంటి బహుమతులు తిరిగి నీకివ్వగలను? ఎటువంటి లేపనాలు, వస్త్రాలు నీ లావణ్యానికి సాటి రాగలిగినవి తేగలను? నీ దివ్యత్వానికి తగ్గ ఆహారాన్ని ఏది నేనివ్వగలను? రాణికి ఉచితమైన మధువును ఎలా తేగలను?

నీ ధాన్యాగారాన్ని గొప్ప బార్లీ ధాన్యంతో నింపగలను. కాని నిన్ను భార్యగా చేసుకోలేను. అది సాధ్యం కాదు. నీ ప్రేమికులు పడిన ఇడుములు నాకు తెలియును. నీవు చలిలో చల్లారే అగ్నివి. గాలిని, తుఫాను ఉండనివ్వని

వెనకవేపు ద్వారానివి, మహా సైన్యాన్ని అణచివేసే దుర్గానివి. మోసేవాడిని నల్లబరిచే తారుద్రవానివి; తీసుకువెళ్లేవాడిని అణగదొక్కే నీటి సంచివి. కోటగోడ పైనుంచి కిందపడే మహాశిలవు, శత్రువు దుర్గపు ద్వారభేదినివి. తొడుక్కున్నవాడిని పడవేసే పాదరక్షవు –ఇలా నిన్ను నీ వెనకటి ప్రేమికులు వర్ణించినారు. ఏ ప్రేమికుడినైనా నీవు శాశ్వతంగా ప్రేమించినావా? అందరూ ఆపద్ధర్మ ప్రియుళ్లే కాదా! ఏ గొర్రెలకాపరి నిన్ను శాశ్వతంగా సంతోషపెట్టగలిగినాడు? నీ ప్రియుళ్ల కథలను చెబుతాను, విను, తప్పయితే కాదను. ఆ 'తమ్ముజ్' సంగతేమయ్యింది? నీవు యవ్వనంలో ఉన్నప్పటి ప్రేమికుడు, అతడి కోసం సంవత్సరం తరువాత సంవత్సరం అనంతంగా విలపించావే? ఏడీ అతగాడు? నీవు ప్రేమించావు అనేక రంగులపై దొర్లేవాడిని, కాని, దెబ్బతీసి అతడి రెక్కను నరికావు. ఇప్పుడు అతడు చెట్లతోపులో కూర్చుని– 'నా రెక్క, నా రెక్క' –అని ఏడుస్తున్నాడు.

నీవు ప్రేమించావు సింహాన్ని, మహా బలిష్ఠమైన వాడతడు. అతడికోసం తవ్వినావు గోతులు, ఏడు.

నీవు ప్రేమించినావు భీకరమైన యుద్ధాశ్వాన్ని. అతడికోసం కొరడా, నాడా, కళ్లేలను సృజించి, క్షణంలో ఏడు లీగుల దూరం పరిగెత్తేట్టు చేసి, తాగబోయే నీళ్లను బురదతో నింపినావు. అతడి తల్లి ఇంకా విలపిస్తూనే ఉన్నది శోకగీతాలను వల్లెవేస్తూ.

నీవు ప్రేమించినావు గొర్రెలకాపరిని. నీకోసం ఆహారాన్ని ప్రతిరోజూ వండేవాడు. దానికోసం ఎన్నో గొర్రెపిల్లలను త్యాగం చేసినాడు. అతడిని నీ మంత్రదండంతో కొట్టి తోడేలుగా మార్చినావు. ఇప్పుడు అతడి పరిజనమే అతడిని వేటాడుతున్నారు. అతడి వేటకుక్కలు అతడి పక్కలను కొరుకుతున్నాయి.

నీవు నీ తండ్రి ఖర్జూరవనం తోటమాలి 'ఇషుల్లానా'ను ప్రేమించలేదా? అతడు బుట్టల నిండా ఖర్జూరపు పళ్లు తెచ్చి ప్రతిరోజూ నీ బల్లను నింపేవాడు. అప్పుడు నీవన్నావు– 'ప్రియతమా ఇషుల్లానా, రా, నా దగ్గరకు. నన్ను నీ కౌగిలిలోకి తీసుకో! మనం శృంగారకేళిలో తరిద్దాం'. ఇషుల్లానా అన్నాడు– 'ఏమి కోరుకుంటున్నావు నా నుంచి? నా తల్లి తయారుచేసిన రొట్టెను నేను తింటున్నాను. నీ దగ్గరకువచ్చి మాసిన, కుళ్లిన ఆహారం నేనెలా తినగలను?

మంచుగడ్డల నుంచి రక్షించే తెరనెప్పుడు ఎవరు తయారుచేసినారు?' అతడి సమాధానం విని అతడిని గుడ్డి ఎలుకగా మార్చినావు. అతడు నేలలోని బొరియలలో అంధుడై కొట్టుమిట్టాడుతున్నాడు. పైకి రావాలనేది అతడి తీరని ఆశ.

ఒకవేళ మనిద్దరం ప్రేమికులమైతే నాకూ వాళ్ల గతి పట్టదని నమ్మక మేమిటి?" అడిగాడు గిల్గామేష్.

ఆ మాటలు వినగానే ఇస్తార్‌కు ఆపుకోలేని ఆగ్రహం వచ్చింది. వెంటనే ఆమె స్వర్గానికి వెళ్లి తన తండ్రి 'అను' వద్ద కన్నీళ్లు కారుస్తూ తన పరాభవాన్ని విన్నవించుకున్నది. తన తల్లి అనటమ్ (Antum) తో గోడు వెళ్లబోసుకున్నది. ఇస్తార్ అన్నది– "నాన్నా! గిల్గామేష్ నన్ను అనరాని మాటలన్నాడు, అవమానం చేసినాడు. నావన్నీ వికృత చేష్టలన్నాడు. తండ్రీ! నాకు నీ స్వర్గలోకపు వృషభాన్నివ్వు. ఆ గిల్గామేష్‌ను నాశనం చేసేందుకు. అతడి అహంకారంతోనే అతడు నశించాలి. నీవు నాకు స్వర్గలోకపు వృషభాన్ని ఇవ్వకపోతే నేను నరకలోకపు తలుపుల్ని బద్దలుగొడతాను, ద్వారబంధాల్ని విరగగొడ్తాను. అన్ని లోకాల్ని గందరగోళ పరుస్తాను. భూలోకవాసులు, పాతాళలోక ప్రేతాలు కలిసి, తిరుగుతారు; మృతులు తింటారు సజీవులు తినే ఆహారాన్ని. మృతాత్మలు ఈ నేలపై జనాన్ని మించిపోతాయి"

'అను' దేవుడు అన్నాడు ఇస్తార్‌తో– "నేను నీవు చెప్పినట్లు చేస్తే ఉరుక్ నగరంలో ఏడేళ్లు కరువు వస్తుంది. కంకుల్లో గింజలుండవు. అంతా తప్పా, తాలు. ప్రజలకు ధాన్యం, పశువులకు గడ్డి దాచిపెట్టినావా ఓ ఇస్తార్!"

ఇస్తార్ పలికింది– "నేను దాచినాను ఏడేళ్లకు సరిపడా ధాన్యాన్ని, గడ్డిని. ఏడేళ్లపాటు కరువుకు ప్రత్యామ్నాయాల్ని". ఆమె కృతనిశ్చయాన్ని చూసి 'అను' దేవుడు ఆమెకు స్వర్గలోకపు వృషభాన్ని ఇచ్చినాడు. ఆ వృషభం ఉరుక్ ద్వారాలను చేరుకుని నది వద్దకు వెళ్లింది.

ఒక్కసారి అది అంబారవం చేయగానే భూమి బద్దలై వందమంది యువకులు నేలపై పడి మరణించారు. రెండవసారి రంకె వేసేసరికి నేల పగిలి

మరో రెండువందల మంది ప్రాణాలు కోల్పోయారు. మూడవసారి రంకె వేసేప్పటికి ఎంకిడు నేలపై పడినవాడు తేరుకుని లేచి పైకెగిరి ఆ వృషభపు కొమ్ములు పట్టుకుని ఆపినాడు.

ఆ స్వర్గలోకపు వృషభం ఆగ్రహంతో ఉమ్మింది నురగను ఎంకిడు ముఖం మీదకు, తోకతో విసిరికొట్టింది. ఎంకిడు అరిచాడు గిల్గామేష్‌తో– "మిత్రమా! మనం గొప్పలు చెప్పుకున్నాము మన పేర్లు చరిత్రపుటల్లో శాశ్వతంగా నిలుస్తాయని. నీ కత్తితో ఈ గిత్త కొమ్ములకు మెడకు మధ్య పొడువు. దీని పనవుతుంది ఒక్క పోటుకు"–

గిల్గామేష్ తన మిత్రుడు చెప్పినట్లు పొడిచి చంపాడు ఆ స్వర్గలోకపు వృషభాన్ని. దాని గుండెను వెలికిదీసి సూర్యుడికి అర్పణచేసి ఇద్దరు మిత్రులు విశ్రాంతి తీసుకున్నారు.

ఇస్తార్ చూసింది ఆ మారణకాండను. ఉరుక్ కోటగోడనెక్కి, దుర్గంపైన నిలబడి ఇలా శపించింది– "గిల్గామేష్ నశించునుగాక, అతడు స్వర్గలోకపు వృషభాన్ని చంపి నన్ను ధిక్కరించినాడు". ఎంకిడు ఆ మాటలు విన్నాడు. వృషభపు కుడి తొడను పెరికి ఆమెవేపు విసిరి– "నీవు నాకు దొరికితే నిన్ను ఇలానే చేసి, నీ పొట్ట చీల్చి పేగులు పక్కకు పడేస్తాను" అన్నాడు ఆగ్రహంగా!

ఇస్తార్ పిలిచింది తన పరివారాన్ని, నాట్యగత్తెలను, గాయనీమణుల్ని, దేవాలయపు వేశ్యలను, ఆస్థాన నర్తకీమణులను, స్వర్గలోకపు వృషభపు తొడను వాళ్లమధ్య ఉంచగా వాళ్లు మూకుమ్మడిగా సంతాపగీతాలు పాడనారంభించారు.

ఇక్కడ గిల్గామేష్ ఆ వృషభపు కొమ్ముల అందానికి ముగ్ధుడై కంసాలులు, కవచాలు తయారుచేసే నిపుణులను పిలిపించినాడు. వాటిని రెండు అంగుళాల మందమున్న వైడూర్యపు ఫలకాలపై అలంకరించగా ఒక్కొక్కటి ముప్ఫై పౌండ్ల బరువు తూగినవి. వాటిలో ఆరు తూనికల నూనె పట్టింది. ఆ నూనెను తన రక్షకదేవుడు 'లుగుల్‌బందా'కు అర్పణ చేసినాడు గిల్గామేష్. కొమ్ములను తన భవనంలోకి తీసుకువెళ్లి గోడకు తగిలించినాడు. ఆనక మిత్రులిద్దరూ యుఫ్రటిస్ (Euphrates) నదిలో స్నానం చేసినారు. వాళ్లు ఉరుక్ వీధుల్లో వెళ్తున్నపుడు

నగరంలోని వీరులు వారిని చూసి హర్షధ్వానాలు చేసినారు. గిల్గామేష్ గానం చేస్తున్న యువతులను అడిగినాడు– “ఎవరు ఈ లోకంలో గొప్పవీరుడు, మానవులలో మిక్కిలి ప్రఖ్యాతినొందినవాడెవడు?”

“గిల్గామేష్! గిల్గామేష్!” అని బదులిచ్చినారు వాళ్లు. రాజభవనంలో నృత్య గానాదులు విందు వినోదాలు ముగిసినాక విశ్రాంతి తీసుకున్నారు మిత్రులిద్దరూ.

తెల్లవారింది. ఎంకిడు లేచి తన మిత్రుడు గిల్గామేష్‌తో మొరపెట్టు కున్నాడు– “సోదరా, నాకు ఓ కల వచ్చింది రాత్రి. అను, ఎన్‌లిల్, ఈఆ, షామాష్‌లు కూర్చుని ఉన్నారు సభలో.

అను దేవుడు అన్నాడు ఎన్‌లిల్‌తో– “వాళ్లు స్వర్గలోకపు వృషభాన్ని చంపినారు. వాళ్లు దేవదారు వన సంరక్షకుడైన ‘హుంబాబా’ను చంపినారు”.

షామాష్ అన్నాడు– “ఓ ఎన్‌లిల్! నీ ఆజ్ఞతోనే కదా వాళ్లు వృషభాన్ని, హుంబాబాను చంపింది. అయినా ఎంకిడు చనిపోవాలా దానికి శిక్షగా?”

ఎన్‌లిల్ ఆగ్రహంతో మండిపడినాడు– “నీవే దీనికంతా కారణం. వాళ్లకు సాయం చేసింది నీవు, దేవతలలో ఒక్కడివై ఉండి వాళ్లతో చంపించావు”

తన స్వప్నాన్ని వివరించి ఎంకిడు కళ్ల వెంబడి నీళ్లు ధారాపాతంగా కురుస్తూ ఏరులై పారుతుండగా అన్నాడు– “సోదరుడా! నీవు నాకెంతో ఇష్టుడివి. అయినా వాళ్లు నన్ను నీనుంచి విడదీసి తీసుకునిపోతారు. నేను మృత్యువు గుమ్మం ముందు కూర్చుంటాను. నా ప్రియ సోదరుడినిక కన్నులారా చూడలేను”.

ఎంకిడు జబ్బుపడినాడు. మృత్యుద్వారాన్ని సజీవ మాంసఖండంగా భావిస్తున్నాడు– “ఓ మృత్యుద్వారమా! ఎటువంటి భావనలు లేని మొద్దువి నీవు. ఇరవై లీగుల దూరం వెదికాను ఎత్తైన దేవదారు వృక్షం కోసం. నీలాంటి ప్రశస్తమైన దుంగ మరెక్కడా లేదు. డెబ్బై రెండు క్యూబిట్ల ఎత్తు, ఇరవై నాలుగు కూబిట్ల వెడల్పు, ఆధారాలు, ద్వారబంధాలు, అతుకులు, అన్నీ చక్కగా అమరినాయి. నిప్పూర్‌లోని గొప్ప శిల్పి నిన్ను అనితరసాధ్యంగా చెక్కినాడు. దీనివలన ఏదైనా మంచి జరుగుతుందనుకున్నానే కాని, ఇలా నాకు కీడు ముంచుకు వస్తుందను కుంటే నిన్ను గొడ్డలితో ముక్కలు ముక్కలు చేసి చిన్ని కంచెకు చెక్కలుగా, తలుపుగా

వాడి ఉండేవాడిని. రేపు ఇంకే గొప్పరాజు వస్తాడో, లేక దేవుడు నిన్ను చెక్కుతాడేమో, నాపేరు తుడిచేసి తనపేరు వ్రాసుకుంటే మీదపడిన శాపం అతడికి చెందునుగదా 'ఎంకిడు'ని వదిలేసి"–

ఎంకిడు దుఃఖించాడు సూర్యుడివేపు తిరిగి. సూర్యకాంతిలో అతడి కన్నీళ్లు మిలమిల మెరిసాయి– "సూర్య భగవానుడా! నేను ప్రార్థిస్తున్నాను. ఆ దుష్టుడైన వేటగాడు వలపన్నినాడు. అతడి వలలో ఏమీ పడకుందునుగాక. అతడిని బలహీనుడిని చేయుము. ఒకవేళ అతడి వలలో ఏ జంతువైనా చిక్కినా తప్పించుకుని పారిపోనిమ్ము"–

వేటగాడిని తిట్టినాక అతడి ఆలోచన తనను ఆకర్షించిన వేశ్యవేపు మళ్లింది. "ఓ దుష్టురాలా! నిన్ను శపిస్తున్నాను నేను. నీకు అనంతకాలం శిక్ష విధించబడునుగాక! నా శాపం నీకు తగిలి తీరుతుంది. నీ వ్యాపారం నశించి పోతుంది. నీకు ఇల్లు లేకుండా పోవునుగాక! నీ తోటి సహవాసినులు వెళ్లిపోగా, నీవు ఒంటరివై తాగుబోతులు వమనం చేసినచోట నిలబడి నీ ఆకర్షణా గాలాలను విసిరెదవులే! నీవు ముట్టుకున్నది కుండలు చేసే మట్టిగా, నీ సంపాదన బూడిద కాగా, నీవు కూడలిలో కులాలుడి కొంపలో దుమ్ము మధ్య కూర్చుంటావు. నీ శయ్య రాత్రిపూట ఏదైనా పెంటకుప్పపైన, పగలు నీ వ్యవహారం గోడల నీడలలోనూ సాగునుగాక! ముళ్లు, కోసురాళ్లు నీ పాదాలను కోసి గాయ పరచునులే! తాగుబోతులు, అలగాజనం నీ బుగ్గలపై విసురుగా కొట్టగా నీనోరు నెప్పిపుట్టును గాక! నీ ఊదారంగు దుస్తులు సమస్తమూ పోవునులే! నేననుకున్నాను ఒకప్పుడు నా భార్యకు నగలు, నాణేలు, నిధులు ఇస్తానని, ఇప్పుడేమున్నది నా దగ్గర?"–

షామాష్ విన్నాడు ఎంకిడు ప్రేలాపనలను– "ఓ ఎంకిడూ! ఎందుకామెను ఆడిపోసుకుంటున్నావు. ఆమే కదా నీకు నేర్పింది నాగరికతను; దేవతలకు ఉచితమైన రొట్టె, మధువు ఆస్వాదించడానిని! ఆమె నీకు తొడిగింది అద్భుతమైన దుస్తుల్ని! ఆమే కదా నీకిచ్చింది గిల్గామేష్‌తో సాహచర్యాన్ని! గిల్గామేష్ నీ సోదరుడు, భూమిపైని రాజులు నీ పాదాలను ముద్దాడేట్లు చేసినాడు. ఈనాడు ఉరుక్ ప్రజలు నీగురించి విలపిస్తున్నారు. నీవు చనిపోతే గిల్గామేష్ సంతాప

సూచకంగా శిరోజాలను పెంచి, సింహపు చర్మం తొడుక్కొని ఎడారులలో ఏడుస్తూ తిరుగుతాడు"–

షామాష్ మాటలు వినగానే ఎంకిడు ఎదలోని విషాదభారం కొంతవరకు తగ్గింది. ఎంకిడు అన్నాడు– "ఓ మహిళా! నీకు వాగ్దానం చేస్తున్నాను. నేను నా శాపం ఉపసంహరించుకుంటున్నాను. రాజులు, యువరాజులు, కులీనులు నిన్ను మెచ్చుకుందురుగాక! నిన్ను తలచుకోగానే ఎటువంటి మగాడైనా పన్నెండు మైళ్ల దూరంలో ఉన్నా అతడు తన తొడను చరుచుకుంటాడు. అతడి రోమాలు ప్రకంపిస్తాయి. అతడు నీతో కూడి సకల సౌఖ్యాలు అనుభవించునుగాక! వైడూర్యాలు, స్వర్ణం, కార్నిలియన్ మణులు నీకు నిధులుగా లభించును గాక! నీ వేళ్లకు స్వర్ణాంగుళీయాలు, నీ దేహానికి అద్భుత వస్త్రాలు అమరును గాక! నీ వలన నా ఏడుగురు బిడ్డల తల్లి క్షమింపబడునుగాక!

ఎంకిడు వ్యాధితో మంచంబట్టి ఒంటరిగా నిద్రించినాడు. లోపలి దిగులును తన మిత్రుడికి తెలిపినాడు. నేను కదా దేవదారు వృక్షాల్ని నరికింది. వనాన్ని చదునుచేసింది. నేను చంపాను 'హుంబాబా'ను. ఇప్పుడు చూడు నాకేమయ్యిందో! విను, మిత్రమా! ఇది నా స్వప్నం. రాత్రి నన్ను కలవరపరచింది. ఆకాశం ఉరిమింది. భూమి బదులిచ్చింది ప్రతిధ్వనులతో. రెంటిమధ్య నేను అసహాయంగా! నాకెదురుగా ఓ మానవపక్షి, నన్ను ఓ పని చేయమని ఆజ్ఞాపించినాడు. అతడిది పిశాచపు ముఖం, సింహపాదం, గరుడపక్షి గోళ్లలా చేతులు. నామీద పడినాడు, అతడి గోళ్లు నా జుట్టును పట్టుకున్నాయి గట్టిగా! నాకు ఊపిరాడలేదు. అతడు నా చేతులను ఈకలతో కూడిన రెక్కలుగా మార్చినాడు. నావేపు తీక్షణంగా చూస్తూ నన్ను చీకటిరాణి 'ఇరకల్లా' భవనం వేపు నడిపించినాడు. అక్కడకు పోయినవారు వెనక్కి తిరిగి రాలేరు. ఆ దారిన ముందుకు వెళ్లడమే కాని వెనక్కి రావడం లేదు ఎవరూనూ.

అక్కడున్న ఇంటిలో జనులు చీకటిలో కూర్చున్నారు. దుమ్ము వాళ్ల ఆహారం, మట్టి వాళ్లకు మాంసం. వస్త్రాలకు బదులు కప్పుకున్నారు పక్షుల ఈకలు. వెలుగు లేదక్కడ. అంతా అంధకారం. నేనా ధూళికొట్టుకున్న గృహంలో చూసాను భువిపైన రాజులు అక్కడ మట్టికొట్టుకుని, కిరీటాలు పోగొట్టుకుని;

పాలకులు, యువరాజులు, వెనక భూమిని పాలించినవారు, ఒకప్పుడు 'అను', 'ఎన్‌లిల్' దేవుళ్ల సరసన నిలబడినవాళ్లు ఇప్పుడు సేవకుల్లా మట్టి గుడ్డలను మోస్తున్నారు. ఆ ధూళిగృహంలో పూజారులు, అర్చకులు, ఏవో మంత్రాలు చదువుతున్నారు పారవశ్యంతో. అక్కడ 'ఇటానా' కిష్ ప్రభువు (ఒకప్పుడు గరుడపక్షి అతడిని స్వర్గానికి కొనిపోయింది), సముక్వాన్ (పశుపతి), ఎరెష్కిగల్ – పాతాళ లోకపు రాణి ఉన్నారు. ఆమెముందు కూర్చుని ఉన్నది బెలిత్–షెరి. ఆమె వ్రాస్తుంది ప్రాణుల పాపపుణ్యాల చిఠాను. దేవతల వ్రాయసకాడు ఆమె. ఆమె చేతిలో ఉన్నది మృత్యు పుస్తకం. ఒక మట్టి పలకను చేతబూని ఆమె చదువుతున్నది వివరాలను. ఆమె నావేపు చూసింది– 'ఎవరు తీసుకువచ్చారు నిన్నిక్కడకు?' – ఆ మాటలు వినగానే నేను రక్తం పోయిన మనిషి తుప్పల్లో కూలినట్లు, రక్షకభటుడు పట్టుకున్నపుడు గుండె భయంతో విపరీతంగా కొట్టుకున్నట్లు నేను అనుభూతి చెంది పడిపోయాను"

ఎంకిడు చెప్పిన కల వృత్తాంతం వినగానే గిల్గామేష్ లేచి ఉద్రేకంతో తన బట్టలు చింపుకున్నాడు. కన్నీళ్లు ధారాపాతంగా కారినాయి. నోరు తెరచి అన్నాడు ఎంకిడుతో– "ఎవరున్నారు ఈ దుర్భేధ్యమైన కోటగోడలతో ఉన్న ఉరుక్ పట్టణంలో ఇటువంటి జ్ఞాని? వింత విషయాలు విన్నవించినావు. ఎందుకు నీ హృదయం ఇవ్వాళ ఇలా కళవళ పడుతున్నది? స్వప్నం అద్భుతంగా ఉన్నది కాని భీకరంగా తోచినది. అయినా ఈ స్వప్నాన్ని మనం విశ్లేషించాలి భద్రంగా దాచుకుని. ఈ స్వప్నం చెబుతున్నది చివరకు కష్టాలు వస్తాయని, జీవితానికి ఆఖరి ఘట్టం దుఃఖమని. నేనిప్పుడు దేవాధిదేవతలను ప్రార్థిస్తాను, నీకోసం, నిన్ను దుస్వప్నం నుంచి రక్షించేందుకు"

ఎంకిడు జబ్బు పడినాడు స్వప్నం వచ్చిన రోజునుంచి. రోజల్లా మంచమ్మీదనే ఉండడం అతడి బాధను మరింత ఎక్కువ చేసింది. అతడు గిల్గామేష్‌తో అన్నాడు– "ఒకప్పుడు నేను నీకోసం పరిగెత్తాను 'జీవజలం' కోసం. ఇప్పుడు నా దగ్గరేమీ లేదు"–

రెండవరోజు మరింత నీరసించాడు. మూడవరోజు కలవరించాడు గిల్గామేష్‌కై. దుఃఖంతో కళ్లు గుడ్డివైనాయి. పదిరోజులు, పన్నెండు రోజులు

గడిచాయి. పన్నెండవ రోజున గిల్గామేష్‌ను పిలిచి అన్నాడు– "మిత్రమా! ఇస్తార్ దేవత నన్ను శపించింది దారుణమైన చావు చావమని. నాకు వీరస్వర్గం లభించదు. యుద్ధంలో మరణం అన్నిటికన్నా ఉత్కృష్టమైనది. నాకా అదృష్టం లేదు". ఇరువురు మిత్రులూ ఒకరినొకరు చూసుకుని ఏడ్చినారు గుండెలు బద్ధలయ్యేలా!

ఉదయాననే గిల్గామేష్ సమావేశపరచినాడు ఉరుక్ సభికుల్ని, సలహాదారుల్ని–

"నా మాటలను సావధానంగా వినండి,
ఓ ఉరుక్ నగర సలహాదారులారా!
నేను దుఃఖిస్తున్నాను 'ఎంకిడు' కోసం
నా మిత్రుడికోసం, ఓ మహిళలా
నేను దుఃఖిస్తున్నాను నా సోదరుడికోసం
ఓ ఎంకిడూ! నా సోదరుడా!
నీవు నా పక్కనుండే గొడ్డలివి
నా భుజబలానివి, నా కరవాలానివి
నా కవచానివి, నాకు రక్షణవు నీవు.
ప్రశస్తమైన వస్త్రానివి, విలువైన మణిహారానివి.
చెడు విధి నిన్ను దోచివేసినది
అడవి గాడిద, జింక
తల్లిదండ్రులు నీకు
పొడుగాటి తోక ఉన్న జంతువులు
పెంచి పోషించాయి నిన్ను
నీకోసం విలపిస్తున్నాయి.
మైదానాలు, పచ్చికబయళ్లలో
స్వేచ్ఛగా తిరిగావు నీవు
దేవదారు వనాల్లో నీవు నడచిన దారులు
రేయింబవళ్లు గుసగుసలాడుతున్నాయి నీకై

ఉరుక్ నగరపు వీరులు, సలహాదారులు
దుఃఖిస్తున్నారు నీకొరకు.
ఆశీర్వదించే అంగుళి
దుఃఖాన్ని సూచిస్తున్నది నేడు
ఎంకిడు సోదరా, చూడు!
దేశమంతటా ప్రతిధ్వనిస్తున్నది
తల్లి సంతాపంలా, విలాపగీతం
మనం నడచిన దారులు
మనం వేటాడిన జీవాలు
ఎలుగుబంట్లు, హైనాలు
పెద్దపులులు, పాంథర్‌లు
చిరుతపులులు, సింహాలు
దుప్పులు, లేళ్లు, వృషభాలు, జింకలు,
మనం నడచిన నదులు తీరాలు
నీకోసం విలపిస్తున్నవి.
ఎలంలోని ఉలా, ప్రియమైన యుఫ్రెటిస్
మనం సంచుల్లో నీళ్లు నింపుకున్న నదులు
మనమెక్కిన పర్వతాలు, కొండలు,
మనం వన సంరక్షకుడిని చంపిన చోటులు
నీకోసం దుఃఖిస్తున్నవి.
దుర్భేధ్యమైన కోటగోడలున్న ఉరుక్ నగరపు యోధులు
ఎక్కడైతే స్వర్గలోకపు వృషభం చంపబడిందో అక్కడ
నీకోసం దుఃఖిస్తున్నారు.
ఎరిడు ప్రజలందరూ
ఎంకిడు కోసం విలపిస్తున్నారు.
నీకోసం ధాన్యం తెచ్చేవాళ్లు
నీకోసం కన్నీరు కారుస్తున్నారు

నీ వీపును నూనెతో మర్దన చేసేవాళ్లు
నీకోసం దుఃఖిస్తున్నారు.
నీకు బీరు, మధువు ఇచ్చినవాళ్లు
నీకొరకు విలపిస్తున్నారు
నిన్ను సుగంధ ద్రవ్యాలతో స్నానం చేయించిన వేశ్య
నీకోసం దుఃఖిస్తున్నదిపుడు.
నీకు భార్యను తెచ్చిన వృద్ధురాలు
నీకు సలహాలనిచ్చే మహిళ దుఃఖిస్తున్నది.
నీ మిత్రులు, సోదర సమానులు
విలపిస్తున్నారు మహిళల్లా.
శిరోజాలను కత్తిరించక పెంచుతున్నారు
ఏ నిద్ర నిన్ను ఆపుతున్నది మిత్రమా?
నీవు చీకటిలో ఉన్నావు, నన్ను వినడం లేదు'–

గిల్గామేష్ తడిమిచూసాడు ఎంకిడు ఛాతిని. ఎటువంటి హృదయ స్పందనా కానరాలేదు. విలపిస్తూ అతడు తన మిత్రుడి దేహంపై వధువులకు కప్పే ప్రశస్తమైన వస్త్రాన్ని కప్పినాడు. సింహంలా, పిల్లలను కోల్పోయిన సివంగిలా అతడు గర్జించినాడు. ఎంకిడు దేహమున్న మంచం చుట్టూరా అటు ఇటు తిరిగినాడు. జుట్టు పీక్కున్నాడు విరజిమ్మినాడు. వంటిపై దుస్తులను చింపుకుని పీలికలను విసిరి పారవేసినాడు.

ఉదయం కాగానే అతడు మరింత దుఃఖించినాడు.

"నేను నీకు రాజోచితమైన శయ్యను, నా ఎడమవేపు ఉచిత ఆసనాన్ని ఇచ్చాను. భూమిపైన యువరాజులు నీ పాదాలను ముద్దాడేలా చేసాను. నీవు వెళ్లిపోయావు. ఉరుక్ ప్రజలు నీకొరకు విలపిస్తున్నారు. శోకగీతాలను ఆలపిస్తున్నారు. ప్రజల సంతోషం నీ మరణంతో దుఃఖంగా మారినది. నీవు వెళ్లిపోయినాక నేను నా శిరోజాలను పెంచుతాను నీకోసం, ఎడారుల్లో తిరుగుతాను సింహపు చర్మాన్ని ధరించి".

అలా గిల్గామేష్ ఏడురాత్రులు, ఏడు పగళ్లు దుఃఖించినాడు. పార్థివ దేహాన్ని నేలకు అప్పగించగా ఇక మిగిలింది పాతాళలోకపు అనున్నాకి, న్యాయమూర్తుల తీర్పు

గిల్గామేష్ ప్రభువు ఉత్తర్వులు జారీచేసినాడు– నిపుణులైన కంసాలులు, శిల్పులు, లోహకారులను రావించినాడు– “నా స్నేహితుడు ఎంకిడు విగ్రహాన్ని తయారుచేయండి”– వైడూర్యంతో చేయబడిన ఛాతీ, స్వర్ణమయ దేహంతో చేయబడిన విగ్రహం, దాని ముందు దృఢమైన దారువుతో చేయబడిన బల్లపై కార్నెలియన్ పాత్రలో తేనె, వైడూర్యపు పాత్రలో వెన్న నింపబడినాయి. వీటిని గిల్గామేష్ ప్రభువు సూర్యుడికి అర్పణ చేసినాడు. ఆ తరువాత దుఃఖంతో విలపిస్తూ అక్కడి నుండి వెడలిపోయినాడు.

# 6. అమరత్వం కోసం అన్వేషణ

తన స్నేహితుడు ఎంకిడు కోసం ఎంతగానో దుఃఖించాడు గిల్గామేష్. ఎడారిలో ఓ వేటగాడిలా సంచరించాడు. మైదానాలలో దారితెన్నూ తెలియకుండా తిరిగాడు. ఎంత తిరిగినా విషాదమతడిని వీడిపోలేదు. "ఎలా నేను విశ్రాంతి తీసుకోగలను? నా హృదయం నిండి ఉన్నది నిరాశతో. ఇప్పుడు నా సోదరుడు ఏ స్థితిలో ఉన్నాడో రేపు మరణించాక నేనూ అదే స్థితిలో ఉంటాను. మరణమంటే నాకిప్పుడు భయం వేస్తున్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ నేను మరణాన్ని జయించి దేవతల సరసన నిలిచిన ఉత్నాపిష్టిమ్ (Utnapishtim) ను కలవాలి" ఇలా అనుకుని అతడు సుదూర ప్రయాణాన్ని కొనసాగించినాడు. జలప్రళయం అనంతరం దేవతలు ఉత్నాపిష్టిమ్‌ను 'దిల్‌మన్' దేశంలో ఉంచినారని ప్రతీతి. అక్కడి సూర్యవనంలో అమరుడిగా జీవిస్తున్న ఉత్నాపిష్టిమ్‌ను కలిసి మృత్యువును జయించే రహస్యాన్ని కనుగొనడానికి వెళ్తున్నాడు గిల్గామేష్.

పోగా పోగా అతడు చేరుకున్నాడు పర్వతాల మధ్య ఉన్న కనుమను. అక్కడ దేవతలను ప్రార్థించినాడు. –"ఇదివరకు ఈ కనుమలలో నేను సింహాలను చూసాను. అప్పుడు భయపడి కనులు పైకెత్తి దృష్టిని చంద్రుడిపై నిలిపాను. నా ప్రార్థనలను దేవుళ్లు స్వీకరించారు. ఇప్పుడు ఓ చంద్రదేవతా– సిన్! నన్ను కాపాడు!"

ప్రార్థన అనంతరం అతడు నిద్రపోయాడు. నిద్రలో ఓ స్వప్నం. మెలకువ వచ్చేసరికి అతడి చుట్టూరా తిరుగుతున్న సింహాలు. గొడ్డలి, కత్తి చేతబట్టి అతడు బాణంలా దూసుకుపోయి కొన్నిటిని హతమార్చి మిగతావాటిని చెల్లాచెదురు చేసాడు.

ఆ తరువాత నడచి నడచి 'మాషు' (Mashu) పర్వతాలను చేరుకున్నాడు. అవి సూర్యుడి ఉదయాస్తమయాలను నిర్దేశిస్తాయని పూర్వీకులు చెప్పుకునేవారు. వాటి జంట శిఖరాలు నింగిని తాకుతుండగా, మూలాలు పాతాళలోకంలో

ఉన్నాయంటారు. పర్వత పాదాలవద్ద తేళ్లు సగం మానవుడు, సగం డ్రాగన్ రూపంలో, భయంకరంగా కానవస్తూ కాపలా కాస్తుంటాయి. వాటి చూపు మృత్యు కిరణమే. వాటినుంచి వచ్చే వెలుగు పర్వతాలను కమ్ముకుంటున్నది. దూరం నుంచే గిల్గామేష్ వాటి కాంతికి కళ్లు చెదరకుండా జాగ్రత్తలు తీసుకుని ధైర్యంగా సమీపించాడు ఆ వృశ్చిక మానవుల జంటను; వాళ్లు ఇతడిని చూసి అనుకున్నారు– "ఇతడు రెండు వంతులు దేవుడు ఒక వంతు మనిషి".

వాళ్లు అడిగారు– "ఎందుకు నీవింతదూరం ప్రయాణంచేసి వస్తున్నావు? ప్రమాదకరమైన జలాల్ని దాటినావు, దేనికోసం ఈ ప్రయాస?"

గిల్గామేష్ సమాధానమిచ్చినాడు– "ఎంకిడు కోసం! అతడంటే నాకెంతో ఇష్టం. నాకు సోదరసమానుడు. ఇద్దరం కలిసి అనేక సాహసకృత్యాలు చేసినాం. అతడి గురించే నేను వచ్చాను. మామూలు మనుషులకు జరిగేదే అతడికి జరిగింది. అతడు మరణించాక నేను ఏడురోజులు రాత్రింబవళ్లు ఏడ్చాను. నా దుఃఖం అతడిని బతికిస్తుందని. కాని, అతడు వెళ్లిపోయాడు. ఇప్పుడు నా బతుకు శూన్యమనిపిస్తున్నది. అందుకే నేను ఉత్నాపిష్టిమ్‌ను అన్వేషిస్తూ బయలుదేరాను. అతడు అమరత్వాన్ని సాధించి దేవతల వరుసలో ఉన్నాడు. అతడిని ప్రశ్నించి మృత్యు రహస్యాన్ని, శాశ్వతంగా జీవించే విధానాన్ని కనుక్కోవాలనుకుంటున్నాను".

వృశ్చిక మానవుడు అన్నాడు ఆశ్చర్యంగా– "మానవజాతి మాతృమూర్తికి జన్మించిన ఏ మనిషీ ఇలాంటి కోరిక కోరుకోలేదు. ఏ మానవుడు పర్వతాలను దాటలేదు. వాటి పొడవు పన్నెండు లీగులు అంతా కటికచీకటి. వెలుగు కానరాదు. ఆ చీకటిలో ప్రయాణం దుస్తరం. అంతా దుఃఖమయం"–

గిల్గామేష్ బదులిచ్చినాడు– "దుఃఖమైనా, బాధాకరమైనా ఓర్చుకుంటాను, నిట్టూర్పులతో, రోదనలతోనైనాసరే నేను వెళ్లి తీరవలసిందే. దయచేసి పర్వత ద్వారమును తెరచి నాకు దారి చూపించు"–

వృశ్చిక మానవుడన్నాడు– "వెళ్లు, గిల్గామేష్! వెళ్లు, మాషు పర్వతాన్ని అధిరోహించు, నీ కోరిక నెరవేరును గాక!" ద్వారము తెరవబడినది.

అతడి వద్ద సెలవు తీసుకుని గిల్గామేష్ తన నడక ప్రారంభించినాడు సూర్యుడి దారిలో. ఒక లీగు నడిచేసరికి చీకటి మరింత దట్టమైనది. వెనకా,

ముందూ కన్ను పొడుచుకున్నా కానరాని పరిస్థితి. నాలుగు లీగులు నడిచాడు. ఇంకా చీకటి ఎటుచూసినా, ఎనిమిది లీగులు ప్రయాణించాడు, పది లీగులు, పదకొండో లీగు నడిచినాక కనిపించింది కాస్త వెలుగు. పన్నెండు లీగులు దాటినాక అంతా వెలుగే!

అది దేవతల వనం. మణులు నిండిన చెట్లు. తీగెలకు వేలాడుతున్న కార్నెలియన్ పండ్లు. ఎంతో అందంగా ఉన్నాయి. వైదూర్యపు ఆకులు. హెమటైట్ ముళ్లు, విలువైన రాళ్లు, ఎగేట్, ముత్యాలు ఎక్కడ చూసినా! గిల్గామేష్ సముద్రం పక్కగా నడుస్తున్నపుడు షామాష్ చూసినాడతడిని. జంతుచర్మం ధరించి, జంతువుల మాంసాన్ని తింటున్న గిల్గామేష్‌ను చూసి దుఃఖభరితుడైనాడు– "ఇంతవరకూ ఏ మనిషీ ఇటు రాలేదు. ఇకముందు రాబోడు. సముద్రంపై గాలులు వీచినంత కాలం! ఓ గిల్గామేష్! నీవు వెదుకుతున్న రహస్యం నీకు చిక్కదు సుమా!"

గిల్గామేష్ అన్నాడు– "ఇంతదూరం, ఇంత ప్రయాసపడి వచ్చింది ఈ ముగింపుకేనా! నేనూ ఇతరుల్లా మట్టిలో కప్పబడిపోవాలసిందేనా? నా కళ్లు తీక్షణంగా సూర్యుడిని చూడనీ దృష్టి చెదిరేంత వరకూ. నా పరిస్థితి మరణించిన వాడికన్నా గొప్పగా లేదు, అయినా, నేను చూస్తున్నాను సూర్యుడిని"–

ఆ సముద్రం దగ్గర నివసిస్తున్నది ఓ తీగలాంటి స్త్రీ, మధువు తయారు చేస్తుందామె. ఆమె సిదూరి. సముద్రపు ఒడ్డున ఉన్న ద్రాక్షవనంలో కూర్చుని, దేవుళ్లు ఆమెకు అనుగ్రహించిన స్వర్ణ కలశాలు, పాత్రలు, మధువు నింపి ఉన్న జాడీలున్న చోటున ఆమె ఉన్నది. మేలి ముసుగు ఆచ్ఛాదన కాగా ఆమె తన వేపుగా వస్తున్న గిల్గామేష్‌ను చూసింది. జంతుచర్మం ధరించినవాడు, దేవతల దేహాన్ని పోలిన శరీరం కలవాడు, అయినా హృదయంలో నిరాశ నిండినవాడు, దూర ప్రయాణం చేసి అలసిన ముఖం కలవాడు అతడిని చూసి ఆశ్చర్య పడిందామె. అతగాడికి అడ్డంగా తలుపును వేసి గడియ బిగించింది. గిల్గామేష్ అడిగాడు– "యువతీ, ఎందుకు నన్ను చూడగానే నీవు ద్వారమును మూసి తలుపుకు గడియ వేస్తున్నావు? నేను నీ తలుపును బద్దలుగొట్టిపోగల సామర్థ్యమున్న గిల్గామేష్‌ను. స్వర్గలోకపు వృషభ సంహారిని నేను. దేవదారు

వృక్షాల అరణ్యపు సంరక్షకుడిని మట్టుపెట్టినవాడిని. 'హుంబాబా'ను పడగొట్టాను, పర్వత సానువులలో సింహాలను కడతేర్చినవాడిని నేను".

సిదూరి అన్నది– "స్వర్గలోకపు వృషభాన్ని చంపిన గిల్గామేష్‌వు నీవైతే, దేవదారు వనసంరక్షకుడిని, హుంబాబాను చంపినవాడివైతే, పర్వతపు సానువుల్లోని సింంహాలను కడతేర్చిన వీరుడివి నీవైతే ఎందుకు నీ బుగ్గలు చిక్కిపోయి, నీ వదనం పీక్కుపోయి ఉన్నది? ఎందుకు నీ హృదయంలో నిరాశ, ఎందుకు నీవు కనిపిస్తున్నావు దీర్ఘ ప్రయాణంలో అలసిసొలసిన యాత్రికుడిలా? ఎండలో, చలిలో దెబ్బతిన్నట్లు నీముఖం కమిలిపోయిందెందుకు? ఏ గాలి కోసం నీవు పచ్చికమైదానాలను దాటి ఇటు వచ్చినావు?"–

గిల్గామేష్ బదులు పలికాడు– "ఎందుకు నా బుగ్గలు చిక్కిపోకూడదు? ఎందుకు నా ముఖం వాడిపోకూడదు? నిరాశ నా హృదయాన నిండి ఉన్నది. సుదూర ప్రయాణం చేసినవాడి ముఖంలా నా ముఖం కానవస్తున్నది. నా ముఖం ఎండకు ఎండి, చలికి పగిలి కాలినట్లు కానవస్తున్నది. ఏమి, ఎందుకు నేను పచ్చిక మైదానాలలో దారితెన్నూ లేకుండా సంచరించరాదు గాలికోసం? నా మిత్రుడు, నా సోదరుడు స్వర్గలోకపు వృషభాన్ని చంపినవాడు, దేవదారు అరణ్యంలో హుంబాబాను నేలకూల్చినవాడు, నాకెంతో ఇష్టమైనవాడు, నాతోపాటు ఎన్నో ప్రమాదాలను ఎదుర్కొన్నవాడిని నిర్దాక్షిణ్యంగా మృత్యువు తీసుకునిపోయినది. నేను ఎంకిడు కోసం ఏడు రాత్రుళ్లు పవళ్లు ఏడ్చాను, నా దుఃఖం అతడిని బతికిస్తుందేమోనని. నా సోదరుడి అంతిమయాత్ర నన్ను మృత్యువుకు భయపడేలా చేసింది. అందుకే నేను విశ్రాంతి లేకుండా ఇలా ఎడారులు, అడవులు పట్టి ఒంటరిగా సంచరిస్తున్నాను. కాని ఓ యువతీ, మధువు తయారు చేసే మనోహారిణీ! నీ సుందర వదనాన్ని చూసిన కళ్లతో నేనెంతగానో భయపడే మృత్యువును చూడనివ్వకు!"

ఆమె అన్నది– "గిల్గామేష్! ఎందుకీ తొందర? నీవు వెదుకుతున్న శాశ్వత జీవనం నీకు లభించదు. మానవుడిని సృష్టించినప్పుడే దేవతలు అతడికి మృత్యువును కేటాయించినారు. జీవాన్ని వాళ్లు చేతుల్లో ఉంచుకున్నారు. అదే ఆయుర్దాయం. గిల్గామేష్, నీ కడుపును ఈ లోకాన దొరికే ప్రశస్తమైన వాటితో

నింపుకో. రాత్రి పగలు, పగలు రాత్రి, నృత్యగాన విందు వినోదాలతో ఆనందించు. శుభ్రంగా స్నానం చేయి, చక్కని దుస్తులు ధరించు, నీ చేతులు పట్టుకుని నడిచే చిన్నారులతో కలిసి నడువు. నీ కౌగిలిలో భార్యను సుఖపెట్టు. ఇదే మానవుడిగా నీ కర్తవ్యం, బరువు, బాధ్యతా!"

సిదూరి యువతినుద్దేశించి గిల్గామేష్ అన్నాడు– "యువతీ, నేనెలా నిశ్శబ్దంగా ఉండగలను, ఎలా విశ్రాంతి తీసుకోగలను. నేనెంతగానో ప్రేమించిన ఎంకిడు దుమ్ముగా మారినాక! నేనూ అంతే రేపు మట్టిలో మట్టినౌతాను. నీవు సముద్రతీరాన ఉన్నావు. దాని హృదయంలోకి తొంగి చూడగలవు. ఇప్పుడు చెప్పు, 'ఉబారాతుతు' కుమారుడు ఉత్నాపిష్టిమ్‌ను కలిసేందుకు ఎటుపోవాలి? ఆ దారి ఎటు? అవసరమైతే సముద్రాన్ని దాటుతాను, లేదంటే ఇలానే భూమార్గాన అరణ్యాలు, కొండలు, గుహలు అన్నీ గాలిస్తాను.

సిదూరి అన్నది– "గిల్గామేష్! నీవు సముద్రాన్ని దాటనక్కరలేదు. ఎవరూ ఇంతవరకూ ఆ పని చేయలేదు ఒక షామాష్ తన కాంతితో తప్ప. దారి దుర్గమమైనది. మధ్యలో మృత్యుజలాలు ప్రవహిస్తాయి. గిల్గామేష్! ఎలా దాటుతావు నీవు ఈ సముద్రాన్ని? మృత్యుజలాల్ని సమీపించినపుడు నీవేం చేస్తావు? అదుగో ఆ దిగువన ఉన్న అరణ్యాలలో నీకు ఊర్షనాబి (Urshanabi) ఉత్నాపిష్టిమ్ పడవ నడిపేవాడు కనిపిస్తాడు. అతడి వద్ద పవిత్ర వస్తువులున్నాయి. శిలా నిర్మితాలవి. అతడు తయారు చేస్తున్నాడు సర్పరూపులో పడవ ముందు భాగాన్ని. అతడు నిన్ను మెచ్చితే బహుశా నిన్ను మృత్యుజలాలు దాటించగలడు. అది కుదరకపోతే నీవు ఇంటిదారి పట్టక తప్పదు"–

గిల్గామేష్‌కు ఆగ్రహం వచ్చింది. అతడు మహోద్రేకంతో దిగువనున్న అడవుల వేపు ప్రయాణం సాగించినాడు. గొడ్డలి చేతబట్టి, కత్తి దూసి, విసిరిన ఈటెలా ముందుకు దూసుకుపోయినాడు. ఆ గొడ్డలి, కత్తుల మెరుపులను ఊర్షనాబి గమనించాడు. వాటి వేటుకు పడవ కాస్త దెబ్బతిన్నది. ఊర్షనాబి కోపంగా అన్నాడు– "నీపేరేమిటి? నేను ఉత్నాపిష్టిమ్ పడవ నడిపేవాడిని. నాపేరు ఊర్షనాబి".

"నాపేరు గిల్గామేష్. నేను 'అను' గృహమైన 'ఉరుక్' నుంచి వచ్చాను" అన్నాడు గిల్గామేష్.

ఊర్షనాబి అన్నాడు– "ఎందుకు నీ బుగ్గలు చిక్కిపోయినాయి? ఎందుకు నీ ముఖం వాడిపోయి ఉన్నది? నీ హృదయం నిరాశలో ఉన్నది, నీ వదనం సుదూరయాత్ర చేసిన వాడిలా పీక్కుపోయి కనిపిస్తున్నది; నీ ముఖం ఎండకు వాడి, చలికి పగిలి ఉన్నది? ఎందుకు నీవు పచ్చిక మైదానాలను దాటి గాలిని వెదుక్కుంటూ ఇటు వచ్చినావు?"–

గిల్గామేష్ అన్నాడు– "ఎందుకు నా బుగ్గలు చిక్కి ఉండకూడదు? ఎందుకు నా ముఖం వాడిపోకూడదు? ఎందుకు నా హృదయం నిరాశలో నిండి ఉండకూడదు, ఎందుకు నాముఖం సుదూర యాత్ర వలన పీక్కుపోయినట్లు కనబడకూడదు? మిత్రుడా! నా సోదరుడు స్వర్గలోకపు వృషభాన్ని చంపినవాడు, దేవదారు అరణ్యంలో హుంబాబాను మట్టికరిపించినవాడు, నాకెంతో ఇష్టమైనవాడు, నాతోపాటు ఎన్నో ప్రమాదాలనెదుర్కొన్నవాడు, ఎంకిడు మరణించినాడు. నేను ఏడు రాత్రుళ్లు, ఏడు పగళ్లు అతడికై దుఃఖించాను, నా దుఃఖం అతడిని బతికిస్తుందేమోనని. నా సోదరుడి మరణం వలన నేనిప్పుడు మృత్యువంటే భయపడుతున్నాను, ఇలా దారితెన్ను తెలియని ఎడారులలో సంచరిస్తున్నాను. నాకూ రేపు ఇలానే జరుగుతుందని తెలిసే నేనెలా నిశ్శబ్దంగా ఉండగలను? ఎలా విశ్రాంతి తీసుకోగలను? అతడు ఇప్పుడు దుమ్ములో కలిసి పోయినాడు. నేనూ రేపు మట్టిలో మట్టిగా కలిసిపోతాను. ఓ ఊర్షనాబీ! ఎటు వెళ్లాలి ఉత్నాపిష్టిమ్‌ను కలవడానికి? నేను మృత్యు జలాలను దాటి వెళ్లగలనా? లేదంటే ఇలానే నేను మరింత దూరం సంచరిస్తాను"–

ఊర్షనాబి అన్నాడు– "గిల్గామేష్! నీ చేతులే నిన్ను సముద్రం దాటకుండా చేసాయి. నీవు పడవకు నష్టం కలిగించి దానిని ప్రయాణించేందుకు పనికి రాకుండా చేసావు"–

గిల్గామేష్ అన్నాడు– "నామీద కోపమెందుకు, ఊర్షనాబీ! నీవు రేయి, పవలు అనేది లేకుండా మృత్యుజలాల్ని దాటుతావు కదా!"

ఊర్షనాబి అన్నాడు– “నీవు ధ్వంసం చేసిన నావ వల్లనే నేను మృత్యు జలాలంటకుండా ఆవలి తీరం చేరతాను. వాటితోపాటు ‘ఉర్ను’ (Urnu) సర్పాల్ని నాశనం చేసావు. సరే ఇప్పుడు అడవిలోకి వెళ్లు. నూట ఇరవై దుంగలు నరుకు. ఒక్కొక్కటి అరవై కూబిట్ల పొడవుండాలి. వాటికి తారుపూయి. వాటిని కఱ్ఱలపై ఇక్కడికి తీసుకునిరా!”

గిల్గామేష్ అడవికి వెళ్లాడు. నూట ఇరవై చెట్లను నరికి అరవై కూబిట్ల పొడవున్న దుంగలను చేసినాడు. వాటికి బిటుమెన్–తారును పూసినాడు. వాటిని కఱ్ఱలపై దొర్లించుకుంటూ ఊర్షనాబి వద్దకు తెచ్చినాడు. వాటిని పడవపై ఉంచి ఇద్దరూ పడవనెక్కినారు. మృత్యుజలాల వద్దకు రాగానే, ఒక దుంగను నీళ్లలోకి నొక్కి పడవను ముందుకుతోసారు. ఇప్పుడు రెండవది, మూడవది, నాలుగు, అయిదు, ఆరు, ఏడు, ఎనిమిది... ఇలా నూటఇరవై దుంగల్ని నీళ్లలోకి దింపి పడవకు తెడ్డులా వాడుతూ ముందుకు పోయినారు. తరువాత గిల్గామేష్ తన దుస్తులను విప్పి తాను తెరచాప స్తంభంగా, తన దుస్తులు తెరచాపలా నిలబడగా గాలి విసురుకు పడవ ఒడ్డుకు చేరింది. అలా ఊర్షనాబి తనతోపాటు గిల్గామేష్‌ను ఫారవే (Faraway) అని పిలువబడే ఉత్నాపిష్టిమ్ దగ్గరకు దిల్‌మన్ (Dilmun) వనంలోకి తీసుకువచ్చినాడు. తూర్పు పర్వతాలలో సూర్యుడున్నచోటు అది. ఆ ఉత్నాపిష్టిమ్‌కు దేవతలు అమరత్వాన్నిచ్చారని ఐతిహ్యం.

ఉత్నాపిష్టిమ్ దూరంనుంచే వాళ్లను గమనించాడు. “ఏమిటి నా పడవ తెరచాపస్తంభం, తెరచాప లేకుండా వస్తున్నది? పవిత్ర శిలలు కానరావు. వచ్చేది నా వ్యక్తి కాదు. అతడు జంతుచర్మాన్ని ధరించి ఉన్నాడు, ఎవరితడు నా పడవ నడిపే ఊర్షనాబి వెనుక వస్తున్నాడు?” అని ఆలోచిస్తూ గిల్గామేష్ తనను సమీపించగానే ఉత్నాపిష్టిమ్ ఇలా అడిగాడు– “నీపేరేమిటి? ఎందుకు నీవు జంతుచర్మాలు తొడుక్కుని తిరుగుతున్నావు? ఎందుకు నీ బుగ్గలు చిక్కిపోయి, నీ ముఖం వాడిపోయి ఉన్నది? ఎక్కడికి పోతున్నావు ఇంత వడివడిగా? ఎందుచేత నీవు ఈ సుదూర ప్రయాణం చేసినావు? మృత్యుజలాలను దాటి ఇలా వచ్చినావు, ఎందుకో వివరించుము!”

గిల్గామేష్ సమాధానమిచ్చినాడు– “నేను ‘అను’ దేవతగృహమైన ఉరుక్ నగరపు గిల్గామేష్‌ను”.

ఉత్నాపిష్టిమ్ అడిగాడు– “నీవే గిల్గామేష్‌వైతే ఎందుకిలా నీముఖం వడిలిపోయి ఉన్నది? ఎందుకు నిరాశ నీ హృదయంలో నిండి ఉన్నది? ఎందుకు నీ వదనం సుదూర ప్రయాణం చేసివచ్చినట్లు వాడిపోయి ఉన్నది? ఎందుకు నీ ముఖం ఎండకు ఎండి, గాలికి పగిలి కమిలి ఉన్నది? ఎందుకు వచ్చినావు నీవు ఇలా దారితెన్నూ తెలియకుండా ఏ గాలికోసం వెదుకుతూ ఉన్నావు?”

గిల్గామేష్ అన్నాడు– “ఎందుకు నా బుగ్గలు ఎండి, నా ముఖం వాడినట్లు కనిపించకూడదు? ఎందుకు నిరాశ నా హృదయంలో నిండగా, నా ముఖం దూర ప్రయాణం చేసినట్లు కనిపించకూడదు? అది ఎండకు ఎండి, చలికి పగిలి కమిలినది. ఎందుకు నేను పచ్చికమైదానాలలో దారీతెన్నూ లేకుండా తిరగకూడదు? నా స్నేహితుడు, నా సోదరుడు స్వర్గలోకపు వృషభాన్ని చంపినవాడు, దేవదారు అరణ్యపు సంరక్షకుడు హుంబాబాను మట్టిగరిపించినవాడు, నాకెంతో ఇష్టమైనవాడు, నాతోపాటు ఎన్నో ప్రమాదాలనెదుర్కొన్నవాడు ఎంకిడు, అతడు మరణించినాడు. అతడికోసం నేను ఏడు రాత్రిళ్లు, ఏడు పగళ్లు ఏకధాటిగా దుఃఖించాను. నా దుఃఖం అతడిని బతికిస్తుందేమోనని. నా సోదరుడి మరణం చూసిన నాకు మృత్యువంటే భయం కలిగినది. అందుకే నేను ఇలా అడవుల్లో ఎడారుల్లో దారి తెన్నూ తెలియకుండా తిరుగుతున్నాను. దీనిని భరించి నేనెలా నిశ్శబ్దంగా ఉండగలను, ఎలా విశ్రాంతి తీసుకోగలను? అతడిప్పుడు ధూళిలో కలిసిపోయినాడు. నేను రేపు మరణించినాక మట్టిగామారి మట్టిలో కలిసిపోతాను కదా!

నేను వచ్చింది ‘ఫారవే’ అని మేం పిలుచుకునే ఉత్నాపిష్టిమ్ వద్దకు. అతడి కొరకు నేను దేశవిదేశాలన్నీ సంచరించాను. అనేక కనుమలు, సముద్రాలు, జలాలు దాటి చివరకు ఇక్కడకు వచ్చాను. ఇప్పుడిక అలసిపోయాను. కాళ్లు నెప్పి పుడుతున్నాయి నడిచి నడిచి అరిగిపోయినట్లు. ఎంతో తియ్యనైన నిద్రను కోల్పోయాను. దుస్తులు చిరిగిపోయాయి. నేను సిదూరి గృహానికి చేరకమునుపే! నేను చంపాను ఎలుగుబంటి, పాంథర్, చిరుతపులి, దుప్పి, జింక, అడవిమృగాల

నవేకం, అంతేకాక పచ్చికమైదానాల్లో తిరిగే చిన్నిచిన్ని జంతువుల్ని. వాటి మాంసం తిన్నాను, వాటి చర్మాల్ని దుస్తులుగా తొడుక్కున్నాను. అలా నేను చేరుకున్నాను సిదూరి గృహానికి. ఆమె ద్వారాన్ని మూసినది. కాని ఆమె ఇటువచ్చే దారి గురించి తెలిపింది. అలా వచ్చి నేను పడవ నడిపే 'ఊర్షనాబి'ని కలుసుకున్నాను. అతడితో కలిసి ప్రయాణించి మృత్యుజలాల్ని దాటాను. తండ్రీ, ఉత్నాపిష్టిమ్! నీవు మానవుడివైనా శాశ్వత జీవనాన్ని పొంది అమరుల సరసున నిలబడినావు. నాకు జీవన్మరణ రహస్యాలను వివరించి, నేను వెదుకుతున్న ప్రాణ విశేషాన్ని తెలియజేయవా?"–

ఉత్నాపిష్టిమ్ అన్నాడు– "ఏదీ శాశ్వతం కాదు. శాశ్వతంగా ఉండే గృహాన్ని నీవు నిర్మించగలవా? కాలాన్ని నిలపగలవా? వారసత్వ సంపద శాశ్వతమా? వరదలు వచ్చినపుడు నదుల్ని నిలువరించగలమా? తూనీగ కన్య తన పురుగు రూపాన్ని వదిలి సూర్యుణ్ణి దర్శించినా చివరకు మరణాన్ని పొందదా? అనాది నుంచి ఏనాడూ శాశ్వతత్వమనేది లేదు. నిద్రకు మరణానికి తేడా ఏమిటి? నిద్రించేవాళ్లు కానరారా మృత్యుచిత్రణలో. ఒక్కసారి శాశ్వతనిద్ర నొందినాక ఎవరు యజమాని, ఎవరు సేవకుడు? అనున్నాకి, న్యాయాధిపతులు 'మమ్మెతన్' విధిదేవతల తల్లితో కలిసి జీవుల ఆయుర్దాయాన్ని నిర్ణయిస్తారు. జీవన్మరణాలను వాళ్లు నిర్దేశిస్తారు కాని మరణపు తేదీని వాళ్లు తెలియనివ్వరు"–

గిల్గామేష్ అన్నాడు –"తండ్రీ, ఇప్పుడు నీకు నాకు మధ్య ఏ తేడా కనిపించడంలేదు. నిన్నొక యోధుడిలా, రణరంగానికి వెళ్తున్న మహావీరుడిలా నా మనసులో చిత్రించుకున్నాను. కాని నీవిక్కడ హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నావు. నాకు వివరించవా, నీవు ఎలా శాశ్వత జీవనాన్ని పొంది, దేవతల సరసన ఉండగలిగినావు?"–

ఉత్నాపిష్టిమ్ అన్నాడు– "నేను నీకొక దేవరహస్యం చెబుతాను. సావధానంగా విను".

# 7. జలప్రళయం

"నీకు తెలుసుకదా యూఫ్రటిస్ ఒడ్డున ఉన్న 'షుర్రుపక్' నగరం! ఆ నగరం పాతబడింది. అక్కడి దేవతలు వృద్ధులైనారు. అంతరిక్షదేవత 'అను' వాళ్ల తండ్రి యోధుడైన 'ఎన్‌లిల్' వాళ్లకు సలహాదారు, నినుర్తా సహాయకురాలు, ఎన్నుగి కాలువల దేవత, వాళ్లకు తోడుగ 'ఈఆ' దేవుడు.

జనాభా పెరిగింది, ప్రపంచం అడవిగిత్తలా అంబారావం చేసింది. మహాదేవుడికి ఈ అల్లరి వలన మెలకువ వచ్చింది. ఎన్‌లిల్ కూడా విన్నాడు ఆ గొడవను. దేవతల సమావేశం ఏర్పాటు చేసినాడు– "ఈ మానవుల గొడవ భరింపరానిదిగా ఉన్నది. ఈ గందరగోళానికి దేవతలకు నిద్రపట్టడం లేదు. వేరే మార్గం లేదు. ఈ మానవులను నాశనం చేయవలసిందే!" తీర్మానం చేసినారు దేవతలు.

ఎన్‌లిల్ అందుకు ఏర్పాట్లు చేసినాడు. కాని 'ఈఆ' దేవుడు నాకు కలలో హెచ్చరిక పంపినాడు, నా రెల్లుగడ్డి ఇంటిలోకి– 'రెల్లు ఇల్లు, రెల్లు ఇల్లు' గడ్డిగోడ, గడ్డిగోడ! విను, విను రెల్లు ఇల్లు! ప్రతిధ్వనించు ఓ షుర్రుపక్ మానవుడా, ఉబారాతుతు పుత్రుడా! విను జాగ్రత్తగా! నీ రెల్లుగడ్డి ఇంటిని పీకి పెద్ద పడవను తయారుచేయుము. సంపదలను వదిలి జీవులను రక్షించు. ప్రాపంచిక వస్తువులను పారవేసి, నీ ఆత్మను సజీవంగా ఉంచుకో! నీ రెల్లు ఇల్లును కూలగొట్టు, త్వరగా, పడవను తయారుచేసుకో! పొడుగు, వెడల్పులు సమానంగా ఉండాలి. పైన సరైన పైకప్పు ఉండాలి. అగాధాన్ని దాటగల గట్టి నిర్మాణాన్ని చేయి. పడవలో అన్ని జీవాలను, గింజలను ఉంచు"–

నేను దేవుడితో పలికాను– "నీవు చెప్పినట్లు చేస్తాను. మరి ప్రజలకు నేనేమి సమాధానమివ్వగలను నగరానికి, పెద్దలకు?"

'ఈఆ' అన్నాడు– "వాళ్లకు తెలియజేయి. ఎన్‌లిల్ ఆగ్రహంతో ఉన్నాడని. అతడి నగరంలో ఉండడం కష్టమని చెప్పు. నేను ఈ నగరాన్ని విడిచి అఖాతంలో ఉన్న 'ఈఆ' దేశానికి పోతున్నానని వివరించు. కుండపోతగా వర్షం కురవ

బోతున్నది. అరుదైన చేపలు, అడవికోళ్లు, పక్షులు వర్షంగా కురుస్తాయి. సాయంకాలానికి వరద ఉధృత ప్రవాహంలా చేరుకుంటుంది”–

తెల్లవారగానే నేను నా కుటుంబ సభ్యులు అందరం కలిసి పడవ నిర్మించడానికి కావలసిన వస్తువుల్ని సిద్ధం చేయడం మొదలుబెట్టాం. అయిదవ రోజుకల్లా అడుగు చట్రం, పక్కబద్దలు, చెక్కలు తయారైనాయి. నేల వైశాల్యం ఒక ఎకరం, పక్కలు నూట ఇరవై కూబిట్లు చదరంగా, మొత్తం ఏడు అరలు, ఒక్కొక్కటి తొమ్మిది భాగాలుగా విభజించాను. గదులు పూర్తి అయినాక వాటిని కావలసిన అత్యవసర వస్తువులతో, ఆహార పదార్థాలతో నింపాను. నెగడు కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు, ఆస్ఫాల్ట్, నూనెతో నిర్మించాను. ఎటువంటి వర్షాన్నైనా తట్టుకునేట్లు దృఢంగా తయారుచేసాను. నౌకను నిర్మించిన వారికందరికీ ఎర్రటి ద్రాక్షసారా, నూనె, తెల్లటి ద్రాక్షసారాయిని పుష్కలంగా ఇచ్చాను. నూతన సంవత్సర పండుగ నాటి వేడుకలు జరిపాను. ఏడవ రోజుకల్లా పడవ పూర్తయ్యింది.

చాలా కష్టంమీద పడవను నీటిలోకి వదిలాము. పడవ రెండువంతులు నీటిలో మునిగేవరకూ కష్టపడి తోయాల్సివచ్చింది. నాకున్న వనరులను, జీవాలను పడవలో ప్రవేశపెట్టాను. నా కుటుంబం, నా బంధుమిత్రులు, అడవి జంతువులు, పెంపుడు జంతువులు, నేర్పరులైన శ్రామికులు అందరూ పడవలోకి చేరుకున్నారు. షామాష్ నాకు వార్తనందించినాడు– ‘సాయంకాలం తుఫానుపై స్వారీచేస్తూ పెనువర్షం రానున్నది. పడవ ఎక్కి ముందుకు పోవడానికి సిద్ధంగా ఉండండి!’

ఆ సమయానికల్లా ఈదురు గాలులతో కూడిన వర్షం మొదలైంది. నేను పడవలోకి వచ్చాను. పడవ నడిపే సరంగు పుజుర్–అముర్రి (Puzur-Amurri) కి నావ బాధ్యతలనప్పగించాను.

సాయంకాలానికల్లా నల్లటి మేఘం ప్రత్యక్షమైనది. అదాద్ (Adad) తుఫాను దేవుడు ఉరిమినాడు. షుల్లాత్–హనిష్ (Shullat-Hanish) మైదానాలపై, కొండలపై గుట్టలపై తుఫాను కదిలింది ఝంఝూమారుతమై. అగాధపు దేవతలు పైకెగిసినారు. ‘నెర్గాల్’ పాతాళదేవుడు కాలువలను తెరచినాడు. పాతాళ లోకపు ఏడుగురు న్యాయమూర్తులు, అన్నునాకి వారి కాగడాలను వెలిగించి నేలను

అగ్ని జ్వాలల్తో ముంచెత్తినారు. నిరాశ తుంపర నింగికెగిసింది ఎప్పుడైతే తుఫాను దేవుడు పట్టపగలును చీకటితో నింపినాడో అప్పుడు; అతడు భూమిని ఓ మట్టికుండను పగులగొట్టినట్లు పగలగొట్టినాడు. ఒకరోజల్లా తుఫాను ఉధృతమైనది, యుద్ధరంగాన్ని తలపిస్తూ; పక్కనే ఉన్న మనిషి కూడా కనిపించనంత దట్టంగా కురుస్తున్నది వర్షం. ఆ కుండపోతను చూసి దేవతలే భయభ్రాంతు లైనారు. వాళ్లు వేగంగా అన్నింటికన్న ఎత్తైన స్వర్గం– 'అను' అంతరిక్షానికి చేరుకుని, గోడలకు ఆనుకుని ముడుచుకుని కూర్చున్నారు. స్వర్గలోకపు రాణి ఇస్తార్ కేకపెట్టింది. కష్టాలో ఉన్న మానవస్త్రీలా! "ఏమిటీ విపరీతం! పాత రోజులన్నీ ధూళిలో కలిసిపోతున్నాయా నేను దుష్టశక్తుల్ని ఆజ్ఞాపించినందుకు? ఎందుకు నేను దేవతల సమావేశంలో కోరుకున్నాను ఈ ప్రళయాన్ని? నేను యుద్ధాలను సృష్టించాను ప్రజల్ని నాశనం చేయడానికి, కాని నా ప్రజలను కాదుకదా! ఇప్పుడు నా ప్రజలు సముద్రంలో చేపగుడ్లు తేలినట్లు ఈ వరదనీళ్లలో తేలుతున్నారు కదా!". స్వర్గ నరకాల దేవతలు కూడా విలపించారు ఆ వరద ఉధృతిని, విధ్వంసాన్ని చూసి, వాళ్ల నోళ్లను కప్పుకుంటూ, రోదన బయటకు రాకుండా!

ఆరురోజులు, ఆరు రాత్రుళ్లు మహోగ్రంగా గాలులు వీచినాయి. పెను తుఫాను అలలు, వరదలు ముంచెత్తినాయి ప్రపంచాన్ని. ఏడవరోజుకల్లా దక్షిణ దిక్కు తుఫాను నెమ్మదించింది. సముద్రం ప్రశాంతమయ్యింది. వరద తగ్గింది. నేను చూసాను మానవజాతి అంతా మట్టితో కప్పబడి మాయమయ్యింది. ఎక్కడ చూసినా నీరే! సముద్రం విస్తారంగా వ్యాపించి పైకప్పులా మారింది. నేను పడవ పైకప్పు కిటికీ తెరిచాను. వెలుగు లోనికి వచ్చింది. మోకాళ్లపై కూర్చుని ప్రార్థించాను. దుఃఖంతో కన్నీళ్లు కాలువలై పారినాయి. ఎక్కడ చూసినా ఉధృత జలమే! నేల కొద్దిగా కూడా కానరాలేదు. పధ్నాలుగు లీగుల దూరాన ఓ పర్వత శిఖరం వద్ద పడవ ఆగింది. అది 'నిసిర్' పర్వత శిఖరం. అక్కడ నుంచి నౌక ముందుకు కదల్లేదు. ఆరురోజులపాటు నౌక అక్కడ అలాగే ఉండిపోయింది. ఏడవరోజు ఉదయాన నేను ఒక పావురాన్ని వదిలాను. అది వెనక్కి తిరిగి వచ్చింది. స్వాలో పక్షికూడా వెళ్లి మరలివచ్చింది. ఈసారి కాకిని పంపాను. అది కాకా అని అరుస్తూ అంతా కలయదిరిగింది. కాని వెనక్కి రాలేదు. నౌక

అన్ని తలుపులు తెరిచాను నాలుగు గాలులూ ప్రవేశించేలా. దేవతలకు బలులనిచ్చి, అర్పణలు చేసాను శిఖరాగ్రంపైన. ఏడు, ఏడు పధ్నాలుగు గంగాళాలను నేలపైన బల్లలకు అమర్చాను. చెక్కలను, గడ్డిని, వెదురు చువ్వలను వేసి, దేవదారు మిర్టిల్ పొగలతో ధూపదీప నైవేద్యాలు అర్పించాను. దేవతలు ఆ తియ్యని పరిమళాలను ఆస్వాదించినారు. అక్కడకు వచ్చి ఈగల్లా మూగినారు. ఆఖరున వచ్చింది ఇస్తార్ దేవత. తన మెడలోని స్వర్గలోకపు మణిహారాన్ని, 'అను' దేవుడు ఇచ్చినదానిని చేతిలోకి తీసుకుని పైకెత్తినది. –"ఓ సమస్త దేవుళ్లారా! నా కంఠాన ఉన్న వైడూర్యపు హారం సాక్షిగా, నా గొంతు దగ్గర ఉన్న మణుల సాక్షిగా నేను చెబుతున్నాను, ఈ ఆఖరి రోజులను నేను మరచిపోలేను. దేవుళ్లందరూ ఈ బలుల చుట్టూరా పోగవ్వండి. ఒక 'ఎన్‌లిల్' మినహా! అతడు రావద్దు. ఆలోచనలేకుండా అతడు ఈ జలప్రళయాన్ని, వరదను సృష్టించాడు. నా ప్రజలను మట్టిలో కలిపినాడు"

ఎన్‌లిల్ రానేవచ్చాడు. నౌకను చూడగానే అతడి కోపం రెట్టింపయ్యింది. దేవతలతో అన్నాడు– "ఎవడైనా మర్త్యుడు తప్పించుకున్నాడా? ఎవడూ బతకడానికి వీలులేదు" అన్నాడు ఆగ్రహంగా. బావులు, కాలువల దేవుడు 'నినుర్తా' నెమ్మదిగా అన్నాడు 'ఎన్‌లిల్'తో– "ఈఆ'కు తెలియని విషయమే లేదు. అతడే చెప్పగలడు"–

'ఈఆ' దేవుడన్నాడు 'ఎన్‌లిల్'తో– "దేవతలలోకల్లా తెలివైనవాడా, యోధుడా, ఎన్‌లిల్! ఎందుకు నీవు అనాలోచితంగా ఈ జలప్రళయాన్ని సృష్టించావు?

–పాపిని పాపాలు చేయనీకుండా ఆపు,
దారి తప్పేవాడిని దారి తప్పనీకుండా ఆపు,
వాళ్లు తప్పుచేస్తే శిక్షించు.
తీవ్రంగా శిక్షిస్తే నాశనమవుతారు కదా!
సింహాలు మానవజాతిని నాశనం చేసినా
ఈ జలప్రళయం కన్నా,

తోడేళ్లు మానవజాతిపై విరుచుకుపడినా
ఈ వరదకన్నా,
కరువు కాటకాలు మానవజాతిని నాశనం చేసినా
ఈ మహోగ్రమైన జలభీభత్సంకన్నా,
చీడపీడలు మానవజాతిని బలహీనపరచినా
ఈ విధ్వంసకరమైన వరదకన్నా

బాగుండేది కదా! నేను కాదు మానవుడికి దేవరహస్యం తెలియబరచింది. జ్ఞానియైన మానవుడు స్వప్నంలో తెలుసుకున్నాడు ఈ విషయాన్ని. అతడినేం చేయాలో మన సమావేశం, సభ నిర్ణయించునుగాక!"–

ఎన్‌లిల్ నౌకలోకి ప్రవేశించినాడు. నన్ను నా భార్యను ఆశీర్వదించినాడు. అతడు మధ్యన నిలబడగా మేమిద్దరం మోకాళ్లపై కూర్చుని ప్రార్థించినాము– "ఇంతవరకు ఉత్నాపిష్టిమ్ మర్త్యుడు. ఇకనుంచి ఈ దంపతులిరువురు సుదూరంగా నదీ ముఖద్వారం వద్ద శాశ్వతంగా జీవింతురు గాక!

ఆ విధంగా దేవతలు నన్ను సుదూరంగా ఉన్న ఈ నదీ ముఖ ద్వారానికి చేర్చినారు"–

# 8. తిరుగు ప్రయాణం

ఉత్నాపిష్టిమ్ అన్నాడు– “గిల్గామేష్! ఎవరు నీకొరకు దేవతలను సమావేశ పరుస్తారు, నీవు వెదుకుతున్న శాశ్వత జీవన రహస్యం తెలపడానికి? నీకు నిజంగా తెలుసుకోవాలని ఉంటే నీకొక పరీక్ష పెడతాను. ఆరు పగళ్లు ఏడు రాత్రులు నిద్రపోకుండా నిన్ను నీవు నిలువరించుకో”.

అప్పటికే అలసిపోయి ఉన్న గిల్గామేష్‌కు ఆ చక్కటి వాతావరణంలో, చిరుగాలి వీస్తుండగా ఎంత ప్రయత్నించినా ఆపుకోలేని నిద్ర ముంచుకు వచ్చింది. ముందు కునికిపాట్లుగా మొదలై గాఢనిద్రలోకి జారుకున్నాడు గిల్గామేష్.

ఉత్నాపిష్టిమ్ తన భార్యతో అన్నాడు– “శాశ్వత జీవనం కావాలనుకున్న వీరుడు కాసింత చల్లగాలి తగలగానే నిద్రలోకి జారుకున్నాడు”.

ఉత్నాపిష్టిమ్‌కు భార్య సమాధానమిచ్చింది– “అతడిని నిద్రలేపు. ప్రశాంతంగా అతడిని తన దేశానికి వెళ్లమను. తాను వచ్చిన ద్వారం గుండానే మరల తనలోకంలోకి”.

ఉత్నాపిష్టిమ్ అన్నాడు– “మానవులందరూ మోసగాళ్లు. ఇంత చెప్పినా అతడు వంచన చేయడానికి ప్రయత్నిస్తాడు. వెళ్లి కొన్ని రొట్టెలు తయారుచేయి. రోజుకో రొట్టె అతని తలవద్ద ఉంచు. గోడమీద గుర్తుపెట్టు ప్రతిరోజూ మెలకువ వచ్చినాక అతడికి అర్థమవుతుంది ఎన్ని రోజులు నిద్రపోయాడో!”

ఆ విధంగానే చేసిందామె. మొదటి రొట్టె గట్టిపడింది. రెండవరొట్టె తోలుముక్కలా ఉన్నది. మూడోది సాగింది. నాలుగవది బూజుపట్టింది. అయిదోది చెమ్మగిల్లింది. ఆరవది తాజాగానే ఉన్నది. ఏడవది ఇంకా నిప్పులపైన ఉన్నది. ఉత్నాపిష్టిమ్ తట్టగానే గిల్గామేష్ నిద్రలేచాడు. కళ్లు నులుముకుంటూ అన్నాడు– “నీవు నన్నట్లా ముట్టుకున్నావు నేను క్షణంలో నిద్రలేచాను”.

ఉత్నాపిష్టిమ్ అన్నాడు– “ఈ రొట్టెలను లెక్కబెట్టు. ఎన్నిరోజులు నిద్ర పోయావో నీకర్థమవుతుంది. మొదటి రొట్టె గట్టిపడింది. రెండో రొట్టె తోలు

ముక్కలా ఉన్నది. మూడోది సాగింది. నాలుగవది బూజుపట్టింది. అయిదోది చెమ్మగిల్లింది. ఆరవది తాజాగానే ఉన్నది. ఏడవది ఇంకా నిప్పులపై కాలుతున్నది. నేను ముట్టుకున్నాక ఇప్పుడు లేచావు"–

గిల్గామేష్ అన్నాడు– "ఇప్పుడు నేనేం చేయాలి! ఓ ఉత్నాపిష్టిమ్, ఎక్కడికని వెళ్లను? రాత్రిదొంగ నన్నిప్పటికే బంధించినాడు. నా గదిలో మృత్యువు నివసిస్తున్నది. నా కాలుమోపిన చోటల్లా నాకు కనిపిస్తున్నది మృత్యువు".

అప్పుడు ఉత్నాపిష్టిమ్ తన పడవవాడైన ఊర్షనాబితో మాట్లాడినాడు– "ఊర్షనాబీ! నీవు తప్పు చేసినావు. నీవిక్కడ ఉండనవసరం లేదు. నీవు ఈ జలాల్ని సముద్రాన్ని ఇంకా దాటరాదు. నిన్ను ఇక్కడినుండి బహిష్కరిస్తున్నాను. నీవు ముందు నిలబడి తీసుకువచ్చిన ఈ మనిషి జంతుచర్మాల వాసనవల్ల మకిలిపట్టి ఉన్నాడు. ఇతడిని శుభ్రంగా స్నానం చేయించి ఆ దుస్తులను సముద్రంలోకి పారవేయి. అతడి పొడుగాటి శిరోజాలను నీళ్లలో చక్కగా కడుగు. అతడికి ఎన్నటికీ మాసిపోక కొత్తగా కనిపించే దివ్యవస్త్రాలను కట్టబెట్టు. అతడు తన నగరానికి చేరేవరకు ఇవి మాసిపోవు".

ఊర్షనాబి అతడిని స్నానఘట్టానికి తీసుకువెళ్లి శిరోజాలను శుభ్రంగా కడిగినాడు. జంతుచర్మపు దుస్తులను సముద్రంలో పారవేయగా అవి కొట్టుకుని పోయినవి. పులుకడిగిన ముత్యంలా మెరుస్తున్న గిల్గామేష్ నగ్నదేహాన్ని కప్పేందుకు దివ్యవస్త్రాలను ఇచ్చినాడు ఊర్షనాబి. అవి గిల్గామేష్ తన నగరం చేరేంతవరకు కొత్త దుస్తుల్లా శోభిల్లగలవు.

గిల్గామేష్, ఊర్షనాబి పడవనెక్కి బయల్దేరారు తిరుగు ప్రయాణానికి. వారిని చూసి ఉత్నాపిష్టిమ్ భార్య అన్నది తన భర్తతో– "ఎంతో దూరప్రయాణం చేసి అలసిసొలసి గిల్గామేష్ ఇక్కడకు వచ్చినాడు. అతడు తన దేశానికి తీసుకు వెళ్లేందుకు ఏమిస్తున్నావు?"

ఉత్నాపిష్టిమ్ వాళ్లను వెనక్కి పిలిచి అన్నాడు– "గిల్గామేష్! సుదూర ప్రయాణం చేసి అలసిపోయినావు. నీ ఇంటికి తీసుకుపోయేందుకు నీకేదైనా ఇస్తాను. నీకొక దేవరహస్యం చెబుతాను. ఈ నీటి అడుగున ఒక దివ్యమైన లత ఉన్నది. దానికి ముల్లుతో కూడిన పూవు గులాబి లాంటిది పూస్తుంది. అది

నీకు గాయం చేస్తుంది. కాని దానిని భరించి పట్టుకోగలిగితే అది ఒక అద్భుత మూలికగా కోల్పోయిన యవ్వనాన్ని తిరిగి ఇస్తుంది".

గిల్గామేష్ ఈ మాటలు విన్నాడు. ఆ దంపతుల వద్ద సెలవు తీసుకుని తిరుగు ప్రయాణం ప్రారంభించారు. కొద్ది దూరం పోయినాక లోతైన ప్రాంతం రాగానే, గిల్గామేష్ తన పాదాలకు బరువైన రాళ్లు కట్టుకుని నీటిలో మునిగి అడుగునకు చేరుకున్నాడు. అక్కడ ఉన్న 'యవ్వనలత'ను పట్టుకోబోయినపుడు గాయం చేసింది. అయినా భరించి అతడు పూలతో సహా తీగను పెల్లగించి తన కాళ్లకు ఉన్న రాళ్లను కోసివేయగానే నీళ్లలో తేలి పైకివచ్చినాడు. యవ్వనలతను ఊర్షనాబికి చూపించి అన్నాడు గిల్గామేష్– "చూడు, ఈ అద్భుతమైన దివ్యలతను, గులాబి లాంటి పుష్పాలను. ఈ యవ్వన మూలిక కోల్పోయిన యవ్వనాన్ని, బలాన్ని, తేజస్సును తిరిగి తెస్తుంది. నేను దీనిని దుర్భేధ్యమైన కోటగోడలతో అలరారే ఉరుక్ నగరానికి తీసుకువెళ్తాను. వృద్ధులకిచ్చి వారిని యవ్వనవంతుల్ని చేస్తాను. 'వృద్ధులను యువకులను చేసే యవ్వనమూలిక' ఇది"–

ఆ తరువాత ఇద్దరూ వెళ్లిన ద్వారం ద్వారానే మరల వచ్చినారు. కాస్త ఆహారం తీసుకుని ముప్పై లీగులు ప్రయాణం చేసి రాత్రి పడగానే విశ్రాంతి తీసుకున్నారు.

గిల్గామేష్‌కు అక్కడ చల్లటి నీళ్లున్న బావి కనిపించింది. వెళ్లి స్నానం చేయబోయినాడు. ఆ బావిలో ఓ మహాసర్పం నివాసముంటున్నది. యవ్వనలత కున్న పూల సుగంధం పాము పసిగట్టింది. నీటిలోంచి వేగంగా వచ్చింది యవ్వన లతను ఎత్తుకుపోయి మింగివేసింది. వెనువెంటనే దాని పాతచర్మం (కుబుసం) పోయి కొత్తచర్మంతో అది కళకళలాడింది. దాన్ని చూసి గిల్గామేష్ దుఃఖ భరితుడైనాడు. మృత్యురహస్యం దొరకలేదు. దొరికిన యవ్వనలత సర్పం పాలైనది. అతడన్నాడు ఊర్షనాబితో– "మిత్రమా! దీనికోసమా నేనింత శ్రమపడింది. దీనికోసమా నేను నా హృదయపు రక్తం గడ్డకట్టేలా శ్రమించినది? నా స్వంతానికి నేనేమీ సంపాదించుకోలేకపోయినాను. నేను తెచ్చుకున్న యవ్వనలత సర్పజాతి పాలైనది. ఆ పాము ప్రవాహంలో వేగంగా ఇరవై లీగుల దూరం పోయుంటుంది. వెనక్కి వెళ్లి మనం మరల యవ్వనలతను తెచ్చుకోలేము. ఆ ప్రదేశాన్నిప్పుడు

గుర్తించలేము. ఇంతే మనకు ప్రాప్తం అనుకుని మనం పడవ ప్రయాణం ముగించి నది ఒడ్డున నడుచుకుంటూ ఉరుక్ నగరం చేరుకుందాం!"

మరో ఇరవై లీగుల దూరం నడిచి ఆహారం తీసుకున్నారు. మరో ముప్పై లీగుల దూరం నడిచాక రాత్రి కాగానే విశ్రాంతి తీసుకున్నారు. మామూలు వ్యక్తికి నలభై అయిదు రోజులు పట్టే ప్రయాణాన్ని మూడు రోజుల్లో ముగించినారు. ఉరుక్ నగరానికి చేరుకున్నాక గిల్గామేష్ అన్నాడు– "ఊర్షనాబీ! ఈ కోటగోడనెక్కు! చూడు దీని పటిష్ఠమైన పునాదులను, చూడు ఆ అద్భుత నిర్మాణాన్ని, ఇటుకలు అమర్చిన పద్ధతిని; కాల్చిన ఇటుకలతో సప్తజ్ఞానులు దీనికి పునాది రాళ్లు వేసినారు. నమ్మగలవా? మూడవవంతు నగరం, మూడవ వంతు ఉద్యానవనాలు, మూడవ వంతు పొలాలు. అది ఇస్తార్ దేవత ఆలయం. ఇది ఉరుక్ నగర సౌందర్యం"

ప్రపంచంలోని అందరు ప్రభువులకు తెలిసిన ప్రభువు గిల్గామేష్ నిర్మించిన మహానగరం. అతడు తన అద్భుత సాహసయాత్రలతో, మార్మిక జ్ఞానంతో జ్ఞానిగా పేరుపొందినాడు. అతడు మనకు తీసుకువచ్చినాడు జలప్రళయానికి ముందు జరిగిన కథను. సుదూరం ప్రయాణించి అలిసిసొలిసి వచ్చిన అతడి అద్భుత ప్రయాణం శిలాఫలకాలపై చెక్కబడి శాశ్వతంగా చరిత్రలో నిలుస్తున్నది.

# 9. గిల్గామేష్ మరణం

దేవతల తండ్రి, పర్వతరాజు ఎన్‌లిల్ గిల్గామేష్ గురించి ఆజ్ఞ జారీ చేసినాడు– "కటిక చీకటిమయమైన అథోలోకంలో చీకటి కూడ ఇతడికి వెలుగునిచ్చును గాక! మానవజాతిలో గిల్గామేష్ స్థానాన్ని మించినది మరొహటి లేకుండునుగాక! వీరులు, జ్ఞానులు, చంద్రుడిలా కృష్ణ శుక్ల పక్షాలను కలిగి ఉంటారు. నీడలతో ఉండే చీకటి మాసంలోనూ అతడు లేకుండా వెలుగు ఉండదు. ఓ గిల్గామేష్! ఇదీ నీ స్వప్నానికర్థం. నీవు రాజువైనావు. అది నీ గమ్యం; అయితే శాశ్వత జీవనం నీకివ్వబడలేదు. అందుకని దుఃఖించకు. విచారం వలదు. నీకు ఇవ్వబడిన అధికారంతో మనుషులను బంధించగలవు, విడుదల చేయగలవు. ప్రజలపై అత్యున్నతమైన అధికారం, యుద్ధాలలో విజయం, వెనుతిరగ వీలులేని పరిస్థితుల్లోనూ అపజయం లేని వరం నీకివ్వబడింది. నీ శక్తులను అధికారాన్ని దుర్వినియోగపరచకు. న్యాయంగా వర్తించు. నీ సేవకులపై దయచూపు. సూర్యుడి వదనం ముందు న్యాయమూర్తిగా వర్ధిల్లు"

ప్రభువు పరుండినాడు మరల లేవబోడు
కుల్లబ్‌రాజు మరిక లేవబోడు
చెడునణచిన వీరుడు లేవబోడు
భుజబల సంపన్నుడు తానికలేవబోడు
జ్ఞాని, సుందరవదనుడు మరికరాలేడు
పర్వతాలు దాటిన వీరుడు ఇక రాలేడు
విధి శయ్యపై విశ్రమించినాడు ఇక రాలేడు
వివిధ రంగుల ఆసనం వద్దకు ఇక రాలేడు.

నగర ప్రజలు చిన్నా, పెద్దా మౌనంగా లేరు. శోకగీతాలు మిన్నంటినవి. విధి పలికింది. గాలానికి అందిన చేపలా అతడు శయ్యపై పడి ఉన్నాడు. ఉచ్చుకు చిక్కిన జింకపిల్లలా అతడు జాలిలేని 'నమ్‌తార్' కింద అణిగి ఉన్నాడు. 'నమ్‌తార్'కు కాళ్లు చేతులుండవు. నీళ్లు తాగదు, మాంసం తినదు.

నిన్‌సున్ కుమారుడు గిల్గామేష్‌కు; అతడి భార్య, కుమారుడు, ఉంపుడుగత్తె, సేవకులు, విధేయులు, అందరూ తమతమ కానుకలను అర్పించినారు. వాళ్లు తమతమ కానుకలను పాతాళలోకపు రాణి 'ఎరెష్కిగల్'కు మృతులలోకపు దేవతలకు అర్పించినారు. విధిదేవత 'నమ్‌తార్'కు అర్పణలు చేసినారు. ద్వారపాలకుడు 'నేతి' (Neti) కొరకు రొట్టెను, సర్పదేవత నింగిజ్జిదా Ningizzida) కు రొట్టెను, జీవవృక్షపు ప్రభువుకు రొట్టెను, ఎందుకుగ్గా–నిందుకుగ్గా (Endukugga-Nindukugga), ఎన్‌ముల్–నిన్‌ముల్ (Enmul-Ninmul)లకు, ఎన్‌లిల్ పూర్వీకులకు, ప్రాచీనాత్మలకు అర్పణలు చేసినారు. విందుల దేవత 'షుల్పె' (Shulpae)కు విందునిచ్చినారు. పశుపతి సముకాన్ (Samuqan), తల్లి నిన్‌హుర్‌సాగ్ (Ninhursag) కు, సృష్టికర్తలైన దేవతలకు సృష్టికి అర్పణలు చేసినారు. స్వర్గాధిపతికి అనేక పూజలు, కానుకలు సమర్పించినారు.

నిన్‌సున్ కుమారుడు గిల్గామేష్ శవపేటికలో పరున్నాడు. ఆహార పదార్థాలు, ద్రాక్షసారాయి దేవతలకు అర్పించబడినవి. ప్రభువు, సాటిలేని వ్యక్తి, ఎన్‌లిల్‌కు విధేయుడు, నిన్‌సున్ కుమారుడు, కుల్లబ్ దేశపురాజు గిల్గామేష్ నీ కీర్తి చిరస్థాయిగా నిలుచునుగాక!

# 10. చరిత్రలో గిల్గామేష్

1. ప్రాచీన మెసపొటామియన్ ప్రాక్కథలలో అత్యంత ప్రసిద్ధికెక్కినవాడు సుమేరియా ప్రాంతంలోని ఉరుక్‌ను పాలించిన గిల్గామేష్ (Gilgamesh).

2. గిల్గామేష్ ఇతిహాసం (Epic of Gilgamesh) మొదట అక్కడియన్ (Akkadian) భాషలో వ్రాయబడింది.

3. క్రీస్తుపూర్వం బహుశా 2800–2500 ప్రాంతంలో ఉరుక్‌ను పాలించిన గిల్గామేష్ ఉర్ మూడవతరం (2112–2004 BC)లో ప్రసిద్ధికెక్కినాడు.

4. సుమేరియన్ భాషలో క్యూనిఫారం లిపిలో ఈ గాథలు మట్టిబిళ్లలపై (Clay Tablets) వ్రాయబడినవి. తవ్వకాలలో లభ్యమయినాయి.

5. ఇనాన్నా (ఇస్తార్) చరిత్రలో గిల్గామేష్ ఆమెకు హులుప్పు (Huluppu) చెట్టును ఆక్రమించుకున్న వాటిని తరిమి సాయం చేసిన విషయం, కృతజ్ఞతతో ఇనాన్నా దేవత అతడికి మిక్కు, పిక్కు అనే ఢక్కలను ఇచ్చినట్లు తెలుస్తుంది.

6. సిన్–లెఖీ–ఉన్నిన్ని (Sin-Leqi-Unninni) మధ్య బాబిలోనియన్ యుగం (1600-1155 BC) లో వీటిని వ్రాసి ఉండవచ్చునని పరిశోధకు లంటున్నారు.

7. హుంబాబా సెమిటిక్ పేరు హువావా (Huwawa), ఇస్తార్ (Ishtar) పేరు ఇనాన్నా (Inanna).

8. గ్రీకు రచయిత Aelian-ఎలియన్ తన పుస్తకం On the nature of animals లో గిల్గామేష్ జననాన్ని వర్ణించినాడు. గిల్గామేష్ తాతగారైన ఉరుకు ప్రభువుకు జోస్యం చెప్పబడింది. అతడి మనవడు అతడిని పదవీ భ్రష్టుడిని చేస్తాడని. అందుకని ఆరాజు తన కుమార్తె ప్రసవించగానే శిశువును ఎత్తైన కొండ శిఖరం మీద నుంచి క్రిందకు విసిరివేస్తారు. ఓ గరుడపక్షి ఆ శిశువును కాపాడి ఒక తోటలో వదిలిపెడ్తుంది. తోటమాలి అతడిని పెంచి పెద్దచేస్తాడు.

9. 1849లో Epic of Gilgamesh, Library of Ashurbanipal లో కనుగొనబడింది. Hebrew Bible లోని కొన్ని ఘట్టాలకు ఉన్న సారూప్యత అప్పుడు ఎంతో సంచలనానికి దారితీసింది.

10. Tummal inscription లో ఇలా వ్రాసి ఉన్నది– రెండవసారి తుమ్మల్ నేలకూలింది గిల్గామేష్ కట్టించినాడు ఎన్‌లిల్ ఆలయాన్ని నుమున్‌బుర్రా (Numunburra)గా; అతడి కుమారుడు ఉర్‌లుగాల్ (Ur-lugal) తుమ్మల్‌కు నిన్‌లిల్‌ను తెచ్చినాడు. (Ishbi-Erra రాజు పాలనాకాలం 1953–1920 BC)

11. ఉరుక్ ప్రజలు తమ రాజైన గిల్గామేష్‌ను నది అడుగున ఖననం చేయడానికి యూఫ్రటిస్ నదిని దారిమళ్లించారని చెప్పబడింది.

12. క్రీస్తుపూర్వం 2100 నాటి ఉరుక్ ప్రభువు Utu-hengal గిల్గామేష్‌ను తనకు Patron-deity గా భావించినాడు. Third Dynasty of Ur రాజులు గిల్గామేష్‌ను దివ్యసోదరుడు (Divine Brother) గా పిలిచినారు. షుల్గి ప్రభువు (Shulgi 2029-1982) తనను గిల్గామేష్ సోదరుడిగా, నిన్‌సున్–లుగల్‌బందా సంతానంగా అభివర్ణించుకున్నాడు.

13. గిల్గామేష్‌ను కొందరు చరిత్రకారులు 'లగాష్' పరిపాలకుడైన Gudea (2144-2124 BC) తో పోల్చిచూసినారు. ఈ గుడియా మన పురాణాల్లోని గాధి కావచ్చునని కొందరి ఊహ (శతపథ బ్రాహ్మణం).

14. సుమేరియన్ కవిత– గిల్గామేష్–ఎంకిడు పాతాళలోకం – కథను – ఇనాన్నా గాథలో తెలుసుకుంటాం. యూఫ్రటిస్ నది ఒడ్డున ఒకచోట హులుప్పు చెట్టు ఉన్నది (Willow tree?). దానిని ఇనాన్నా దేవత ఉరుక్‌లోని తన తోటలోకి తెచ్చి పాతినది. పెరిగినాక దాని చెక్కనుంచి సింహాసనాన్ని, శయ్యను చేయించుకోవాలని ఆమె ఉద్దేశం. చెట్టు ఏపుగా పెరిగేసరికి దానిని ఓ సర్పం, అంజుపక్షి, లిలితు అనే దుష్టదేవత దానిని ఆక్రమించుకుని వీడడం లేదు. గిల్గామేష్ వచ్చి సర్పాన్ని చంపి పక్షిని, లిలిత్‌ను పారద్రోలగా

సంతోషించిన ఇనాన్నా అతడికి పిక్కు, మిక్కు అనే ఢక్క, కర్రలను ఇస్తుంది. వాటిని పోగొట్టుకున్న గిల్గామేష్, ఎంకిడును పంపుతాడు వెదకడానికి. పాతాళలోకంలో వాటిని కనుగొన్న ఎంకిడు అక్కడి న్యాయాన్ని అధిగ మించడంతో శాశ్వతంగా అక్కడే ఉండిపోవలసి వస్తుంది. ఎంకిడు ఆత్మతో మాట్లాడి గిల్గామేష్ పాతాళలోకం గురించిన విషయాలు తెలుసుకుంటాడు.

15. Gilgamesh-Agga - కిష్ ప్రభువైన అగ్గాపై తిరుగుబాటు చేసి గిల్గామేష్ సాధించిన విజయం గురించి ఇందులో వ్రాయబడింది.

16. గిల్గామేష్-హువావా (Gilgamesh-Huwawa) హుంబాబా (హువావా) దేవదారు అరణ్యాన్ని సంరక్షించే హువావా - డ్రాగన్ కోరలు, సింహపు ముఖం, తుఫాను గర్జన, అగ్నిజ్వాలలు కురిసే నోరు, మృత్యుశ్వాసతో భయంకరంగా ఉంటాడు. గిల్గామేష్, ఎంకిడు తమతోపాటు యాభైమంది యోధుల్ని తీసుకువెళ్తారు. ఏడు దేవదారు వృక్షాల్ని నరికి 'హువావా' ఉన్నచోటుకు వెళ్తారు. గిల్గామేష్ గొడ్డలి దెబ్బకు 'హువావా' కోరలు రాలి పడ్తాయి. దయచూపమని వేడుకున్నా వినకుండా గిల్గామేష్, ఎంకిడులు అతడి తలనరికి చంపివేస్తారు. శిక్షగా దేవతలు ఎంకిడు మరణించాల్సిందేనని తీర్మానిస్తారు.

17. గిల్గామేష్-స్వర్గ వృషభం-సుమేరియన్ ప్రతులకు అక్కడియన్ ప్రతికి వ్యత్యాసం కనిపిస్తుంది. సుమేరియన్ కథలో ఇనాన్నా తండ్రిని బతిమాలాడ్తుంది స్వర్గ వృషభం కోసం. అలాగే ఆమె గిల్గామేష్‌ను తన చెలికాడుగా ఉండమని కోరదు.

18. గిల్గామేష్ మరణం : ఇది వ్రాయబడిన మట్టిబిళ్ల శిథిలమైన స్థితిలో లభ్యమైనది.

19. Epic of Gilgamesh - సిన్-లెఖి-ఉన్నిన్ని (Sin-Leqi-Unninni) అక్కడియన్ భాషలో వ్రాసినాడు. కాలం 1600-1155 BC మధ్యకాలం కావచ్చు.

20. అషురబనిపాలుడి గ్రంథాలయంలో (నినెవె-Nineveh) దొరికిన పన్నెండు మృణ్మయ ఫలకాలలో గిల్గామేష్ ఇతిహాసం సవిస్తరంగా లిఖించబడి ఉన్నది. (కాలం క్రీస్తుపూర్వం ఏడవ శతాబ్దం కావచ్చును). తూర్పు దేశాలలో దొరికిన మట్టిబిళ్లలలో వ్రాయబడిన విషయాలతో చరిత్రకారులు లోపాల్ని సవరించ గలిగినారు.

21. Epic of Gilgamesh ప్రభావం తరువాత వచ్చిన గ్రీకు ఇతిహాసాలపై ఉన్నదని చరిత్రకారుల విశ్వాసం. (Barry-B. Powell), Walter, Burkert). ఒడిస్సీలోని చాలా సంఘటనలను ఇందుకు ఉదాహరణగా పోల్చిచూపుతారు.

22. Book of Giants (Qumran Scroll) 100 BC – గిల్గామేష్, హుంబాబా Antediluvian giants గా కానవస్తారు. ఈజిప్షియన్ రచయిత Al-Suyuti - ప్రకారం జిల్జామిష్–గిల్గామేష్ అనే పేరుతో ఓ పిశాచం–Demon ఉన్నది అరబిక్ కథలలో.

23. గిల్గామేష్ జన్మవృత్తాంతం – Sargon, Moses, Cyrus, మహాభారతంలో కర్ణుడి కథలను పోలి ఉండడం గమనార్హం.

24. Austen Henry Layard, Hormuzd Rassam, George Smith, Friedrich Delitzsch, Henry Rowlinson, W.K. Loftus, John Punnet Peters, Dr. Oliver Gurney, Sir Leonard Woolley, Prof. G.S. Kirk లాంటి మహామహులెందరో ఈ అద్భుతమైన ఇతిహాసం వెలుగుచూడడానికి, చరిత్రను మలుపు తిప్పిన సంఘటనలను పొందుపరచి సత్యాన్వేషణలో చరిత్రలోని ఖాళీలను పూరించేందుకు సాయపడినారు.

25. గిల్గామేష్ కావ్యాన్ని అనుసరించిన గ్రంథాలు.

Ishtar & Izdubar (1884) - Hamilton
Das Alte Testament (1904) - Alfred Jeremias
Das Alte Testament (1906) - Peter Jeusen
Symbole der wondelung (1912) - Carl Jung
Die Stadt Hinterr demstorm (1947) - Hermann Kesack
River without shores (1950) - Hans Henny Jahnn)

The Quest of Gilgamesh - Radioplay (1953) - Bridson
The Columbia Anthology of Gay Literature (1998)
Gilgamesh (2001) - Joan London

26. మాజీ ఇరాన్ అధ్యక్షుడు 'సద్దాం హుస్సేన్'కు అత్యంత ఇష్టమైన హీరో– గిల్గామేష్. తాను వ్రాసిన జబీబా–రాజు Zabibah and the King (2000) కథలో గల్ఫ్‌యుద్ధాన్ని, అరేబియన్ నైట్స్ కథల్ని మేళవించినాడు. ఫిబ్రవరి 2003లో తన జనరల్స్‌తో మాట్లాడుతూ తనను తాను గిల్గామేష్‌తో పోల్చుకున్నాడు.

27. జలప్రళయం (Flood myth, Deluge myth) దేవతలు ఆగ్రహంతో మానవ జాతిని సర్వనాశనం చేయ సంకల్పించడం, ఎవరో ఒక దేవుడు మానవుల మీద దయతో తన భక్తుడైన మానవుడికి సాయం చేయడం ద్వారా మానవులు మరల వృద్ధినొందడం ఈ కథల్లో సారాంశం.

    అక్కడియన్–సుమేరియన్ కథలోని ఉత్నాపిష్టిమ్; సుమేరియన్–జియుసుద్రుడు, బాబిలోనియన్–అత్రహాసిస్; గ్రీకు జలప్రళయంలోని డ్యుకాలియన్; జెనెసిస్‌లో నోవా; భాగవతంలో సత్యవ్రతుడనే మనువు, చైనీస్ ఇతిహాసాలలో గన్–యు (Gun-Yu), బెర్జిల్‌మిర్ (Bergelmir) – నార్స్ మైథాలజి, కిచె (Kiche) - మాయన్ వీళ్లు జలప్రళయంలో బతికి బయటపడినవారు; వీరుకాక ఒజిబ్వా, మునాస్కా, కనారి తెగలు (ఉత్తర దక్షిణ అమెరికా ప్రజలు) దక్షిణ ఆస్ట్రేలియాలోని ఆదిమ ప్రజలు జలప్రళయాన్ని విశ్వసిస్తారు.

    సత్యవంతుడి కథను మనం పురాణాల మత్స్యావతార గాథలో శ్రాద్ధదేవుడిగా చూడవచ్చు. శతపథ బ్రాహ్మణంలోనూ ఈ వివరణ కానవస్తుంది.

28. గుడియా–గిల్గామేష్ : మూడవ సహస్రాబ్ది క్రీస్తుపూర్వం వర్తక వ్యాపారాలు వృద్ధిచెందడంతోపాటు నగరాల ప్రాముఖ్యత హెచ్చింది. ప్రతి నగరానికి ఓ రక్షకదేవుడు లేక దేవత, వారి ప్రీత్యర్థం మహా దేవాలయాల నిర్మాణం, దానికి కావల్సిన చెక్కకోసం లోహాలు, తారు వంటి ఉపయుక్తమైన

విషయాల కోసం ఎంతో శ్రమ, ధనం వెచ్చింపబడుతుండేవి. దేవదారు, పైన్, విల్లో చెట్లను నరికి దుంగలను; గనులను తవ్వి ముడిలోహాలను తెచ్చేందుకు పెద్ద రవాణా వ్యవస్థ, దానిని కాపాడడానికి రక్షణా సిబ్బంది, ఆ బిడారు వచ్చే దారిలో ఉన్న రాజ్యాల పాలకులకు ఇవ్వవలసిన రుసుము, దారిలో దోపిడీ దొంగల హడావుడి, బలపడిన రాజులు ప్రక్కన ఉన్న రాజ్యాల నాక్రమించుకోవడం సర్వసాధారణంగా ఉండేది. గెలిచిన రాజు ఓడిన రాజు నగరాన్ని, రక్షక దేవత ఆలయాన్ని ధ్వంసం చేసి తన దేవుడినో, దేవతనో ప్రతిష్ఠించేవాడు.

లగాష్ రాజైన గుడియా తన రక్షక దేవుడైన 'నిన్‌గిర్సు' (Ningirsu) ఆలయం కోసం Susa, Elam, పశ్చిమ దేశాల నుంచి రాగి, విల్లో, నల్లమద్ది, దేవదారు దుంగలు, బిటుమిన్‌ను బక్కెట్లనిండా, మగ్గా పర్వతాల నుంచి జిప్సమ్‌ను పడవలలో అసంఖ్యాకంగా తెప్పించాడు.

అగాడే (Agade) రాజు సర్గాన్ (Sargan) తన Dagon దేవుడి గుడి కొరకు దేవదారు, పైన్ దుంగల్ని తెప్పించినాడు.

29. సుమేరియన్ సాహిత్యంలో లభించిన జలప్రళయ వృత్తాంతం గిల్గామేష్ చరిత్రలో భాగంగా కాకుండా స్వతంత్రంగా ఉన్నది. ఈ వరద విధ్వంసం నుంచి బయటపడిన మానవుడి పేరు జియుసుద్ర (Ziusudra); బాబిలోనియన్ సాహిత్యంలోని అనేక ఉత్పాతాలలో జలప్రళయం ఒకటి. ఆ వరదలో బయటపడినవాడు అత్రాహసిస్ (Atrahasis).

30. గిల్గామేష్ రెండువంతులు దేవుడు ఒకవంతు మానవుడు. అందుచేత అతడు ఉరుక్‌ను 126 సంవత్సరాలు పాలించినాడు. అతడి కుమారుడు కేవలం 30 సంవత్సరాలు పాలించి సాధారణ మానవుడిలానే జీవించినాడు. అమరత్వం కోసం గిల్గామేష్ చేసిన సాహసయాత్ర మానవుడికి మరణం తప్పదన్న విషయం రూఢి కాగా ముగుస్తుంది.

31. **వివిధ దేవతలు -**

An (Anu) - సముద్రం నుంచి పుట్టిన దేవుడు-దేవతల తండ్రి.

Enlil - అను+భూమికి పుట్టిన వాయుదేవుడు

Nanna (Sin) – ఎన్‌లిల్‌కు పుట్టిన చంద్రుడు

Utu (Shamash) – చంద్రుడి కుమారుడు – సూర్యుడు.

Inanna (Ishtar) – చంద్రుడి కుమార్తె – ప్రేమదేవత.

Ea (Enki) – 'అను' కుమారుడు. జ్ఞానదేవుడు (God of Wisdom)

Ereshkigal - పాతాళలోకపు రాణి.

32. Cuneiform Writing - కోణాకృతి లిపి. మట్టిపలకలపై చిత్రలిపిలా వ్రాయబడిన సుమేరియన్-అక్కడియన్ లిపి.

33. స్వప్నాల ప్రాముఖ్యత – గిల్గామేష్ కావ్యంలో స్వప్నాలకు ప్రాముఖ్యత బాగా కనిపిస్తుంది. ఏ పని చేయాలన్నా అప్పటివారు కొండలమీదనో దేవాలయం దగ్గరో నిద్రపోయేవారు. వచ్చిన స్వప్నాన్ని విశ్లేషించుకుని నడుచుకునేవారు. ఆనాటి ప్రజలకు 'స్వప్నాలు-దేవతలు పంపిన సందేశాలు'. ఈ గిల్గామేష్ కథనిండా స్వప్నాలే! వీటిని 'Incubated dreams' గా భావించవచ్చును. భవిష్యత్తును తెలిపే స్వప్నాలుగా, మానవుని మనోభావనలను ప్రతిబింబించడమే గాక, అంతరాత్మ పడే వేదనని, దానివలన మానసికంగా పడే బాధని ఈ కలలు వ్యక్తపరుస్తాయి.

34. గిల్గామేష్-ఎంకిడు – వీరిద్దరి మధ్య ఉన్న బంధాన్ని కొందరు స్నేహంగా, కొందరు స్వలింగ సంపర్కంగా భావించి వ్రాసినారు. భార్య, ఏడుగురు పిల్లలున్న ఎంకిడుని, వేశ్యద్వారా నగర జీవనానికి ఆహ్వానించి, అనేక సాహసకార్యాలలో తనతోపాటు పాల్గొనేట్లు చేసిన గిల్గామేష్, అతడికి ఎంకిడుకు ఉన్న సంబంధం అనేక రకాల వ్యాఖ్యానాలకు నోచుకున్నది.

35. గిల్గామేష్-ఇస్తార్: కొందరు రచయితలు చరిత్రకారులు గిల్గామేష్-ఇస్తార్‌ల మధ్య ప్రణయబంధాన్ని ఊహించినారు. ఇనాన్నా-తమ్ముజ్‌ల ప్రేమకలాప ధోరణిలో ఈ వృత్తాంతం కల్పించినారు. ప్రేమకు యుద్ధానికి రాణి ఇస్తార్‌కు అన్నీ సాధ్యమేనని వారి ఊహ కావచ్చును.

36. **Twelve Tablets** (Summary of the Standard Akkadian version - Based on Andrew George's English Translation)

1) రెండు వంతులు దేవుడు ఒక వంతు మానవుడైన గిల్గామేష్– ఉరుక్ పట్టణ ప్రభువు తన పట్టణ ప్రజలను క్రూరంగా ఇబ్బందులకు గురిచేస్తుంటాడు. ప్రభువు హక్కు– Lord's right - droit du seigneur గా పిలవబడే వివాహపు తొలిరాత్రి హక్కుతో కన్యలను, రకరకాల ఆటలతో మల్లయుద్ధం, కత్తిసాము వంటి వాటితో యువకులను ఇబ్బందిపెట్టడంతో వాళ్లు దేవుళ్లకు మొక్కు కున్నారు. గిల్గామేష్‌కు స్వప్నంలో తనకు సమ ఉజ్జీగా దేవుళ్లు సృష్టించిన మానవమాత్రుడు ఎంకిడు కనిపించినాడు. భార్య ఏడుగురు పిల్లలున్న ఎంకిడు అడవిలో జంతువులా చరిస్తూ ఉంటాడు.

తన వలల్ని ఉచ్చుల్ని ధ్వంసం చేస్తున్న ఎంకిడు గురించి ఉరుక్ నగరపు వేటగాడు ఫిర్యాదు చేయడంతో ముచ్చటపడిన గిల్గామేష్ ఆ అడవి మనిషిని మచ్చిక చేయడానికి 'షామ్‌హత్' (Shamhat) అనే దేవాలయపు వేశ్యను వేటగాడితో పాటు పంపుతాడు. ఆమె అతడిని ఆకర్షించి కాసింత నాగరికత నేర్పుతుంది. గిల్గామేష్ స్వప్నాన్ని అతడి తల్లి 'నిన్‌సున్' విశ్లేషిస్తుంది.

2) గొర్రెల కాపరుల విడిదిలో రాత్రి కాపలాదారుగా ఉంటూ నగర జీవనాన్ని తెలుసుకుంటున్న ఎంకిడుకు గిల్గామేష్ ప్రభువు హక్కుపేరిట చేస్తున్న అఘాయిత్యం నచ్చక అతడికి బుద్ధిచెప్పాలని ఉరుక్ వెళ్తాడు. అక్కడ ఓ వివాహ వేడుకలో తన ప్రభుహక్కును వినియోగించుకోవాలని వెళ్తున్న గిల్గామేష్‌కు అడ్డుతగుల్తాడు. ఇద్దరిమధ్య భయంకర యుద్ధం జరుగుతుంది. గిల్గామేష్ తనకంటె బలవంతుడని ఎంకిడు గ్రహిస్తాడు. ఎంకిడు బలాన్ని గిల్గామేష్ మెచ్చుకుంటాడు. అలా ఇద్దరూ మిత్రులౌతారు. తన పేరు చరిత్రలో చిరస్థాయిగా ఉండాలని తలపోసిన గిల్గామేష్ దేవదారు అరణ్యానికి వెళ్ళి భీకరుడైన 'హుంబాబా'ను ఓడించాలంటాడు. ఎంకిడు వారించినా, ఉరుక్ పెద్దలు వద్దన్నా గిల్గామేష్ తన పట్టుదల వీడడు.

3) ఉరుక్ పెద్దల సలహా, తన తల్లి నిన్సున్ (నిన్సన్-Ninsun) ఆశీస్సులతో, సూర్యదేవుడు షామాష్ (Shamash) రక్షణలో గిల్గామేష్ తన మిత్రుడు ఎంకిడుతో కలిసి దేవదారు అరణ్యానికి ప్రయాణిస్తాడు వివిధ రకాల ఆయుధాలు, పనిముట్లతో. (కొన్ని పుస్తకాలలో వీరికి సహాయకులుగా యాభై మంది వీరులు వెళ్లినట్లు వ్రాయబడింది).

4) ప్రయాణంలో చిన్నిచిన్ని మజిలీలు, స్వప్నాల విశ్లేషణలు; గిల్గామేష్‌కు వచ్చిన అయిదు కలల్లో పర్వతాలు, తుఫానులు, అడవి ఎద్దులు, అగ్నిపక్షి కానవస్తాయి. అవి దాదాపు 'హుంబాబా) వర్ణనలా ఉన్నా వీళ్లు శుభశకునాలుగా భావిస్తారు. దేవదారు అరణ్యానికి దగ్గరగా రాగానే హుంబాబా అరుపు వినిపించి ఇద్దరు మిత్రులూ ఒకరినొకరు ఉత్తేజపరుచుకుంటారు.

5) దేవదారు అరణ్య సంరక్షకుడు వాళ్లను భయపెడ్తాడు. అడవిని మోసం చేసావని ఎంకిడును తిట్టి, గిల్గామేష్ పొట్ట చీల్చి, పేగులు భయటపడేస్తానని అరుస్తాడు హుంబాబా! ఏడు మాయాశక్తులున్న హుంబాబాను షామాష్ పంపిన ఎనిమిది లేక పదమూడు గాలులతో దిగ్బంధనం చేసి బంధిస్తారు మిత్రులు. హుంబాబా జాలిచూపమని వేడుకున్నాక గిల్గామేష్ శాంతిస్తాడు. కాని ఎంకిడు ఒప్పుకోడు. శాశ్వత కీర్తికోసం హుంబాబాను చంపాల్సిందే అంటాడు. అలా గిల్గామేష్ హుంబాబాను, అతడి ఏడుగురు కొడుకులను చంపి అరణ్యంపై ఆధిపత్యం సంపాదిస్తాడు. ఎంకిడు ఓ పెద్ద దేవదారు వృక్షాన్ని నరికి దానితో ఎన్‌లిల్ దేవాలయానికి ద్వారాన్ని చేయ సంకల్పిస్తాడు. మిత్రులు అనేక దేవదారు చెట్లు నరికి, బల్లకట్టు పడవలపై వాటిని పేర్చి యూఫ్రటెస్ నదిలో దేవదారు దుంగలు, హుంబాబా తలతో ఉరుక్ చేరుకుంటారు.

6) గిల్గామేష్ సౌందర్యానికి మోహితురాలైన ఇస్తార్ దేవత అతడిని తన భర్తగా ఉండమంటుంది. గిల్గామేష్ ఆమె వెనకటి ప్రణయవృత్తాంతాల్ని వివరించి పొత్తు కుదరదని తేలుస్తాడు. ఇస్తార్ తన తండ్రి 'అను' నడిగి

స్వర్గలోకపు వృషభాన్ని తెచ్చుకుంటుంది గిల్గామేష్‌ను చంపడానికి. (కొన్ని పుస్తకాలలో ఈ స్వర్గలోకపు వృషభం పాతాళలోకపు రాణి ఎరెష్కిగల్ భర్తగా చెప్పబడింది). మిత్రులిద్దరూ ఉరుక్ నగర యువకుల్ని మట్టుబెడ్తున్న ఆ వృషభాన్ని చంపుతారు. విలపిస్తూ శాపనార్థాలు పెడ్తున్న ఇస్తార్ వేపు వృషభపు కుడికాలు లాగి విసుర్తాడు ఎంకిడు. ఉరుక్ ప్రజలు వృషభ మరణానికి సంతోషపడ్తున్నా, ఎంకిడుకు పీడకలలు వస్తాయి.

7) ఆ దుస్వప్నంలో దేవతల సమావేశం, ఎంకిడు మరణించాల్సిందేనన్న దేవతల తీర్పు ఎంకిడును కలచివేసి మంచం పట్టేట్లు చేస్తాయి. తననీ స్థితికి తెచ్చిన వేటగాడు, వేశ్యను తిడ్తున్న ఎంకిడును శాంతపరుస్తాడు షామాష్. రెండవ కలలో ఎంకిడు తనను మృత్యుదూత పాతాళలోకంలోని (Nether World) ధూళిగృహానికి (House of dust) తీసుకు వెళ్లినట్లు కలగంటాడు. పన్నెండు రోజుల పాటు బాధపడి తనకు వీరమరణం లభించ లేదని దుఃఖిస్తూ కన్నుమూస్తాడు ఎంకిడు. ఏడురోజులు ఏకధాటిగా విలపించి, తన దుఃఖం అతడిని బతికిస్తుందన్న ఆశ, ఎంకిడు ముక్కు నుంచి వెలువడిన క్రిమి (Maggot) ని చూసాక భగ్నం కాగా, అంత్యక్రియలు నిర్వహిస్తాడు.

8) ఎంకిడు జ్ఞాపకాలు, అంత్యక్రియలు, విగ్రహ ప్రతిష్ఠాపన, విందులు, నది అడుగున ఖననం ఇవన్నీ కొన్ని వివరంగా, కొన్ని సంక్షిప్తంగా వివరించ బడినాయి.

9) తన మిత్రుడి మరణానికి చింతిస్తూ శాశ్వత జీవనాన్ని పొంది అమరుడు కావాలని గిల్గామేష్ తన సుదీర్ఘ యాత్ర ప్రారంభించినాడు. సుదూరవాసి (Faraway) గా పేరుబడిన ఉత్నాపిష్టిమ్ (Utnapishtim)ను వెదుక్కుంటూ దాదాపు ఉన్మత్తుడిలా గిల్గామేష్ సింహాల్ని చంపి, జంతుచర్మాల్ని ధరించి అనాగరికుడిలా సంచరిస్తుంటాడు. అడవులలో, మైదానాలలో, ఎడారులలో. మాషు పర్వతం వద్ద కాపలా ఉన్న వృశ్చికమానవుల జంట సలహాతో సొరంగ మార్గాన ప్రయాణించి (Twelve double hours) తరువాత దివ్యమణులతో నిండిన చెట్లున్న దేవతల వనానికి చేరుకుంటాడు గిల్గామేష్.

10) అక్కడ మధువు తయారు చేసే సిదూరి (Siduri) అనే యువతి అతడి పట్టుదలను గ్రహించి ఊర్షనాబి అనే పడవ నడిపేవాడి దగ్గరకు పంపుతుంది. తొందరలో గిల్గామేష్ పడవ కొంతభాగాన్ని, కొన్ని శిలావస్తువులను ధ్వంసం చేస్తాడు. అవి పడవ మృత్యుజలాల్ని దాటేందుకు సహకరించేవి. 'కార్యసాధకులకు తొందర, కోపం పనికిరాదు' అన్న హెచ్చరిక ఇక్కడ కనిపిస్తుంది. ఊర్షనాబి కూడా గిల్గామేష్ తలపెట్టిన కార్యం విజయవంతం కాదని చెబుతాడు. అయినా వినకపోవడంతో 120 కర్రల సాయంతో మృత్యు జలాల్ని దాటించి ఉత్నాపిష్టిమ్ ఉన్న చోటుకు తీసుకువెళ్తాడు. ఉత్నాపిష్టిమ్ గిల్గామేష్‌ను మందలించి మానవ జీవితాన్ని ఆనందమయంగా గడపమని ఉద్బోధిస్తాడు.

11) గిల్గామేష్ గమనిస్తాడు తనకు అమరుడైన ఉత్నాపిష్టిమ్‌కు ఏ తేడా లేకపోవడం. ఎలా తనకు అమరత్వం సిద్ధించిందని అడిగితే ఉత్నాపిష్టిమ్ జలప్రళయ వృత్తాంతాన్ని వివరిస్తాడు. ఎన్‌లిల్ మెచ్చుకుని తనకు తన భార్యకు శాశ్వత జీవనాన్నిచ్చి ఇక్కడ నివసించేట్లు చేసాడని చెబుతాడు. నీవింత దూరం శ్రమపడి వచ్చావు సరే, ఏడురోజులు నిద్రపోకుండా ఉండు, నీకు దేవరహస్యం చెబుతా– అంటాడు ఉత్నాపిష్టిమ్. అప్పటికే అలసిపోయిన గిల్గామేష్ అక్కడ వీస్తున్న చల్లగాలికి హాయిగా నిద్రపోతాడు. –'కాసింత నిద్రనే ఆపుకోలేని వాడివి శాశ్వత నిద్రను ఎలా ఆపుతావు?' – అని మందలించి అతడికి రాజోచితమైన దుస్తులను ధరింపజేసి తిరుగు ప్రయాణానికి సిద్ధం చేస్తాడు ఊర్షనాబితో.

జాలిపడిన ఉత్నాపిష్టిమ్ భార్య గిల్గామేష్‌కు ఏదైనా కానుకనిమ్మంటుంది తన భర్తతో. అతడు 'యవ్వనలత' సముద్రం అడుగున లభిస్తుందని చెబుతాడు. (Plant of Heartbeat - Boxthorn plant) తిరుగు ప్రయాణంలో సముద్రపు అడుగుకు వెళ్ళి యవ్వనలతను సంపాదించి తెస్తాడు గిల్గామేష్. దానిని ఉరుక్ నగర ప్రజలకిచ్చి శాశ్వత కీర్తిని సంపాదిస్తాననుకుంటాడు. దారిమధ్యలో స్నానానికి పోయినపుడు ఓ సర్పం ఆ మొక్క పూలవాసనకు ఆకర్షింపబడి దానిని తీసుకుని పారిపోతుంది. ఆ యవ్వనలత ప్రభావంతో

పాము వెంటనే కుబుసాన్ని విడిచి నూతన శక్తి యవ్వనాన్ని పొందుతుంది. అప్పటికే యవ్వనలత దొరికే స్థానానికి దూరంగా రావడం, అది దొరికే చోటు గుర్తించడమనే సమస్యలను అర్థం చేసుకున్న గిల్గామేష్ 'తనకేది ప్రాప్తమో' అదే ప్రాప్తిస్తుందని సమాధానపడతాడు. ఊర్షనాబితో కలిసి దుర్భేధ్యమైన కోటగోడలున్న తన ఉరుక్ నగరాన్ని చేరుకుంటాడు.

12) ఇది ప్రక్షిప్తమని చరిత్రకారుల భావన. ఎందుకంటే ఎంకిడు ఇంకా బతికే ఉన్నట్లుండడం- ఇనాన్నా, తనకు హులుప్పు చెట్టు నాక్రమించుకున్న సర్పాన్ని చంపి, అంజు పక్షిని, లిలితు దయ్యాన్ని వదిలించినందుకు బహుమతులుగా ఇచ్చిన ఢక్క, కర్రలు పిక్కు-మిక్కు (Pikku-Mikku)లు పోయాయని వాటిని వెదకి తీసుకురమ్మని గిల్గామేష్ ఎంకిడును పంపుతాడు. Nether World లో వాటిని చూసిన ఎంకిడు పాతాళలోకపు నిబంధనలను అతిక్రమించడంతో అక్కడ శాశ్వతంగా ఉండిపోవాల్సి వస్తుంది. ఎన్‌లిల్, సుయెన్ (Suen)లు మాట్లాడరు, ఈఆ, షామాష్‌లు భూమిపై నెర్రెలు చేయడంతో ఆ పగులు నుంచి బయటకు వచ్చిన ఎంకిడు ఆత్మ, గిల్గామేష్‌తో పాతాళలోకపు స్థితిగతులను వివరిస్తుంది. గిల్గామేష్‌కు మృత్యువంటే ఉన్న భయం బహుశా పాతాళలోకం లేక మృతులలోకం గురించి అతడికున్న ఆలోచనలు ఈ విధంగా చెప్పబడి ఉంటాయి. 126 సంవత్సరాలు ఉరుక్ రాజ్యాన్ని పరిపాలించినాడు గిల్గామేష్, దేవతల మానసిక స్థితి, మానవ దేహ నిర్మాణంతో సతమతమైనాడు.

37) **బైబిల్‌లోని సంఘటనలు :**

ఈడెన్ వనం - ఆదాము, ఈవ్‌ల ప్రేమగాధను కొందరు ఎంకిడు-షామహత్‌ల ప్రణయంతో పోల్చిచూసినారు.

Advice from Ecclesiastes - సిదూరి గిల్గామేష్‌కు ఇచ్చిన సలహా - A triple stranded rope is not easily broken - రెండు పుస్తకాలలో ఉండడడం విశేషం.

జలప్రళయం–ఉత్నాపిష్టిమ్‌కు Noah-నోవాకు పోలికలు; కథలోని సామ్యాలు. ఎంకిడు ఉన్మత్తత – Book of Daniel లోని నెబుఛాద్ నెజ్జర్ ఉన్మత్తతకు పోలికలు.

Ninti - సుమేరియన్ దేవత–Goddess of life - ఎంకి–Enki దేవుడి పక్కటెముక (Rib) నుంచి సృష్టింపబడడం – Eve కథలా ఉంటుంది.

గిల్గామేష్–ఎంకిడుల మల్లయుద్ధం Jacob-Esau ల కుస్తీలానే ఉంటుంది. Homer వ్రాసిన Iliad, Odyssey లపై గిల్గామేష్ కథ ప్రభావముందని చరిత్రకారుల అభిప్రాయం.

38) **హైందవ పురాణాలలో పోలికలు :** గిల్గామేష్ ఇతిహాసం దాదాపు మన జానపథ కథల్లా కానవస్తుంది. పురాణాలు, జానపద గాథలు, స్త్రీల పాటలు, ఇతిహాసాలలో నుంచి, ప్రజల జీవితాలలోంచి వస్తువును గ్రహించి, దేశ కాలపరిస్థితులకు అన్వయించి నీతులు, ధర్మాలను వల్లెవేస్తూ దుష్టశిక్షణ, శిష్టరక్షణ తోనో నాయకుడి విజయంతోనో, నాయికా నాయకుల సమాగమంతోనో కథలు ముగుస్తాయి. దాదాపు అన్ని కథల్లోనూ నాయకుడికి సరిజోడీ అయిన ప్రతినాయకుడు, నాయిక, నాయకుడికి కొన్ని కష్టాలు, వాటన్నిటిని ధైర్యంతో, విశ్వాసంతో, సత్ప్రవర్తనతో కొండొకచో ఎత్తుకు పైఎత్తులు వేసి, ఒకరిద్దరు నమ్మకస్తులైన సహచరులతో నాయకుడు విజయం సాధిస్తాడు.

మెసొపొటోమియాలో జరిగిన ఈ సంఘటన ప్రతిధ్వనులు మనదేశంలోని ఇతిహాసాలలో, ప్రాక్కథలలో ఏమన్నా వినిపిస్తాయా అని శోధిద్దామా!

కొంకణ దేశంలోని గోవా ప్రాంతం పరశురామ క్షేత్రం. గుడియా అనబడే లగాష్ నగర ప్రభువు (2144-2124 BC) కాలంలో గోవా గుబియో (Gubio) గా పిలవబడేది. అప్పటికే సుమేరియన్లు కొంకణ ప్రాంతంలో వర్తకం చేయడమే గాక స్థిరపడిన దాఖలాలున్నాయి. ఇప్పటికీ గోవా తూనికలు కొలతల్లో సుమేరియన్ల 12 కూబిట్లు ఒక పోల్ (కర్ర) (0.495 మీటర్లు–ఒక కూబిట్టు) ను వాడుతున్నారు.

సర్గాన్ (Sargon), గుడియా (Gudea) రాజులు గిల్గామేష్‌లానే అమరత్వం పొందాలని తపించినవాళ్లే. ముఖ్యంగా గుడియా జీవితం గిల్గామేష్ చరిత్రను పోలి ఉండం గమనార్హం.

ఇక, మన పురాణాలు, కథలను గమనిద్దాం. (1) ఎంకిడును మచ్చిక చేసుకోవడానికి దేవాలయపు వేశ్యను పంపిన వృత్తాంతం మనకు - విభాండకుడు+ఊర్వశిల కలయికతో పుట్టిన ఋష్యశృంగుడిని, వైశాలి అనే వేశ్య తన పరిజనంతో రోమపాదుడు పరిపాలించే అంగదేశంలోకి తీసుకు రాగా కరవు కాటకాలు తొలిగి వానలు పడిన కథ స్ఫురణకు వస్తుంది. తరువాత రామాయణంలానే గిల్గామేష్ ప్రయాణం అడవుల్లోకి సాగుతుంది.

'హుంబాబా' కబంధుడిలా కానవస్తాడు. గిల్గామేష్ చరిత్రలో గిల్గామేష్, ఎంకిడులు వన నివాసి హుంబాబాను గాలుల సాయంతో దిగ్బంధనం చేసి సంహరిస్తారు.

ఇస్తార్ దేవత శూర్పణఖ కాదుగాని ఆమె అవమానం ఆ తరువాత తన తండ్రితో ఫిర్యాదు, వృషభాన్ని లేదా మాయలేడిని పంపడం దానిని వీళ్లు చావగొట్టడం వీటి ఆనవాళ్లు మనకు అనేక కథలలో కానవస్తాయి.

ఎంకిడు మరణం తరువాత మృత్యురహస్యం తెలుసుకోడానికి గిల్గామేస్ చేసే యాత్ర చదువుతున్నప్పుడు నచికేతోపాఖ్యానం, సావిత్రి-సత్యవంతుల కథ మనకు గుర్తువస్తాయి.

అన్నిటికన్నా ముఖ్యమైనది జలప్రళయ కథ. ఇది శతపథ బ్రాహ్మణంలో, పురాణాలలోని మత్స్యావతార వర్ణనలో శ్రాద్ధదేవుడి కథలానే ఉత్నాపిష్టిమ్ కథ ఉంటుంది. అందుకే అతడు సత్యవ్రతుడై మనువుగా మారినాడు. శ్రాద్ధదేవుడు-వివస్వన సూర్యుని కుమారుడు; యముడు, యమి, శని, తపతి, భద్ర, కర్ణ, సుగ్రీవులు ఇతడి సోదర సోదరీమణులు. జలప్రళయం తరువాత ఇతడు ఏడవ మనువై మానవజాతికి తండ్రి అయినాడు. (ఉత్నాపిష్టిమ్ కథలానే).

గిల్గామేష్ సూర్యుడిని షామాష్ పేరుతో కొలిచేవాడు. ఇతడు సూర్యవంశస్థుడే.

Gudea ను గాధిరాజుగా కొందరు భావిస్తారు. రుచీక మహర్షి భార్య సత్యవతి. సత్యవతి తండ్రి గాధిరాజు. గాధి కుమారుడు గాధేయుడు విశ్వామిత్రుడు. సత్యవతి కుమారుడు జమదగ్ని; జమదగ్ని కుమారుడు పరశురాముడు. మంత్రించిన పాయసం ఆరగించడంతో జరిగిన పొరపాటు తల్లీ కూతుళ్లకు విభిన్న వ్యక్తిత్వాలున్న సంతానాన్ని ఇవ్వడానిని ఈ కథ చెబుతుంది. కొందరు సహస్రబ్రాహ్మణులతో కలిసి కొంకణ దేశానికి వచ్చిన పరశురాముడు తమకు కావాల్సిన భూమి కోసం పరశువును సముద్రంలోకి విసరగా సముద్రుడు వెనక్కి తగ్గి భూభాగాన్ని ఇచ్చాడని, అందుకే కొంకణ దేశపు హద్దు పరశువు అంచు ఆకారంలో ఉందని ఐతిహ్యం.

పరశురాముడు, విశ్వామిత్రుడు, దశరథరాముడు, దాదాపు ఈ కాలం వారేమో. (2144-2124 BC). అయినా మన పురాణాల లెక్కలకు నవీన గణాంకాలకు సరిపడదు కదా! (కృష్ణ నిర్యాణం 3126 BC గా కొందరు పండితుల నిర్ణయం). అదే కలికాల ప్రారంభం.

39) **గిల్గామేష్ కాలపు పరిస్థితులు :** నగర రాజ్యాలు, వాటికి ప్రజలపై పూర్తి అధికారమున్న ప్రభువులు. ప్రతి నగరానికి ఓ రక్షక దేవుడు లేదా దేవత. దేవాలయంలో వేశ్యావృత్తి, ప్రభువులకు వివాహమైన యువతితో తొలిరాత్రి గడిపే హక్కు లాంటి దుశ్శాసనాలు; కాలువలు, చెరువుల నిర్మాణం, నదిని దారిమళ్లించగల నైపుణ్యం, దుర్భేధ్యమైన కోటగోడల నిర్మాణం, విచ్చలవిడిగా లభ్యమయ్యే ద్రాక్షసారాయి, బల్లకట్టు పడవల నిర్మానం, పెద్దపెద్ద దుంగలు, రాళ్లు నదీప్రవాహంలో తరలించగల విధానాలు, దేవతలు, దయ్యాలపై నమ్మకాలు, స్వప్న విశ్లేషణ - ఇవన్నీ వాళ్ల జీవితాల్లో భాగాలు. రాగి, ఇనుప లోహాలు, వైడూర్యం, బంగారం, వెండి, ముత్యాలు బాగా ప్రసిద్ధికెక్కిన సంపదలు. గొడ్డళ్లు, కత్తులు, ఈటెలు ఆయుధాలు; మృతుల్ని ఖననం చేసేవారు. వాళ్లు వాడిన ఆయుధాలు, నరికిన చెట్ల పరిమాణం గమనిస్తే వాళ్లు మహాకాయులుగా కానవస్తారు.

40) **ఉరుక్ -** ఈ పట్టణపు అవశేషాలు ప్రస్తుత ఇరాక్ - అల్‌ముతానా-సమూవా పట్టణానికి తూర్పున ముప్ఫై కిలోమీటర్ల దూరంలో కనిపిస్తాయి.

# BIBLIOGRAPHY


1) The Epic ofGilgamesh - N.K. Sandars

2. Inanna, Queen of Heavn and Earth - Diane Wokstein

3) Inanna, Lady of Largest Heart - Enheduanna

4) World Mythology - Roy G. Willis

5) World Mythology - Paragon Books

6) World Mythology - MC Graw Hill

7) Inanna - Dr. Lanka Siva Rama Prasad

8) Wikipedia



## Dr. LANKA SIVA RAMA PRASAD

M.B.B.S; M.S. GENERAL SURGERY
M.Ch. CARDIOTHORACIC SURGERY
Fellow in VASCULAR SURGERY
Post graduate Diplomate in Human Rights
Post graduate Diplomate in Television Production
Cell animation Specialist- Heart Animation Academy
Computer Animation Specialist- Pentafour- Chennai
Web Engineer and Web Designer- Web City- Hyderabad
Fellow of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

### I. Poetry (Telugu)

1. Alchemy
2. Vaana Mabbula Kanthi Khadgam
3. Tea Kappulo Toofan
4. Tangeti Junnu
5. Karakatakam (Cancer)
6. Oka Sarassu – Aneka Hamsalu (Psychiatry)
7. Marana Saasanam
8. Sri Lalitha Sahasranama Stotram
9. Kuyyo – Morro Satakam
10. Bhairava Satakam

### II. Poetry (English)

11. Shades
12. The Twilight Zone
13. My Poem is My Birth Certificate
14. The Pendulum Clock, The Gramophone, The Typewriter and The Pen
15. The Vigilance Whistle!
16. How to Cook a Delicious Poem
17. Windows and Apples
18. The Guerdon of Poesy
19. The Haste Land
20. Bees Need No Invitation When Flowers Bloom...
21. The Poet that launched a thousand poems
22. Walking with My Moon
23. Reflections

## III. Stories, Novels, Essays… (Telugu)

24. Katti Anchupai (Noir Stories)
25. Chupke – Chupke (Woman diseases)
26. Akshararchana
27. Deepa Nirvana Gandham (Death)
28. Swapna Sastram (Dreams-1)
29. Kalalu-Peeda Kalalu (Dreams-2)
30. Satyanveshanalo (Novel)
31. Sankya Sastram (Numerology)
32. Dr. Jayadev Cartoons (Cartoons)
33. Kathalu – kavitalu
34. Genome (Biotechnology Novel)

## IV Stories, Novels, Essays (English)

35. In Search of Truth (Novel)
36. How to be happy (Philosophy)
37. Bouquet of Telugu Songs and Poems

## V Translations (English to Telugu)

38. Iliad (Homer)
39. Odyssey (Homer)
40. Epic Cycle (Homer)
41. Three Greek Tragedies
42. The Poems of Sappho
43. Aeneid (Virgil)
44. Pilgrim's Progress (John Bunyan)
45. Paradise Lost (John Milton)
46. Paradise Regained (John Milton)
47. Divine Comedy (Dante)
48. Faust (Goethe)
49. World Famous Stories
50. Namdeo Dhasal Poetry
51. William Blake Poetry
52. Emily Dickinson Poetry – Part I
53. Emily Dickinson Poetry – Part II
54. Emily Dickinson Poetry – Part III
55. Emily Dickinson Poetry – Part IV
56. Emily Dickinson Poetry – Part V
57. Russian Poetry
58. Jalapatam (Eighteen English Poets)
59. Dabbu Manishi (Money Poetry)
60. Santi Yuddham (War-Peace)
61. Christu Adbhuta Geethalu
62. The Path of Christ

63. Silappadikaram
64. Manimekhala
65. Sangam Poetry
66. Conference of Birds (Attar)
67. Masnavi - Part 1
68. Masnavi - Part 2
69. Masnavi - Part 3
70. Masnavi - Part 4
71. Masnavi - Part 5
72. Masnavi - Part 6
73. Madhusala (Edward Fitzgerald)
74. Sougandhika (Master Poems in English-1)
75. Toorpu Padamara (Master Poems in English-2)
76. Prema Kurisina Velalo… (Master Poems in English-3)
77. Vallu Mugguru (Master Poems in English-4)
78. Alanati Kothagali (Master Poems in English-5)
79. Manchu Toofan (Master Poems in English-6)
80. Endaa – Vaana (Master Poems in English-7)
81. Pillanagrovi Pipupu (Master Poems in English-8)
82. Naalugu Dikkulu (Master Poems in English-9)
83. Allanta Doorana Aa Paata Vinavacche (Master Poems in English-10)
84. Divya Vastrala Kosam (Master Poems in English-11)
85. Oka Madhusala (Master Poems in English-12)
86. The Axion Esti (Odysseus Elytis)
87. Love & Death (Frederico Garcio Lorca)
88. Ten Thousand Lines (Edwin Cordevilla)
89. Century of Love (Roula Pollard)
90. Pablo Neruda Poetry
91. Mexican Poetry
92. Inanna (Queen of Heaven and Earth)
93. Sataroopa (A.K. Khanna)
94. Aamani (Master Poems in English-13)
95. Kotha Deepalu (Master Poems in English-14)

## VI Translations (From Telugu, Hindi to English)

96. Bhagavatam (Potana)
97. Soundarya Lahari (Sankaracharya)
98. Modern Bhagavadgita
99. Samparayam (Suprasanna)
100. The Tree of Fire (Anumandla Bhoomaiah)
101. The Poems of Kuppam (Seeta Ram)
102. We Need a Language (T.W. Sudhakar)
103. The Broken Grammer (T.W. Sudhakar)
104. The Voice of Telangana (Madiraju Ranga Rao)
105. Fire and Ice (Rama Chandramouli)

106. The Tears of Bliss
107. This is no Streaking (Stories – K.K. Menon)
108. The Pool of Blood (Novel – Ampasayya Naveen)
109. Madhusala (Harivamsa Roy Bacchan)
110. Journey to Manasa Sarovar (English poetry)
111. Smooth Hands- Sosonjan A. Khan- (Bilingual)
112. Dancing Winds- Maria Miraglia (Bilingual)
113. Moments- Alicja Kubreska (Bilingual)
114. Tayouan Pai Pai- Yaw-Chin Fang(Bilingual)
115. The World of Extinct Lamps- Izabela Zubko (Tri lingual)
116. Pearls of Wisdom- Pramila Khadun- (Bilingual)
117. The Wind my lover- Ade C. Manila-(Bilingual)
118. The Mystic Mariner- Madan Gandhi (Bilingual)
119. Ten Color Rainbow - The Poems from Poland (Bilingual)
120. The True Meaning of Life - Rashid Pelpuo
121. The Wind My Lover - Ade C. (Bilingual)
122. Jak Ziemia Po Pierwszym Deszezu - The Poems from Poland (Bilingual)
123. Prima Ballerina Roberta Di Laura
124. The Casket of Vermilion (English Poetry)
125. Barefoot to Arcadia - Aprilia Zank (Bilingual)
126. Lets be one in The One - George Onsy (Bilingual)
127. Riding the Tide - Ashok Bhargava (Bilingual)
128. The Collected poems of Dr. LSR Prasad

**New ones- to be released**

129. The Epic of Gilgamesh
130. Krzysztof Kokot - Around the Haiku
131. Renata Cygan - I am a troubadour
132. Sergio Camellini - The Planet of Pink Clouds
133. Kumkum Bharine
134. Oulaya Drissi El Bouzaidi - A Long-winged Breath
135. Agnieszka Jarzebowska - The Fifth Season
136. The Making of Mahatma
137. Juliusz Erazm Bolek - The Secrets of life - A Calendar in verse
138. The Songs of Annamayya
139. Basudeb Chakraborti Poetry
140. Poland Poetry - As Clear as the Sun
141. Nazi Naaman Poetry

The Epic Story of Gilgamesh

# గిల్గామేష్ చరిత్ర

(ప్రపంచపు తొలి ఇతిహాసం)



(గిల్గామేష్ కావ్యంలో- అంతర్లీనంగా ఉన్న కథాంశం-
శాశ్వత జీవనానికై అన్వేషణ, మృత్యువును జయించాలన్న ఆకాంక్ష)
రెండు వంతులు దేవుడు ఒకవంతు మనిషి అయిన గిల్గామేష్‌కు
దేవతలకుండే సహజ గుణాలు, శక్తులు,
మానవుడికుండే బలహీనతలు, మృత్యుభీతి కలిసి ఉండడంతో
తానూ అమరుడిని కావాలని అతడు చేసిన దీర్ఘ ప్రయాణం,
మనిషికి, మృత్యువు తప్పదన్న గ్రహింపుతో ముగుస్తుంది.







Dr. Lanka Siva Rama Prasad

డాక్టర్ లంకా శివరామప్రసాద్